www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 29-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 135

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 1.38 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆర్ద్ర సా. 4.39 తదుపరి పునర్వసు వర్జ్యం: తె. 5.17 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 10.12-11.01, మ. 3.09-3.58; అమృతఘడియలు: ఉ. 6.19-7.58; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.27 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జన్వాడ ఫామ్‌హౌస్‌కు అనుమతులే లేవు!

అయినా.. ఇంటి నంబర్ కేటాయింపు.. పన్ను వసూళ్లు

111 జీవో నిబంధనలకు పూర్తి విరుద్ధంగా నిర్మాణం

రెండో రోజూ కొనసాగిన రెవెన్యూ అధికారుల సర్వే

ఫిరంగి కాలువలో, బఫర్ జోన్‌లో ఆక్రమణలపై ఆరా

ఒకటి, రెండు రోజుల్లో మరోసారి పరిశీలించే చాన్స్

పూర్తి వివరాలతో త్వరలోనే కలెక్టర్‌కు నివేదిక

11

ఎఫ్‌టీఎల్‌లో సుందరీకరణా?

హైడ్రా కమిషనర్ విస్మయం

రాంనగర్‌లో నాలా ఆక్రమణలు, మీర్‌పేటలో చెరువుల పరిశీలన

రికార్డులు ప్రకారం చర్యలు చేపట్టాలని రంగనాథ్ ఆదేశాలు



స్మార్ట్ జహీరాబాద్

త్వరలో దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీల అభివృద్ధి

తెలంగాణలో జహీరాబాద్.. ఏపీలో ఓర్వకల్, కొప్పర్తి ఎంపిక

రూ.28,602 కోట్ల అంచనా వ్యయం

1.52 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

10 లక్షల మందికి ప్రత్యక్షంగా.. 30 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోని 10 రాష్ట్రాల్లో 12 పారిశ్రామిక స్మార్ట్ నగరాలను అభివృద్ధి చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. బుధవారం జరిగిన ఈ భేటీలో మొత్తం 12 స్మార్ట్ సిటీలకు గాను కేంద్రం రూ.28,602 కోట్ల మేర నిధులను కేటాయించనున్నట్లు ప్రకటించింది. వీటిల్లో తెలంగాణలోని జహీరాబాద్(సంగారెడ్డి జిల్లా)లో ఒకటి, ఆంధ్రప్రదేశ్‌లోని ఓర్వకల్(కర్నూలు జిల్లా), కొప్పర్తి (కడప జిల్లా)లో స్మార్ట్ పారిశ్రామిక నగరాలు అభివృద్ధి చెందనున్నాయి. దీంతోపాటు.. వ్యవసాయ

మిగతా 2వ పేజీలో...

జహీరాబాద్ వాసుల హర్షం

3,245 ఎకరాల్లో స్మార్ట్‌సిటీ నిర్మాణం

రూ.2,361 కోట్ల అంచనా వ్యయం

1.74 లక్షల మందికి ఉపాధి 14

పోలవరానికి రూ.12,127 కోట్లు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

3

జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, సీఎస్ శాంతికుమారి, వేం నరేందర్‌రెడ్డి



కూల్చివేతలపై తగ్గేదేలే!

ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా హైడ్రా ఆగదు

తొలుత చెరువుల్లోని నిర్మాణాలను కూల్చడమే లక్ష్యం

తరువాత బఫర్‌జోన్లు, నాలాలు, పార్కులపై దృష్టి

నా కుటుంబ సభ్యులకు ఆక్రమణలున్నాయని ఎవరైనా ఆధారాలు చూపిస్తే.. వాటినీ కూల్చివేస్తాం

ప్రస్తుతానికి హైడ్రా విధానం హైదరాబాద్‌కే పరిమితం

హైడ్రా చర్యలకు.. పార్టీలో చేరికలకు సంబంధం లేదు

ప్రభుత్వ విధానాలు నచ్చి ఎవరైనా వస్తే చేర్చుకుంటాం

నేను రేవంత్‌రెడ్డిని.. నాకు కేసీఆర్‌తో పోలికేంటి?

కన్నకొడుకు కేటీఆర్‌నే కేసీఆర్ నమ్మడం లేదు

బీఆర్ఎస్-బీజేపీ ఒప్పందం మేరకే కవితకు బెయిల్

ఐదు నెలల్లోనే 18 వేల కోట్ల రుణమాఫీ చేశాం

గత ప్రభుత్వం ఐదేళ్లలో 13 వేల కోట్లే మాఫీ చేసింది

విలేకరులతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హైడ్రా కూల్చివేతల విషయంలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలు ఎవరివైనా సరే కూల్చివేస్తామని తేల్చిచెప్పారు. 30 ఏళ్ల కిందట నిర్మించిన కట్టడాలైనా ఆక్రమణల్లో ఉన్నాయని తేలితే చర్యలుంటాయన్నారు. బుధవారం సచివాలయంలో మీడియాతో సీఎం ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మొదటగా చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలపై దృష్టి సారించామని, వాటిని తొలగించిన తరువాత బఫర్‌జోన్లు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తన కుటుంబ సభ్యులకైనా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలున్నట్లు ఎవరైనా ఆధారాలు చూపిస్తే.. వాటిని

మిగతా 13వ పేజీలో...

అంగరంగ వైభవంగా..

డిసెంబరు 9న లక్షలాది మంది సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

మిలియన్ మార్చ్ తరహాలో కార్యక్రమం

దసరా వరకు మంచిరోజులు లేనందునే హడావుడిగా భూమిపూజ: సీఎం

సచివాలయంలో విగ్రహ ఏర్పాటుకు రేవంత్ భూమిపూజ

13

ఫోర్త్ సిటీకి అనువుగానే..

ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్


పరిశ్రమల్లో పని చేసేవారికి విద్య, వైద్యం, ఇతర వసతులు.. ఆ మేరకు మార్పులు

తొలుత రేడియల్ రోడ్ల భూసేకరణ

డ్రైపోర్ట్ కోసం మచిలీపట్నం, కాకినాడ రేవులతో అనుసంధానంపై అధ్యయనం

సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కొందరినే టార్గెట్ చేయొద్దు



అందరినీ ఒకే విధంగా చూడాలి

అధికారుల అక్రమ నిర్మాణాల నుంచి కూల్చివేతలు మొదలుపెట్టండి 11

లక్ష అక్రమ నిర్మాణాలు ఉన్నాయి.. అన్నింటికీ నోటీసులిస్తారా?: హైకోర్టు

ఎమ్మెల్యే మర్రి విద్యా సంస్థల భూమి పత్రాలను పరిశీలించండి.. వారి వాదనలు వినండి

7రోజుల్లో కూలుస్తామన్న నోటీసులపై ఎడ్యుకేషనల్ సొసైటీల పిటిషన్ల మీద హైకోర్టు ఆదేశం 11



సీఎం సోదరుడి ఇంటికీ నోటీసులు

11

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో తిరుపతిరెడ్డి ఇల్లు, ఆఫీస్

30 రోజుల్లో తొలగించాలంటూ నెక్టర్స్, డాక్టర్స్ కాలనీలు, కావూరీహిల్స్‌వాసులకు జారీ

చిత్రహింసలు పెట్టారు!

ముంబై నటి కాదంబరి, ఆమె తల్లి ఆశా ఆవేదన

కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఏపీ అధికారులు.. కన్నీటి పర్యంతమవుతూ వివరాల వెల్లడి

చంద్రబాబునే అరెస్టు చేశాం.. మీరెంత అని బెదిరించారు: ఆశా జెత్వానీ

కుక్కల విద్యాసాగర్ అసభ్య చిత్రాలతో వేధించారు: కాదంబరి

అక్రమ అరెస్టులో నాటి ఐపీఎస్‌ల పాత్రపై ఆరా తీస్తున్న ఉన్నతాధికారులు

(విజయవాడ/అమరావతి - ఆంధ్రజ్యోతి)

'చంద్రబాబునే అరెస్టు చేశాం! ఇక మీరెంత! మాతో పెట్టుకుంటే అంతే!'.. ముంబై నటిని 'వైసీపీ' పోలీసులు బెదిరించిన తీరిది! ఆమె పేరు.. కాదంబరి జెత్వానీ! నటి మాత్రమే కాదు.. వైద్యురాలు కూడా! వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ పెట్టిన తప్పుడు కేసులో ఆమెను, ఆమె తల్లిదండ్రులనూ అరెస్టు చేయించి నరకం చూపించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వరుస కథనాలు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించాయి. దీంతో... పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. 'అప్పుడు ఏం జరిగింది? ఇందులో కుక్కల విద్యాసాగర్ పాత్ర ఏమిటి? ఎవరి ఆదేశాల మేరకు అప్పటి పోలీసు కమిషనర్ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీ అత్యుత్సాహం ప్రదర్శించారు?' వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో నేరుగా ముంబై



కాదంబరి

నటి కాదంబరితోపాటు ఆమె కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... అంతర్జాతీయ స్మగ్లర్లు, ఉగ్రవాదుల తరహాలో తమను ఏపీ పోలీసులు అరెస్టు చేసి విమానంలో తీసుకొచ్చారని జెత్వానీ కుటుంబ సభ్యులు వాపోయారు. విశాల్ గున్నీ నేతృత్వంలో జెత్వానీని, ఆమె తల్లిదండ్రులను ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన విజయవాడకు తీసుకొచ్చారు. మూడు రోజులపాటు వారిని ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో ఉంచారు. తీవ్రంగా హింసించారు. ఫిబ్రవరి 6వ తేదీన కాదంబరిని రిమాండుకు పంపించారు. "ఏపీలో ఎంత పెద్దవారైనా వైసీపీ నేతలతో పెట్టుకుంటే జైలుకు వెళ్లాల్సిందే. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిస్థితి చూశారా" అని ఆమె తల్లి ఆశా జెత్వానీని హెచ్చరించారు. రాజీపడాలని, భవిష్యత్తులో ఇటువైపు

మిగతా 3వ పేజీలో...



కంచే చేను మేస్తే..

సైబర్ నేరగాళ్లకు.. బ్యాంకు మేనేజర్ సాయం

2 నెలల్లో 6 ఖాతాల నుంచి.. రూ.175 కోట్ల మేర లావాదేవీలు

ఎస్‌బీఐ మేనేజర్, మరో నిందితుడి అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లకు సహకరించిన భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) మేనేజర్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. బ్యాంకు మేనేజర్ స్థాయి అధికారి సైబర్ నేరాల్లో అరెస్టవ్వడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి. సైబర్ కేటుగాళ్లు దేశ వ్యాప్తంగా నమోదైన 600 కేసుల్లో.. రూ. 175 కోట్లను లూటీ చేయగా.. ఆరు బ్యాంకు ఖాతాల ద్వారా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు ఇది వరకే గుర్తించారు. గత శనివారం ఇద్దరిని అరెస్టు చేశారు. తదుపరి దర్యాప్తులో.. తీగ లాగితే హైదరాబాద్ షంషీర్‌గంజ్ ఎస్‌బీఐ

మిగతా 14వ పేజీలో...

జగన్‌కు బిగ్ షాక్!


వైసీపీకి మోపిదేవి గుడ్‌బై.. రాజ్యసభకు నేడు రాజీనామా



మోపిదేవి వెంకటరమణ



పోతుల సునీత



బీద మస్తాన్‌రావు



ఆర్. కృష్ణయ్య

త్వరలో టీడీపీలోకి.. అదే దారిలో మరో వైసీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు

అయోధ్య రామిరెడ్డి, బోస్, బాబూరావు, రఘునాథరెడ్డి, ఆర్.కృష్ణయ్య కూడా?

పార్టీలో ఉంటే భవిష్యత్ లేదనే అంచనా

ఇక వైసీపీలో మిగిలే ఎంపీలు వైవీ, విజయసాయిరెడ్డి, నిరంజన్‌రెడ్డే?

పార్టీకి ఎమ్మెల్సీ పోతుల సునీత గుడ్‌బై.. శాసనమండలి సభ్యత్వానికీ రాజీనామా

అమరావతి/బాపట్ల/న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆ పార్టీ నేతలు భారీ షాకిచ్చారు. ఆయనకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు.. చేనేత వర్గానికి చెందిన ఎమ్మెల్సీ పోతుల సునీత వైసీపీకి గుడ్‌బై చెప్పారు. మోపిదేవి దారిలోనే వైసీపీకి చెందిన ఇంకో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు కూడా పదవికి, పార్టీకి రాజీనామా చేయనున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. వీరిద్దరూ గురువారం ఢిల్లీలో రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా సమర్పించబోతున్నట్లు వైసీపీ వర్గాలు కూడా వెల్లడించాయి. ఇంకొందరు రాజ్యసభ ఎంపీలు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మేడా రఘునాథరెడ్డి, ఆర్.కృష్ణయ్య,

మిగతా 3వ పేజీలో...

నైపుణ్య శిక్షణ

నాలుగేళ్లలో 50 వేల మందికి..

ఎన్ఎస్ఐసీతో ఒప్పందం

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి 3

యోగి సర్కారు సోషల్ ధమాకా!

ప్రభుత్వ పథకాలు ప్రచారం చేసే ఇన్‌ఫ్లూయెన్సర్లకు పారితోషికం

నెలకు రూ.2 లక్షల నుంచి రూ.8 లక్షల దాకా చెల్లింపు 2

శత్రువుల పీచమణిచే అణుజలాంతర్గామి..

ఐఎన్ఎస్ అరిఘాత్ రెడీ!

సెప్టెంబరులో ప్రధాని చేతులమీదుగా జాతికి అంకితం

ఏర్పాట్ల పరిశీలనకు నేడు విశాఖకు రక్షణమంత్రి రాజ్‌నాథ్!

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అణుత్రయంలో అత్యంత కీలకమైన, బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థ కలిగిన అణు జలాంతర్గామి.. 'ఐఎన్ఎస్ అరిఘాత్' నేవీ అమ్ములపొదిలోకి చేరేందుకు సిద్ధమైంది. ఐఎన్ఎస్ అరిహంత్ తర్వాత దేశీయంగా భారత్ అభివృద్ధి చేసుకున్న రెండో 'న్యూక్లియర్ పవర్డ్ బాలిస్టిక్ మిస్సైల్ సబ్‌మెరైన్' ఇది. శత్రుదేశాల్లోని సైనిక స్థావరాలను, అణువిద్యుత్ కేంద్రాలు, సమాచార వ్యవస్థలను ధ్వంసం చేసే స్ట్రాటజిక్ క్షిపణులను నీటి అడుగునుంచి ప్రయోగించగలదు. భారతదేశ తొలి అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ చక్ర.. రష్యా నుంచి లీజుకు తీసుకున్నది. అయితే, పదిహేనేళ్ల క్రితం సొంతంగా అణు జలాంతర్గాముల నిర్మాణాన్ని చేపట్టిన భారత్.. విశాఖలోని నేవీ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో వాటిని

మిగతా 2వ పేజీలో...



ఐఎన్ఎస్ అరిఘాత్



మాఫీపై తలోమాట

సీఎం, మంత్రులు ఎవరికి తోచినట్టు వారు..

సోనియా, రాహుల్ కూడా బీజేపీతో కుమ్మక్కా?

అందుకే నేషనల్ హెరాల్డ్‌లో బెయిలొచ్చిందా?: కేటీఆర్

కేటీఆర్ చేయి అందుకొని ఇంట్లోకి వెళ్తూ కవిత అభివాదం

అమ్మ కాళ్లకు మొక్కి.. అన్నకు రాఖీ కట్టి..

బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కవిత భావోద్వేగం

హారతి ఇచ్చి స్వాగతం పలికిన కేటీఆర్ సతీమణి శైలిమ

శంషాబాద్ విమానాశ్రయంలో గులాబీ శ్రేణుల సందడి

నేడు ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో తండ్రి కేసీఆర్‌తో భేటీ

ఐదున్నర నెలలు అన్యాయంగా జైల్లో నిర్బంధించారు 14

అపవాదుల నుంచి కడిగిన ముత్యంలా బయటపడతా పోరాటం కొనసాగిస్తా.. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుంది: కవిత

భారీగా పెరిగిన

విద్యార్థుల ఆత్మహత్యలు!

జనాభా పెరుగుదల రేటునూ దాటేసిన వైనం

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడులో అత్యధికం

యువకుల్లో కంటే యువతుల్లోనే ఎక్కువ

మానసిక ఒత్తిడి తదితర కారణాలు.. కౌన్సెలింగ్‌తో నివారణ

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు ఏటా భారీగా పెరిగిపోతున్నాయని తాజా నివేదిక ఒకటి ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థుల ఆత్మహత్యల వార్షిక పెరుగుదల రేటు దేశంలోని జనాభా పెరుగుదల రేటును కూడా దాటేసిందని తెలిపింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) సమాచారం ఆధారంగా ఐసీ3 స్వచ్ఛంద సంస్థ ఈ నివేదికను రూపొందించింది. పోలీసు రికార్డులకు ఎక్కని ఆత్మహత్యలు కూడా కలిపితే ఈ రేటు మరింత ఆందోళనకరస్థాయిలో ఉంటుందని నివేదిక పేర్కొంది. 'స్టూడెంట్స్ సూసైడ్స్: యాన్ ఎపిడెమిక్ స్వీపింగ్ ఇండియా' పేరిట రూపొందించిన ఈ నివేదికను బుధవారం యాన్యువల్ ఐసీ3 కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్‌పో-2024లో విడుదల చేశారు. దేశంలో ఆత్మహత్యల సంఖ్య ఏటా రెండు శాతం పెరిగిపోతుండగా, విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య 4 శాతం పెరిగిపోతోందని తెలిపింది. గత రెండు దశాబ్దాల్లోనే



మిగతా 2వ పేజీలో...

భారీగా పెరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు!

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల వార్షిక ఆత్మహత్యల రేటు 4 శాతానికి పెరిగిందని వెల్లడించింది. 'గత దశాబ్ద కాలంలో దేశంలో 0 నుంచి 24 ఏళ్లలోపు జనాభా 58.2 కోట్ల నుంచి 58.1 కోట్లకు తగ్గిపోయింది. అదే సమయంలో విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య 6,654 నుంచి 13,044కి పెరిగిపోయింది' అని తెలిపింది. గత దశాబ్ద కాలంలో పురుష విద్యార్థుల ఆత్మహత్యలు 50 శాతం, మహిళా విద్యార్థుల ఆత్మహత్యలు 61 శాతం పెరిగిపోయాయని పేర్కొంది. 2022 సంవత్సరంలో జరిగిన విద్యార్థుల ఆత్మహత్యల్లో 53% పురుష విద్యార్థులు ఉన్నారని వివరించింది. అలాగే, 2021-2022 మధ్య పురుష విద్యార్థుల ఆత్మహత్యలు 6 శాతం తగ్గగా, విద్యార్థినుల ఆత్మహత్యలు 7 శాతం పెరిగిపోయాయని పేర్కొంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడుల్లో విద్యార్థుల ఆత్మహత్యలు అత్యధికంగా జరుగుతున్నాయని, దేశంలో మూడో వంతు ఆత్మహత్యలు ఈ మూడు రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయని తెలిపింది. కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధి చెందిన కోటా ప్రాంతం ఉన్న రాజస్థాన్‌లో విద్యార్థులు అత్యధిక ఒత్తిడికి గురవుతున్నారని, దీంతో విద్యార్థుల ఆత్మహత్యల్లో ఆ రాష్ట్రం 10వ స్థానంలో నిలిచిందని నివేదిక పేర్కొంది. మానసిక ఒత్తిళ్లు తదితర కారణాలతోనే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మన విద్యాసంస్థల్లో మానసిక ఆరోగ్య సవాళ్లను పరిష్కరించాల్సిన అత్యవసర స్థితిని ఈ నివేదిక తేటతెల్లం చేస్తోందని ఐసీ3 వ్యవస్థాపకుడు గణేశ్ వ్యాఖ్యానించారు. కౌన్సెలింగ్ సదుపాయాలను పెంచాల్సిన ఆవశ్యకతను ఇది తెలియజేస్తోందన్నారు.

యోగి సర్కారు సోషల్ ధమాకా!

- ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసేందుకు సోషల్ మీడియా
- ఇన్‌ఫ్లూయెన్సర్లకు నెలకు రూ.2 లక్షల నుంచి రూ.8 లక్షలు
- కొత్త పాలసీకి యోగి క్యాబినెట్ ఆమోదం.. విపక్షాల విమర్శలు

లఖ్‌నవూ, ఆగస్టు 28: తమ పథకాలకు ప్రచారం కల్పించే సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్లకు ప్రభుత్వమే నేరుగా నెలకు రూ.లక్షల్లో పారితోషికంగా ఇచ్చేలా.. అదే సమయంలో, దేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లే పోస్టులు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపేలా యూపీ ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందించింది. దీనికి యూపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం దేశ వ్యతిరేక పోస్టులను తీవ్ర నేరంగా పరిగణిస్తారు. వారికి మూడేళ్ల నుంచి యావజ్జీవ ఖైదు దాకా విధించే అవకాశం ఉంది. ఇక, పారితోషికాల విషయానికి వస్తే.. ప్రభుత్వం 'వి-ఫామ్' పేరుతో ఒక డిజిటల్ ఏజెన్సీని నియమించింది. ఆ ఏజెన్సీ యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టా వంటివాటిలో పోస్టులు, వీడియోలు, ట్వీట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటుంది. సబ్‌స్క్రైబర్లు, ఫాలోయర్ల సంఖ్యను బట్టి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను 'వి-ఫామ్' నాలుగు శ్రేణులుగా విభజించి.. తగిన పారితోషికాన్ని ఇస్తుంది. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఇన్‌ఫ్లూయెన్సర్లకు వారి కేటగిరీని బట్టి వరుసగా రూ.5 లక్షలు, రూ.4 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల చొప్పున నెలవారీ పారితోషికం ముట్టజెబుతుంది. యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్లకైతే వారి వీడియో కంటెంట్‌ను బట్టి ఏకంగా నెలకురూ.8 లక్షల దాకా ఇస్తుంది. షార్ట్‌ఫిలిమ్స్, పాడ్‌కాస్ట్‌ల వంటివి చేసేవారికి రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షల దాకా ఇస్తుంది. అయితే.. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ హక్కును కాలరాసేందుకే యోగి సర్కారు ఈ పాలసీని రూపొందించిందని యూపీలో విపక్షాలు మండిపడుతున్నాయి. "ప్రభుత్వానికి భజనచేసేవారికి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని ధారపోసి.. ప్రజా సమస్యలను సోషల్ మీడియా వేదికగా లేవనెత్తేవారికి జైలు శిక్ష వేసేందుకే బీజేపీ/యోగి ప్రభుత్వం ఈ పాలసీని తెచ్చింది" అని సమాజ్‌వాదీ పార్టీ మండిపడింది.

అభ్యర్థిత్వ రద్దు అధికారం యూపీఎస్సీకి లేదు:పూజ

న్యూఢిల్లీ, ఆగస్టు 28: తనను అనర్హురాలిగా ప్రకటించే అధికారం యూపీఎస్సీకి లేదని మాజీ ఐఏఎస్ ప్రొబేషనరీ అధికారి పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టులో వాదించారు. అధికార దుర్వినియోగం, నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారన్న ఆరోపణలతో పూజ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె కేసు ఢిల్లీ హైకోర్టులో ఉంది. పూజపై ఆరోపణల మీద విచారణ జరిపిన యూపీఎస్సీ.. జూలై 31న ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతో పాటు భవిష్యత్తులో ఏ పరీక్షలూ రాయకుండా నిషేధం విధించింది. దీన్ని పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేశారు. తాను ఏ పత్రాలనూ ఫోర్జరీ చేయలేదని తెలిపారు. ఒక్కసారి ఐఏఎస్ శిక్షణకు ఎంపికై, ప్రొబేషనర్‌గా నియమించిన తర్వాత తన అభ్యర్థిత్వాన్ని రద్దు చేసే, అనర్హత వేటు వేసే అధికారం యూపీఎస్సీకి లేదని చెప్పారు. "సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ విభాగాని (డీవోపీటీ)కి మాత్రమే అఖిల భారత సర్వీసుల చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది" అని ఆమె కోర్టుకు తెలిపారు.

ఢిల్లీ నెహ్రూ ఆస్పత్రిలో ఐదేళ్లలో 4 వేల చిన్నారుల మృతి

ఢిల్లీ, ఆగస్టు 28: దేశ రాజధానిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారుల మరణాలకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఢిల్లీ ప్రభుత్వాధీనంలో నడిచే చాచా నెహ్రూ ఆస్పత్రిలో జూన్ 2019 నుంచి ఈ ఏడాది జూన్ వరకు 4,095 మంది చిన్నారులు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. వీరంతా 5 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. న్యూమోనియా, సెప్సిస్, సెప్టిక్ షాక్ వంటి రకరకాల అనారోగ్య కారణాల వల్ల చిన్నారుల మరణాలు సంభవించినట్లు సమాచారా హక్కు చట్టం ద్వారా లభ్యమైన నివేదికలో బహిర్గతమైంది. ఢిల్లీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారుల మరణాలపై అమిత్ గుప్తా అనే ఆర్టీఐ కార్యకర్త సేకరించిన సమాచారం ఆధారంగా ఈ విషయాలు బయటపడ్డాయి. 2019లో అత్యధికంగా 875 మంది చిన్నారులు చనిపోయారు.


కశ్మీర్ ఎన్నికల్లో పోటీ చేయను: మెహబూబా

శ్రీనగర్, ఆగస్టు 28: వచ్చే నెల జరగనున్న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయబోనని మాజీ సీఎం, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ప్రకటించారు. తాను సీఎం పదవిని చేపట్టినా కేంద్ర పాలిత వ్యవస్థలో తమ పార్టీ ఎజెండాను అమలు చేయలేకపోవచ్చని చెప్పారు. 2016లో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 12 వేల మందిపై కేసులు రద్దు చేయించానని, వేర్పాటువాదులను చర్చలకు ఆహ్వానిస్తూ లేఖ రాశానని, కాల్పుల విరమణను అమలు చేయించానని, అలా ఇప్పుడు చేయగలనా అని ప్రశ్నించారు. అప్పట్లో పీడీపీ-బీజేపీ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. తర్వాత విభేదాలతో బీజేపీ మద్దతు ఉపసంహరించుకోవడంతో మెహబూబా ముఫ్తీ రాజీనామా చేశారు.

బెంగాల్ తగలబడితే అసోం కాలిపోద్ది: మమత

కోల్‌కతా, ఆగస్టు 28: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ బీజేపీ పిలుపునిచ్చిన బంద్ హింసాత్మకంగా మారిన నేపథ్యంలో ఆ రాష్ట్ర సీఎం మమత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర పరిషత్ (విద్యార్థి విభాగం) ఆవిర్భావ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ, ప్రధాని మోదీ తమ రాష్ట్రంలో అలజడులు సృష్టించి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, బెంగాల్ తగలబడితే దేశ రాజధాని ఢిల్లీతో పాటు, అసోం, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, ఒడిసా కూడా కాలిపోతాయని హెచ్చరించారు. మమత వ్యాఖ్యలపై అసోం సీఎం హిమంత ఘాటుగా స్పందించారు. "అసోంను బెదిరించడానికి మీకు ఎంత ధైర్యం" అని ఆమెపై మండిపడ్డారు.

జేఎంఎంకు చంపయి సోరెన్ రాజీనామా



రాంచీ, ఆగస్టు 28: ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ప్రాథమిక సభ్యత్వానికి ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంపయి సోరెన్ రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ అధినేత శిబు సోరెన్‌కు పంపినట్లు బుధవారం మీడియాకు తెలిపారు. "పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఇతర అన్ని పదవులకు రాజీనామా చేశాను. లేఖను అసెంబ్లీ స్పీకర్‌కూ పంపా. గిరిజనులు, దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజల సమస్యలపై నా పోరాటం కొనసాగుతుంది" అని చంపయి చెప్పారు. కాగా, శుక్రవారం ఆయన బీజేపీలో చేరనున్నారు.

నేరం రుజువు కాకున్నా దీర్ఘకాల నిర్బంధం.. విచారణ లేకుండా శిక్షించడమే


- దీనికి అనుమతించేది లేదు.. కవిత కేసులో సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: నేరం రుజువు కాకముందే నిందితులను జైలులో సుదీర్ఘ కాలంపాటు నిర్బంధించటం అంటే విచారణ జరపకుండానే శిక్ష విధించటమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, దీనికి అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు మంగళవారం నాటి తీర్పునకు సంబంధించిన 13 పేజీలతో కూడిన పూర్తి కాపీని బుధవారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించే వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు.. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) విధించే ఆంక్షల కంటే గొప్పదని సుప్రీంకోర్టు పేర్కొంది. పీఎంఎల్ఏలోని సెక్షన్45(1)ను ప్రస్తావిస్తూ.. 16 ఏళ్లలోపు వారు, మహిళలు, అనారోగ్యంతో ఉన్న వారికి బెయిల్ మంజూరు చేయవచ్చని తన తీర్పులో ధర్మాసనం గుర్తు చేసింది.

[స్మార్ట్] జహీరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతుల నిధి(ఏఐఎఫ్), రైల్వే ప్రాజెక్టులు, ఈశాన్య రాష్ట్రాల్లో కొత్త జలవిద్యుత్తు ప్రాజెక్టు, 234 నగరాలకు ఎఫ్ఎం రేడియో సేవల విస్తరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన క్యాబినెట్ భేటీ వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ విలేకరులకు వెల్లడించారు. కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్ కూడా పారిశ్రామిక నగరాల అంశంపై ప్రత్యేకంగా విలేకరులతో మాట్లాడారు. 12 స్మార్ట్ పారిశ్రామిక నగరాలకు సంబంధించిన భూసేకరణ ఇప్పటికే పూర్తయిందని, పర్యావరణ అనుమతులు తీసుకున్నామని అశ్విని వైష్ణవ్ వివరించారు. మూడేళ్లలో ఈ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తిచేస్తామని పేర్కొన్నారు. "ఈ నిర్ణయంతో ఉత్పత్తి రంగానికి ఊతం అందుతుంది. గ్రీన్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేసే 12 స్మార్ట్ పారిశ్రామిక నగరాల ద్వారా 10 లక్షల మందికి ప్రత్యక్షంగా.. మరో 30 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. తెలంగాణలోని జహీరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని ఓర్వకల్లు, కొప్పర్తి, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, పాలి, ఉత్తరాఖండ్‌లోని ఖుర్పియా, పంజాబ్‌లోని రాజ్‌పుర, పటియాలా, మహారాష్ట్రలోని దిఘి, కేరళలోని పాలక్కడ్, ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా, ప్రయాగ్‌రాజ్, బిహార్‌లోని గయాలో ఈ నగరాలను ఏర్పాటు చేస్తాం. ఈ పారిశ్రామిక కారిడార్లు రూ.1.52 లక్షల కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షిస్తాయని భావిస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు. భారత నలుదిశలా స్థాపించే ఈ నగరాలు దేశానికే మణిహారంలా ఉంటాయని అభిప్రాయపడ్డారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం(ఎన్ఐసీడీపీ) ఆధ్వర్యంలో నిర్మించే ఈ పారిశ్రామిక నగరాలకు స్పెషల్ పర్పస్ వెహికల్స్‌ను ఏర్పాటు చేస్తామని, అందులో రాష్ట్రం ఈక్విటీ భూమి రూపంలోనే ఉంటుందని, మ్యాచింగ్ ఫండ్ నిధులు కేటాయించనక్కర్లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్రాల ఈక్విటీ పోగా.. అయ్యే అదనపు ఖర్చుకు తక్కువ వడ్డీకి సుదీర్ఘకాలం చెల్లింపు ప్రాతిపదికగా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. భారత్‌లో పెట్టుబడులకు, ఉత్పత్తికి అనేక దేశాలు ముందుకొస్తున్నాయని గుర్తుచేశారు. ఎన్ఐసీడీపీ ఇప్పటికే నాలుగు ప్రాజెక్టులను పూర్తిచేసినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం, తుముకూరు పారిశ్రామిక ప్రాంతాలను అభివృద్ధి చేసిందని.. ఢిల్లీ-ముంబై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హరియాణాల్లో ఆరు ప్రాజెక్టులు అమలు అవుతున్నాయని గుర్తుచేశారు. కొత్త స్మార్ట్ సిటీలతో దేశంలో పారిశ్రామిక స్వరూపం పూర్తిగా మారిపోతుందన్నారు.



ఈశాన్య రాష్ట్రాల్లో జలవిద్యుత్తు

ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిలో భాగంగా జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. రూ.4,136 కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా 15 గిగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

ఏఐఎఫ్‌కు లక్ష కోట్లు

వ్యవసాయ మౌలిక వసతుల నిధి(ఏఐఎఫ్)కి రూ. లక్ష కోట్ల నిధులు అందజేసేందుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ నిర్ణయంతో దేశంలో వ్యవసాయ ఆధారిత వసతులు మెరుగుపడతాయన్నారు. ఈ నిధిని ప్రధాని నరేంద్ర మోదీ 2020లోనే ప్రారంభించినట్లు గుర్తుచేశారు. దీని ద్వారా 6,623 గోదాములు, 688 కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేశామని, ఈ చర్యల వల్ల దేశంలో వ్యవసాయోత్పత్తుల నిల్వ సామర్థ్యం మరో 500 లక్షల టన్నులు పెరిగిందని చెప్పారు. ఇప్పటి వరకు రూ.47,575 కోట్ల విలువైన 74,508 ప్రాజెక్టులు మంజూరయ్యాయని, ఫలితంగా.. వ్యవసాయ రంగంలో రూ.78,596 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయన్నారు. ఏఐఎఫ్ ద్వారా ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 8.19 లక్షల మందికి ఉపాధి లభించిందని పేర్కొన్నారు.

రూ.6,456 కోట్లతో రైల్వే పనులు

ఒడిసా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో రెండు కొత్త రైల్వే లైన్లతోపాటు.. మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులకు రూ.6,456 కోట్లు కేటాయించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో 300 కిలోమీటర్ల మేర అదనపు రైల్వేలైన్లు అందుబాటులోకి వస్తాయని, మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుల్లో భాగంగా 14 కొత్త రైల్వే స్టేషన్లను నిర్మిస్తారని రైల్వే శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నిర్ణయం వల్ల 1,300 గ్రామాల్లోని 11 లక్షల మందికి రైల్వే సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. కాగా, దేశంలోని మరో 234 నగరాలకు ఎఫ్ఎం రేడియో సేవలను విస్తరించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఇందుకోసం 730 ఎఫ్ఎం చానళ్లను వేలం వేయనుంది. దీనికి అంచనా రిజర్వ్ ధర రూ.784.87 కోట్లుగా ఉంటుందని కేంద్రం భావిస్తోంది.

జన్ ధన్ యోజన సాధికారతకు చిహ్నం

- 53 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు
- వాటిలో 2.3 లక్షల కోట్ల నిల్వ: ప్రధాని
- పథకానికి బుధవారంతో పదేళ్లు పూర్తి




న్యూఢిల్లీ, ఆగస్టు 28: ప్రధాని మోదీ 2014లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' కార్యక్రమం బుధవారానికి సరిగ్గా పదేళ్లు పూర్తిచేసుకుంది. దీనిపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. గౌరవం, సాధికారతకు ఈ కార్యక్రమం చిహ్నమని, కోట్లాది మంది దేశ ఆర్థికాభివృద్ధిలో పాలుపంచుకునేందుకు ఇది అవకాశం కల్పించిందని తెలిపారు. 'ఈ పథకం కింద కొత్తగా 53 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఆ ఖాతాల్లో రూ.2.3 లక్షల కోట్లకుపైగా డిపాజిట్లు ఉన్నాయి" అని వెల్లడించారు. జన్‌ధన్ యోజన కింద తెరిచిన బ్యాంకు ఖాతాల ద్వారా ప్రజలకు వేర్వేరు ప్రభుత్వ పథకాల కింద రూ.39లక్షల కోట్ల నగదు బదిలీ జరిగిందన్నారు. "మహిళల సాధికారతకు ఈ స్కీం గేమ్‌చేంజర్‌గా మారింది. 30 కోట్ల మంది మహిళలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకొచ్చాం" అని చెప్పారు. జన్ ధన్ యోజన లేకుంటే ముద్ర యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి సామాజిక భద్రత పథకాలు విజయవంతమయ్యేవి కావని వ్యాఖ్యానించారు. ఈ పథకం అవసరమా అని హేళన చేసినవారే ఇప్పుడు డిజిటల్ చెల్లింపుల అవసరమేంటని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. 'ప్రజల సమష్టి సంకల్పాన్ని వారు తక్కువ అంచనా వేశారు. భారత డిజిటల్ చెల్లింపులు విజయవంతం కావడాన్ని ప్రపంచమంతా గుర్తిస్తోంది. డిజిటల్ చెల్లింపుల్లో 40% భారత్‌లోనే జరుగుతున్నాయి" అన్నారు.

సెప్టెంబరులో అమెరికాకు మోదీ

అమెరికా అధ్యక్ష ఎన్నికల ముంగిట, సెప్టెంబరు మూడో వారంలో మోదీ అమెరికాలో పర్యటించనున్నారు. 22న న్యూయార్క్‌లో ప్రవాస భారతీయులతో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రసంగించనున్నారు. నవంబరు 5న అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ జరుగనుంది. కాగా.. 2019 సెప్టెంబరు 22న హ్యూస్టన్‌లో 'హౌడీ మోడీ' కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. ఆ సభకు నాటి అధ్యక్షుడు ట్రంప్ హాజరయ్యారు.

ఈడీ కేసుల్లోనూ బెయిల్ వర్తింపు


- కస్టడీలో నిందితుల నేరాంగీకారాన్ని సాక్ష్యంగా పరిగణించలేం: సుప్రీంకోర్టు
- సీఎం సోరెన్ సహాయకుడికి బెయిల్



న్యూఢిల్లీ, ఆగస్టు 28: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కేసుల్లోనూ బెయిల్ నియమం వర్తిస్తుందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. 'మనీలాండరింగ్ కేసులకూ 'బెయిల్ నియమం.. జైలు మినహాయింపు' అనే సాధారణ న్యాయసూత్రం వర్తిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ అనేది ఎప్పటికీ నియమమే. దాన్ని కోల్పోవాల్సి వస్తే అది చట్టబద్ధంగానే జరగాలి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద బెయిల్ కోసం విధించిన కఠిన షరతులు ఈ నిబంధనను అధిగమిస్తాయి. ఈడీ కస్టడీలో ఉన్నప్పుడు నిందితుడి నేరాంగీకారం అనేది సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 25 మేరకు అసలు సాక్ష్యంగా పరిగణించలేం' అని పేర్కొంది. అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ సహాయకుడు ప్రేమ్‌ప్రకాశ్ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈమేరకు స్పందించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఆప్ నేత మనీశ్ సిసోడియాపై నమోదైన మనీలాండరింగ్ కేసులో ఆగస్టు 9న ఇచ్చిన తీర్పును జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ప్రస్తావించింది. బెయిల్ అనేది నియమమని.. జైలు మినహాయింపు అని తాము చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం నిందితుడికి విధించిన బెయిల్ షరతులు అతడి స్వేచ్ఛను హరించాలనే కొత్త సిద్ధాంతాన్ని లిఖించలేవని పేర్కొంది. ప్రేమ్ ప్రకాశ్ ప్రాథమికంగా నేరం చేసినట్లు గానీ, బయటికొస్తే సాక్షులను ప్రభావితం చేయగలడని చెప్పడానికి గానీ ఆధారాలులేవని తెలిపింది. అందుకే అతడికి రూ.5 లక్షల విలువైన బాండ్, ఇద్దరి పూచీకత్తుతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. మార్చి 22న ఝార్ఖండ్ హైకోర్టు బెయిల్‌ను తిరస్కరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కోర్టు కొట్టేసింది.

డీఎంకే ఎంపీకి రూ.908 కోట్ల జరిమానా!

- ఫెమా కింద ఈడీ చర్యలు



చెన్నై, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఎంపీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) షాకిచ్చింది. అధికార డీఎంకేకు చెందిన ఈ లోక్‌సభ సభ్యుడికి రూ.908 కోట్ల భారీ జరిమానా విధించింది. కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుతం అరక్కోణం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్.జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులకు రూ.908 కోట్ల జరిమానా విధిస్తున్నట్లు ఈడీ బుధవారం ప్రకటించింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా) నిబంధనలకు విరుద్ధంగా 2017లో సింగపూర్ కంపెనీలో రూ.42 కోట్ల షేర్లను కలిగివుండడం, శ్రీలంకకు చెందిన సంస్థల్లో పెట్టుబడులు తదితరాలకు సంబంధించి జగద్రక్షకన్ కుటుంబీకులపై వచ్చిన ఫిర్యాదులమేరకు ఈ చర్యలకు ఉపక్రమించింది.

ఇక చాలు..

దేశం మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైంది

- మహిళలపై నేరాలను అంతం చేయాలి
- కోల్‌కతా ఘటనపై రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, ఆగస్టు28: మహిళలపై జరుగుతున్న నేరాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ జరిగింది చాలని, ఈ తరహా నేరాలను అంతం చేయడానికి భారత్ మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మహిళల శక్తి సామర్థ్యాలను, ప్రతిభను తక్కువగా అంచనా వేసే మనస్తత్వాన్ని ఎదుర్కోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఇలాంటి అభిప్రాయాలు కలిగినవారు మరో అడుగు ముందుకేసి స్త్రీని ఒక వస్తువుగా మాత్రమే చూస్తారని పీటీఐ వార్తా సంస్థకు బుధవారం రాసిన ఓ ప్రత్యేక వ్యాసంలో రాష్ట్రపతి పేర్కొన్నారు. కోల్‌కతా ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం ఘటనపై ముర్ము తొలిసారిగా స్పందించారు. అదో దిగ్భ్రాంతికరమైన, భయాందోళన కలిగించే ఘటనగా అభివర్ణించారు. మహిళలపై జరుగుతున్న నేరాల పరంపరలో అదో భాగమన్నారు. ఆడపిల్లలు, సోదరీమణులు ఇలాంటి అఘాయిత్యాలకు గురికావడాన్ని ఏ నాగరిక సమాజం అనుమతించదని స్పష్టంచేశారు. ఇలాంటి ఘటనలపై దేశం యావత్తు తీవ్ర ఆగ్రహానికి గురవుతోందని, అందులో తాను కూడా ఉన్నానని ముర్ము తెలిపారు. కోల్‌కతా ఘటనపై ఒకవైపు విద్యార్థులు, వైద్యులు, పౌరులు ఆందోళన చేస్తుంటే.. నేరగాళ్లు మాత్రం యథేచ్ఛగా బయట సంచరిస్తూనే ఉన్నారని, బాధితుల్లో కిండర్ గార్డెన్ చిన్నారులు కూడా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాఖీ పండుగ రోజున పాఠశాల విద్యార్థుల బృందంతో తాను ముచ్చటించిన అంశాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తులో నిర్భయ తరహా ఘటనలు పునరావృతం కాబోవని భరోసా ఇవ్వగలరా? అని వారు అమాయకంగా తనను అడిగారని తెలిపారు. ఆ ఘటనతో ఆగ్రహించిన దేశం అప్పట్లో కొన్ని ప్రణాళికలు, వ్యూహాలను రూపొందించిందని, వాటితో కొంతమేర ఫలితం కనిపించిందని చెప్పారు. ఆ ఘటన అనంతరం 12 ఏళ్లలో అదే తరహాలో దేశంలో లెక్కలేనన్ని విషాదాలు చోటుచేసుకున్నాయని, అందులో దేశం దృష్టిని ఆకర్షించిన ఘటనలు కొన్ని మాత్రమేనన్నారు. దేశాన్ని, సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఫోర్త్ ఎస్టేట్ పాత్ర కీలకమని, మీడియా నిర్భయంగా, సత్యం పక్షాన నిలబడాలని రాష్ట్రపతి కోరారు. కాగా 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని భారత్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని రాష్ట్రపతి ముర్ము అన్నారు. ఇది దేశ క్రీడా రంగంలో ప్రతిభను ప్రోత్సహిస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో కచ్చితంగా ఒలింపిక్స్ జరగాలని ముర్ము ఆకాంక్షించారు.

ఘోష్ ఐఎమ్ఏ సభ్యత్వం రద్దు



న్యూఢిల్లీ, కోల్‌కతా, ఆగస్టు28: కోల్‌కతా ఆర్జీకర్ వైద్యకళాశాలలో పీజీ విద్యార్థినిపై ఘోర అత్యాచార ఘటన, అనంతర పరిణామాలు, కాలేజీలో ఆర్థికపరమైన అవకతవకల పరంగా అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌కు భారీ షాక్ తగిలింది. హత్యాచార ఘటన, వైద్య కళాశాలలో ఆర్థిక అవకతవకలపై ఇప్పటికే సీబీఐవిచారణను ఎదుర్కొంటున్న ఘోష్ సభ్యత్వాన్ని భారత వైద్య మండలి (ఐఎమ్ఏ) రద్దు చేసింది. ఐఎమ్ఏ కోల్‌కతా శాఖకు ఉపాధ్యక్షుడైన ఘోష్‌కు వ్యతిరేకంగా ఐఎమ్ఏ జాతీయ అధ్యక్షుడు ఆర్వీ అశోకన్ సారథ్యంలోని క్రమశిక్షణా సంఘం బుధవారం ఈమేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి సమస్య పట్ల సరిగా వ్యవహరించడంలో ఘోష్ విఫలమయ్యారని ఐఎమ్ఏ కమిటీ పేర్కొంది. మరోవైపు ఘోష్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఐఎమ్ఏను జాతీయ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. కాగా హత్యాచార ఘటనకు నిరసనగా 'ఛాత్ర సమాజ్' మంగళవారం కోల్‌కతాలో సచివాలయం దిశగా నిర్వహించిన ర్యాలీని అడ్డుకొని, పోలీసులు లాఠీచార్జి చేసినందుకు నిరసనగా బుధవారం బెంగాల్‌వ్యాప్తంగా బీజేపీ పిలుపునిచ్చిన 12గంటల బంద్ ఉద్రిక్తంగా మారింది. కాగా అత్యాచార నిందితులకు మరణశిక్ష పడేలా ఇప్పుడున్న చట్టాలకు సవరణలు చేస్తామని బెంగాల్ సీఎం మమత ప్రకటించారు.

ఐఎన్‌ఎస్ అరిఘాత్ రెడీ!

(మొదటి పేజీ తరువాయి)

నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేసిన తొలి ఎస్ఎస్‌బీఎన్ (షిప్, సబ్‌మెర్సిబుల్, బాలిస్టిక్, న్యూక్లియర్).. ఐఎన్ఎస్ అరిహంత్ అధికారికంగా 2018 నుంచి నేవీకి సేవలందిస్తోంది. ఆ డిజైన్, స్ఫూర్తితో.. దానికన్నా శక్తిమంతంగా రూపొందించిన ఎస్ఎస్‌బీఎన్.. ఈ ఐఎన్ఎస్ అరిఘాత్. ఇప్పటికే దీన్ని అనేకసార్లు సముద్రంలో పరీక్షించి, కమిషనింగ్‌కు సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబరులో ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితమివ్వాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం విశాఖపట్నం వస్తున్నారు. అరిహంత్ క్లాస్ న్యూక్లియర్ సబ్‌మెరైన్లలో అరిఘాత్ రెండోది. అయితే.. అరిహంత్‌లో 750 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించగలిగే కె-15 క్షిపణులు ఉంటాయి. దీంట్లో.. 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగల నాలుగు కె-4 ఎస్ఎల్‌బీఎం (సబ్‌మెరైన్ లాంచ్‌డ్ బాలిస్టిక్ క్షిపణు)లను మోహరించవచ్చు. లేదా సంప్రదాయ/స్ట్రాటజిక్ అణువార్‌హెడ్లను మోసుకెళ్లగల 12 కె-15 ఎస్ఎల్‌బీఎంలను అమర్చవచ్చు. 3500 కిలోమీటర్లంటే.. బంగాళాఖాతంలోని ఉత్తర భాగం నుంచి ప్రయోగిస్తే బీజింగ్ కూడా దీని పరిధిలోకి వస్తుందన్న మాట! దీనికి.. ప్రెజరైజ్డ్ వాటర్ రియాక్టర్‌తో పని చేసే ఏడు బ్లేడ్‌ల ప్రొపెల్లర్ ఉంటుంది. సముద్ర ఉపరితలంపై గంటకు 12 నుంచి 15 నాటికల్ మైళ్ల (22 నుంచి 28 కిలోమీటర్ల) వేగంతో ప్రయాణిస్తుంది. అదే సముద్రం లోపల అయితే గంటకు 24 నాటికల్ మైళ్ల (44 కిలోమీటర్ల) వేగంతో వెళుతుంది. ఇందులో ఉపయోగించే క్షిపణులను డీఆర్‌డీవో రూపొందించింది. ఇక.. ఈ సిరీస్‌లోని మూడో అణు జలాంతర్గామి కూడా త్వరలోనే నేవీకి అందుబాటులోకి రానున్నట్టు సమాచారం.

లోకం తీరు



వాతావరణ సమాచారం రైతుల వద్దకే!

- జిల్లా ఆగ్రోమెటరోలాజికల్ యూనిట్ల పునరుద్ధరణకు కేంద్రం యోచన

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు సమగ్ర వాతావరణ సమాచారాన్ని అందించిన జిల్లా ఆగ్రోమెటరోలాజికల్ యూనిట్ల (డీఏఎంయూఎస్) నెట్‌వర్క్‌ను శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా వాతావరణ, వ్యవసాయ సమాచారాన్ని రైతుల చెంతకే చేర్చాలని యోచిస్తోంది. గతంలో ప్రారంభించిన ఈ డీఏఎంయూఎస్‌లను ఈ ఏడాది ప్రారంభంలో భారత వాతావరణ శాఖ మూసివేయాలని ఆదేశించింది. అయితే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో వీటిని పునరుద్ధరించే ప్రణాళిక ఏమైనా ఉందా..? అని అడిగిన ప్రశ్నకు సంబంధిత అధికారులు బదులిచ్చారు. 'డీఏఎంయూఎస్‌ను గతంలో తాత్కాలిక ప్రాతిపదికనే ఏర్పాటు చేశాం. ఈసారి శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తాం' అన్నారు.

కాలుష్యం తగ్గి..ఆయుర్దాయం పెరిగి

న్యూఢిల్లీ, ఆగస్టు 28: భారత్‌లో ఇటీవల గాలి కాలుష్య తీవ్రత తగ్గినట్టు 'ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్-2024' తాజా నివేదిక వెల్లడించింది. ఈ నివేదికను అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ షికాగోలోని ఎనర్జీ పాలసీ ఇనిస్టిట్యూట్ రూపొందించింది. 2021తో పోలిస్తే 2022లో భారత్‌లో కాలుష్య రేణువుల స్థాయి 19.3% తగ్గినట్టు ఈ నివేదిక తెలిపింది. తద్వారా దేశ పౌరుల సగటు ఆయుర్దాయం ఒక ఏడాది పెరిగినట్టు పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం అత్యంత కాలుష్య దేశాల్లో బంగ్లాదేశ్ తొలిస్థానంలో నిలవగా భారత్ రెండో స్థానంలో ఉంది. అయితే, దేశంలోని 42.6% మంది డబ్ల్యూహెచ్‌వో ప్రమాణా లను మించిన కాలుష్యపూరిత ప్రాంతాల్లో ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

ఆస్పత్రుల్లో రాత్రి గస్తీ

- భద్రత తనిఖీలు.. సీసీ కెమెరాల పర్యవేక్షణ
- వైద్య సిబ్బంది రక్షణకు కేంద్రం సూచనలు

న్యూఢిల్లీ, ఆగస్టు28: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో విధి నిర్వహణలో ఉన్న వైద్యుల భద్రత కోసం పలు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరింది. జిల్లా ఆస్పత్రుల్లో ఎప్పటికప్పుడు భద్రతను తనిఖీ చేయాలని, రాత్రిపూట గస్తీ నిర్వహించాలని సూచించింది. వైద్య సిబ్బంది రక్షణకు ఉన్న చట్టాలు, వారిపై దాడులకు పాల్పడిన వారికి విధించే శిక్షల వివరాలను ఆస్పత్రి ప్రాంగణంలో స్పష్టంగా కనిపించేలా నోటీసులు అంటించాలని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, డీజీలకు కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర లేఖ రాశారు. అన్ని జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల ఆవరణలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, ఇక్కడి సిబ్బంది నిత్యం సీసీ కెమెరాలను పర్యవేక్షించాలని, ఆ డేటాను భద్రపరచాలని సూచించారు. అన్ని ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో రాత్రిపూట సాధారణ గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో సాధారణ ప్రజలు, రోగుల బంధువుల కదలికలపై నియంత్రణ ఉండాలని.. ఆస్పత్రుల్లో హింసాత్మక ఘటనల నియంత్రణ, వైద్యుల భద్రతకు అమలు చేయాల్సిన వ్యూహాల కోసం సీనియర్ వైద్యులు, పాలనాధికారులతో కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల యాజమాన్యాలు సంయుక్తంగా భద్రతా పరమైన అంశాలను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లలో లోటుపాట్లు ఉంటే సమీక్షించి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతి మూలా సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని సూచించారు.

వచ్చే నాలుగేళ్లలో 50 వేల మందికి నైపుణ్య శిక్షణ

- ఎన్ఎస్ఐసీతో ఒప్పందం
- మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నాలుగేళ్లలో 50 వేల మందికి నైపుణ్య శిక్షణ అందిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సచివాలయంలో బుధవారం ఆయన జాతీయ చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ)తో ఈ మేరకు అవగాహన ఒప్పందం చేసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎన్ఎస్ఐసీ జాతీయ బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించడంలో దోహదపడుతుందని, చిన్న పరిశ్రమలు ముడిసరుకు కొనుగోలు, ఉత్పత్తుల విక్రయంలో సహకరిస్తుందని తెలిపారు. జిల్లా స్థాయిలో ఈ సేవలను ఎక్కువగా వినియోగించుకోవడంపై దృష్టిసారిస్తామన్నారు. ఇందుకోసం (టీఈజేఏఎస్) తెలంగాణ ఎంట్రపెన్యూర్ జర్నీ ఫర్ యాస్పిరేషన్స్ అండ్ అచీవింగ్ సక్సెస్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సమావేశంలో ఎన్ఎస్ఐసీ ఛైర్మన్ సుభ్రాంశు శేఖర్ ఆచార్య, పరిశ్రమల శాఖ కమిషనర్ డా. మల్సూర్, టీ-వర్క్స్ సీఈవో జోగిందర్ తనికెళ్ల, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శ్రీకాంత్ నాగప్ప పాల్గొన్నారు.

ఐటీ ఎగుమతుల్లో 11.3శాతం వృద్ధి

ఐటీ ఎగుమతుల్లో జాతీయ సగటు కంటే తెలంగాణ మూడింతల వృద్ధి సాధించిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వచ్చే నెల 5,6 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్లోబల్ ఏఐ సదస్సుకు సన్నాహకంగా 'నాస్కా మ్' బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 2024-25 తొలి త్రైమాసికంలో జాతీయ ఐటీ ఎగుమతులు 3.3%పెరిగాయని, అదే సమయంలో రాష్ట్రంలో 11.3% వృద్ధి నమోదైందన్నారు. ఈ సందర్భంగా 'ఏఐ అడాప్షన్ 2.0' నివేదిక విడుదల చేశారు.

ప్రత్యేక జీవో ద్వారా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

నల్లకుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రత్యేక జీవో తెచ్చేందుకు ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సచివాలయంలో బుధవారం గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు ఆయనను కలిసి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య చాలా కాలంగా ఉందని, పరిష్కరించేందుకు కొంత సమయం పడుతుందని అన్నారు.

పోలవరానికి రూ.12,127 కోట్లు

- ప్రధానికి కృతజ్ఞతలు: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు తొలి దశకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం అంగీకరించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇక కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం సహా మిగిలిన హెడ్‌వర్క్స్ పనులు 2027 మార్చినాటికి పూర్తవుతాయని ప్రకటించారు. ఇందుకుగాను ప్రధానికి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర కేబినెట్ పోలవరం తొలిదశ పనులకు నిధులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నందున హెడ్‌వర్క్స్ పనుల కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగుతున్న సమయంలోనే కేంద్ర కేబినెట్ నిర్ణయాల గురించి తెలిసింది. దీంతో మంత్రివర్గ సమావేశం ముగిసిన వెంటనే చంద్రబాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టుకు, పారిశ్రామిక కారిడార్లకు ఆర్థికంగా కేంద్రం సహకరిస్తోందని.. ఇందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు.

ప్రయోగాలే నాకు గుర్తింపు తెచ్చాయి

- జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి



ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 28: పాఠశాలలో సైన్స్ ప్రయోగాలు, ప్రాజెక్టులు, క్షేత్రస్థాయి పర్యటనలు, నమూనాల తయారీ, విద్యార్థులకు సైన్స్‌కు సంబంధించి వాస్తవిక జ్ఞానం నేర్పించటంతోనే జాతీయస్థాయిలో తనకు ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు లభించిందని ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం ప్రభుత్వ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. 2008లో జిల్లాస్థాయిలో, 2016లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులను అందుకున్నట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ప్రభాకర్‌రెడ్డిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు.

గురుకుల విద్యార్థులపై ఎలుకల దాడి

- 14 మందికి స్వల్ప గాయాలు.. చికిత్స

దేవరకొండ, ఆగస్టు 28: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఎలుకలు అలజడి సృష్టించాయి. నిద్రిస్తున్న విద్యార్థులను కొరకటంతో 14 మంది గాయాల పాలయ్యారు. ఈ నెల 26న జరిగిన ఈ ఘటన స్థానికుల సమాచారంతో వెలుగులోకి వచ్చింది. కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో సుమారు 1200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ నెల 26న రాత్రి భోజనం చేసిన అనంతరం విద్యార్థులు నిద్రించగా, 14 మంది కాళ్ల, చేతులపై ఎలుకలు కొరికాయి. ఉపాధ్యాయులు హుటాహుటిన విద్యార్థులను ఆసుపత్రికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం అందించారు.

ఆ పోలీసు అధికారులకు చార్జిమెమోలు

- ఎమ్మెల్యే భార్య బర్త్‌డే చేసిన వారికి రిటర్న్ గిఫ్ట్
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో పోలీసు ఉన్నతాధికారుల చర్యలు

నరసరావుపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగారి భార్యగారి బర్త్‌డే వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించిన పల్నాడు జిల్లా పోలీసు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురించిన కథనం రాజకీయ, పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. ఎలాంటి అధికారిక హోదాలేని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకట కుమారి జన్మదిన వేడుకల్లో యూనిఫాంతో పాల్గొని ఆమెతో కేక్ కట్ చేయించిన పోలీసు అధికారులపై చర్యలకు రంగం సిద్ధమైంది. సదరు అధికారులను బుధవారం నరసరావుపేటలోని ఎస్పీ కార్యాలయానికి పిలిపించిన ఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా విచారణ జరిపారు. చిలకలూరిపేట అర్బన్ సీఐ సీహెచ్ రమేశ్, రూరల్ సీఐ సుబ్బనాయుడును విచారించి వివరాలు సేకరించారు. ఇద్దరు సీఐలతో పాటు ఐదుగురు ఎస్ఐలకూ ఎస్పీ చార్జిమెమోలు జారీ చేశారు. 'ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేల ప్రవర్తనతో ఇన్నాళ్లూ నిర్మించుకున్న మంచిపేరు దెబ్బతింటోంది. వారు చేస్తున్న పొరపాట్లను ప్రస్తావిస్తూ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీనివల్ల అందరికీ చెడ్డపేరు వస్తోంది' అంటూ కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో కలకలం రేగింది. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో అధికారులకు నియోజకవర్గంలో పోస్టింగుల్లో వెంకట కుమారి కీలకంగా వ్యవహరిస్తున్నారని, అక్రమ వ్యాపారులకు కొమ్ము కాస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆమె పుట్టిన రోజు వేడుకలు నిర్వహించిన పోలీసు అధికారులకు చార్జిమెమోలు జారీ కావడం పార్టీలో చర్చనీయాంశమైంది.

మాఫీ తేల్చిన పంట రుణం స్వాహా లీల!

- 30 మంది రైతుల పేర్లతో రుణాలు..18లక్షలు విత్ డ్రా
- రుణమాఫీ మెసేజ్‌లు రావడంతో రైతుల షాక్
- ప్రజావాణిలో ఫిర్యాదు.. విచారణకు కలెక్టర్ హుకుం

మంచిర్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణాలు ఇచ్చినట్లుగా రికార్డుల్లో రాసేసి.. రైతుల ఖాతాల్లోంచి ఆ మొత్తాన్ని తామే స్వాహా చేసిన అధికారుల నిర్వాకం బట్టబయలైంది. మంచిర్యాల జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సీపీసీఎస్) సీఈవో లీల ఇది! ఒక్క రైతు నుంచి కాదు.. మొత్తంగా 18 మంది పేరు మీద పంట రుణాల పేరుతో రూ.30లక్షలు స్వాహా చేసినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లకు చెందిన రైతు సిరిపెల్లి బాపు మంచిర్యాలలోని ఏడీసీసీ బ్యాంకులో 2015లో పంట రుణం కింద రూ. 65వేలు తీసుకుని 2019 నవంబరులో తిరిగి చెల్లించాడు. 2023లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేయడంతో బాపు పేరిట రూ. 67 వేలు బ్యాంకులో జమయ్యాయి. అప్పటి నుంచి ఆ రైతు ఎలాంటి పంట రుణమూ తీసుకోలేదు. ఆయనకు ఆగస్టు 2న రూ. 1,10,515 మాఫీ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ముల్కల్లకు చెందిన మరో రైతు కందుల లక్ష్మయ్యకూ ఇదే అనుభవం ఎదురైంది. బాపు, లక్ష్మయ్య.. వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించడంతో ఇద్దరికీ రుణమాఫీ అయినట్లు చెప్పారు. అనంతరం ఆ రైతులు.. పీఏసీఎస్ సీఈవో పెంట సత్యనారాయణ వద్దకు వెళ్లి ప్రశ్నించారు. అవి ఫేక్ మెసేజ్‌లంటూ...ఈవిషయం ఎవరికీ చెప్పొద్దని, అధికారులకు ఫిర్యాదు కూడా చేయొద్దని బతిమాలుకున్నాడు. ఆయన తీరును అనుమానించిన రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్.. విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కో ఆపరేటివ్ సొసైటీ అధికారులను ఆదేశించారు. విచారణ చేపట్టిన అధికారులు పెద్ద మొత్తంలో అక్రమాలను గుర్తించినట్లు సమాచారం. జిల్లాలోని ఇతర సహకార బ్యాంకుల్లోనూ ఇదే తంతు జరిగినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చిత్రహింసలు పెట్టారు!

(మొదటి పేజీ తరువాయి)

రావొద్దని, అలాగైతేనే జైలు నుంచి కాదంబరి బయటికి వస్తుందని ఆమె కుటుంబ సభ్యుల్ని బెదిరించారు. తన కుమార్తెకు నెలసరి వచ్చినప్పుడు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపేందుకూ అంగీకరించలేదని ఆశా జెత్వానీ కన్నీటి పర్యంతమయ్యారు. ఇక్కడ ఏకంగా ప్రభుత్వ పెద్దలు, ఐపీఎస్ అధికారులు బెదిరిస్తుండటంతో తమ సన్నిహితులెవరూ సహాయం చేసేందుకు ముందుకు రాలేదన్నారు. ఇప్పుడు ఈ వ్యవహారం ఎలా బయటికి వచ్చిందో తమకు తెలియదని, తనను హింసించిన వైసీపీ నాయకుడు విద్యాసాగర్‌తోపాటు పోలీసు అధికారులపైనా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆశా జెత్వానీ విన్నవించుకొంటున్నారు. త్వరలో నేరుగా విజయవాడకు వచ్చి హోంశాఖ మంత్రితోపాటు డీజీపీని కూడా కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాలని జెత్వానీ కుటుంబ సభ్యులు భావిస్తున్నట్లు తెలిసింది.

మనశ్శాంతి కరువై...

కాదంబరి బుధవారం ఓ చానల్‌లో మాట్లాడారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌తో తనకు 2015లో పరిచయం ఏర్పడిందని, అదే ఏడాది అతను తనకు పెళ్లి ప్రతిపాదన చేశాడని ఆమె తెలిపారు. కానీ.. ఆయన నేపథ్యం తెలిసి తాను ఆ ప్రతిపాదన తిరస్కరించానని జెత్వానీ తెలిపారు. "విద్యాసాగర్‌కు పెళ్లయిన 14నెలలకే భార్య వదిలేసి వెళ్లి పోయారు. ఆయనకు చాలా మంది అమ్మాయిలతో సంబంధాలున్నాయని గుర్తించి అతన్ని దూరం పెట్టాను. అప్పటి నుంచి నగ్న వీడియో కాల్స్‌తో, అసభ్యకర సందేశాలతో నన్ను వేధించసాగాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో విద్యాసాగర్ నాపై దొంగ కేసు పెట్టాడు" అని వాపోయారు. ఆంధ్రాలో కేవలం ట్రైలర్ మాత్రమే చూపించారని, మిగిలిన రాష్ట్రాల్లోనూ దొంగ కేసులు పెట్టి వేధిస్తామని తనను బెదిరించారని తెలిపారు. ముంబైలో కేసు (సజ్జన్ జిందాల్‌పై పెట్టిన కేసు) విత్‌డ్రా చేసుకుంటే ఇక్కడ తనపై కేసు తీసివేస్తామని చెప్పారని... కానీ ఇప్పటికీ కేసు విత్ డ్రా చేసుకోలేదని జెత్వానీ ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా యూఏఈలో వ్యాపారం చేసుకుంటున్న తన సోదరుడిపై కూడా కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసులో పోలీసులు ఎంత అడ్డగోలుగా వ్యవహరించారో తెలియాలంటే అప్పటి సీపీ కాంతి రాణాతోపాటు ఈ కేసులో పాల్గొన్న అప్పటి సీఐ ముత్యాల సత్యనారాయణ తదితరుల ఫోన్ కాల్స్ డేటా, వాట్సాప్ చాట్‌ను పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆమె తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.



"కొందరు పోలీసు అధికారులు తమ అధికారాన్ని ఉపయోగించి నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా వేధించారు. వాళ్ల వేధింపుల నుంచి నేను ఇప్పటికీ కోలుకోలేకపోతున్నాను. సరిగా నిద్ర కూడా పట్టని పరిస్థితి. ఓ క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వ్యక్తి ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా నన్ను, నా కుటుంబాన్ని దారుణంగా వేధించారు"

\- కాదంబరి జెత్వానీ, నటి, వైద్యురాలు

కుక్కల విద్యాసాగర్ ఎక్కడ?

జెత్వాని కేసు సంచలనంగా మారినా ఈ కేసులో సూత్రధారి, ఫిర్యాదుదారు అయిన కుక్కల విద్యాసాగర్ ఎక్కడున్నారో తెలియడంలేదు. విద్యాసాగర్‌కు, సజ్జన్ జిందాల్‌కు పరిచయం ఏమిటి? జిందాల్‌ను రక్షించేందుకే విద్యాసాగర్ ఈ దొంగ కేసు పెట్టారా? అప్పటి వైసీపీ పెద్దల ప్రమేయం ఎంత వరకు ఉంది? తదితర ప్రశ్నలకు సమాధానం తెలియాల్సి ఉంది. ఈ నేపథ్యంలో.. కాదంబరి అంశంపై పోలీసు ఉన్నతాధికారులు అంతర్గత విచారణ ప్రారంభించారు. ఇప్పటికే ఈ విషయం సంచలనం సృష్టించడంతో ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నివేదికతోపాటు ముంబై నటి నేరుగా వచ్చి ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా కాంతి రాణా, విశాల్ గున్నీ, ఇతర పోలీసు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశముంది.

జగన్‌కు బిగ్ షాక్!

(మొదటి పేజీ తరువాయి)

గొల్ల బాబూరావుతో పాటు మరికొందరు కీలక నేతలు పార్టీని వీడబోతున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. వైసీపీలో కొనసాగితే తమకు భవిష్యత్ ఉండదని వారు భావిస్తున్నట్లు సమాచారం. రాజ్యసభలో ఆ పార్టీకి 11 మంది ఎంపీలు ఉండగా.. ఇక అక్కడ మిగిలేది జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, నిరంజన్ రెడ్డి మాత్రమేనని అంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన తమను తక్కువ అంచనా వేయొద్దని.. రాజ్యసభలో తమ పార్టీకి 11 మంది సభ్యులు ఉన్నారని.. లోక్‌సభలో నలుగురు ఎంపీలున్నారని.. ఉభయసభల్లో పెద్దగా మెజారిటీ లేని బీజేపీ.. తమపై ఆధారపడాల్సిందేనని జగన్, విజయసాయిరెడ్డి ఇటీవలి కాలంలో పదే పదే అంటున్నారు. ఇప్పుడు ఆ బలమే తరిగిపోతుండడం గమనార్హం. అత్యంత కీలకమైన రాజ్యసభ సభ్యులే పార్టీని వీడుతున్నారంటే.. పార్టీపై జగన్ పట్టు కోల్పోతున్నట్లు స్పష్టమవుతోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

టీడీపీలోకి వెళ్తున్నా: మోపిదేవి

వైసీపీకి రాజీనామా చేయాలని.. టీడీపీలో చేరాలని తాను నిర్ణయం తీసుకున్నట్లు మోపిదేవి బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. గురువారం రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానన్నారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన ఆయన వాస్తవానికి కాంగ్రెస్‌లో జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో సన్నిహితంగా మెలిగారు. ఆయన మంత్రివర్గంలో కూడా పనిచేశారు. ఈ సమయంలోనే వైఎస్, జగన్ ఒత్తిడితో వ్యాన్‌పిక్ వ్యవహారంలో మోపిదేవి తీసుకున్న నిర్ణయాలు అనంతర కాలంలో సీబీఐ కేసు నమోదుకు దారితీశాయి. 2012 మే 24న ఆయన్ను కేంద్ర దర్యాప్తు సంస్థ అరెస్టు చేసి జైలుకు పంపింది. 2013 సెప్టెంబరులో ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. జగన్ కాంగ్రెస్‌ను వీడి వైసీపీని ఏర్పాటు చేశాక మోపిదేవి రాజకీయంగా ఆయన వెంట అడుగులు వేశారు. 2019లో ఆయన రేపల్లె నుంచి పోటీచేసి ఓడినప్పటికీ జగన్ తన కేబినెట్‌లోకి తీసుకున్నారు. ఎమ్మెల్సీని చేశారు. తర్వాత రాజ్యసభకు పంపి కేబినెట్ నుంచి తప్పించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రేపల్లె నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని మోపిదేవి భావించారు. అయితే జగన్ నిరాకరించారు. వైసీపీ టికెట్‌ను డాక్టర్ ఈవూరు గణేశ్‌కు ఇచ్చారు. దీంతో ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు అప్పట్లో తీవ్ర నిరసన వెలిబుచ్చారు. మూకుమ్మడి రాజీనామాలకు సైతం సిద్ధపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకార సంఘాలు కూడా మోపిదేవికి అన్యాయం జరిగిందంటూ బహిరంగంగానే గళం విప్పాయి. పార్టీ ఘోరపరాజయం తర్వాత కూడా తన విషయంలో జగన్ అదే వైఖరితో ఉండడం.. పార్టీ కీలక సమావేశాలకు సైతం ఆహ్వానించకపోవడం.. రేపల్లెలో పార్టీ ఓటమి తర్వాత కూడా గణేశ్‌కే ప్రాధాన్యం ఇస్తుండడం.. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ పరిస్థితి దిగజారిపోవడం.. తదితర పరిణామాలతో ఆయన పార్టీని వీడేందుకు పురిగొల్పింది.

పోతుల సునీత దారెటో...

ఎమ్మెల్సీ పదవితో పాటు వైసీపీకి కూడా పోతుల సునీత రాజీనామా చేశారు. శాసనమండలి ఛైర్మన్‌కు, పార్టీ అధినేత జగన్‌కు బుధవారమే ఆమె లేఖలు పంపారు. సునీత 2014లో చీరాల నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూశారు. ఆ క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆమెకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. తర్వాత నెలకొన్న రాజకీయ పరిణామాలతో సునీత వైసీపీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా, ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. ఇటీవల వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా వరుదు కల్యాణికి ఆ పార్టీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో సునీత తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆమె బీజేపీలో చేరనున్నట్లు అనుచరులు జోరుగా ప్రచారం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బలూచ్ హెచ్చరిక!

పాకిస్థాన్‌లో వేర్పాటువాద సంస్థ బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌వో)కు చెందిన సాయుధులు ఇటీవల మరోమారు తమ ప్రతాపం చూపారు. బలూచిస్థాన్ ప్రావిన్సులోని పలుప్రాంతాల్లో పోలీసుస్టేషన్లు, రైల్వేస్టేషన్లు, వాహనాలపై వారు కాల్పులు జరిపారు. పంజాబ్‌నుంచి వస్తున్న ఓ బస్సును ఆపి పాతికమందిని కాల్చివేయడంతో ఆరంభమైన ఈ మారణకాండ కొన్ని గంటలపాటు నిరవధికంగా సాగింది. 2006లో పాకిస్థాన్ సైన్యం కాల్చిచంపిన బలూచిస్థాన్ నాయకుడు నవాబ్ అక్బర్‌ఖాన్ బుగ్టీ వర్ధంతి సందర్భంగా ఆ వేర్పాటువాద సంస్థ ఈ హననానికి పాల్పడింది. ప్రత్యేక బలూచిస్థాన్ దేశం కోసం దశాబ్దాలుగా పోరాటం జరుగుతున్న ఈ ప్రాంతంలో వేర్పాటువాదులు అడపాదడపా హింసకు దిగడం అనాదిగా ఉన్నదే. అయితే, ఒకేమారు అనేక ప్రాంతాల్లో వేర్వేరు లక్ష్యాలపై ఇంతటి విస్తృతస్థాయిలో దాడులు జరగడం, మరణాలు అధికంగా ఉండటం గతంలో లేనిది.

లారీల దహనం, రోడ్లు రైల్వేలైన్ల పేల్చివేత, పోలీసులు, పంజాబ్ వలస కార్మికులు లక్ష్యంగా సాగిన ఈ హత్యకాండలో ఓ వందమంది మరణించారని అంచనా. పంజాబ్ ప్రావిన్సు సరిహద్దులకు చేరువగా వేర్పాటువాదులు ఈ ఘోరానికి పాల్పడటం పాక్ పాలకులకు ఓ హెచ్చరిక. బీఎల్‌వో తన సాయుధ, సాంకేతిక సామర్థ్యాన్ని బాగా బలోపేతం చేసుకున్నదని పాక్ విశ్లేషకుల అభిప్రాయం. దీనికితోడు, ఇంటలిజెన్స్ వైఫల్యం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. బుగ్టీ వర్ధంతి సందర్భంగా ఏటా బీఎల్‌వో దాడులు జరుపుతూ ఉంటుంది. ఇంతటి స్థాయిలో కాకున్నా, ఈ మారు కూడా ఆ సంస్థ విరుచుకుపడుతుందన్న స్పృహ ప్రభుత్వ విభాగాలకు ఉండాలి. వందలమంది పోలీసులు, సైనికబలగాలు ఉన్నప్పటికీ, ఈ వేర్పాటువాద సంస్థ ఎంతో సునాయాసంగా, సమన్వయంతో గంటలపాటు దాడులు కొనసాగించగలగడం పాలకుల వైఫల్యమే.

కొద్దివారాలుగా బలూచిస్థాన్‌లో భారీ ప్రదర్శనలు, ఉద్యమాలు ఉధృతంగా జరుగుతున్నాయి. వనరుల దోపిడీ, మానవహక్కుల ఉల్లంఘనలు, అపహరింతలు, ఊచకోతలు, మౌలికసదుపాయాల కొరత ఇత్యాది అంశాలపై ఓడరేవుపట్టణమైన గ్వాదర్‌లో బీవైసీ సంస్థ సమావేశానికి పిలుపునిస్తే అక్కడకు చేరేలోగానే నిరసనకారులమీద సైన్యం కాల్పులు జరిపింది. బలూచ్ ప్రజల నినాదాలు చేసినా, నిరసనలు నిర్వహించినా పోలీసులు విరుచుకుపడతారు. అరెస్టుచేయడం, చిత్రహింసలు పెట్టిచంపివేయడం, మాయంచేయడం వంటి విధానాలతో వందలమంది బలూచ్ నాయకులు కనిపించకుండాపోయారు. తమకు తలనొప్పిగా ఉన్న బలూచిస్థాన్ వనరులను యథేచ్ఛగా దోచుకోవడానికి దానిని చైనాకు అప్పగించింది పాక్ ప్రభుత్వం. చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్)లో భాగంగా అక్కడ భారీ తవ్వకాలు, ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోంది. కానీ, వీటివల్ల స్థానికులకు వీసమెత్తు ప్రయోజనం లేకపోగా, స్థానికేతరుల ఆక్రమణలు అధికమైనాయి. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నవారిపై పోలీసు అణచివేత హెచ్చుతున్న కొద్దీ, ఉగ్రవాదసంస్థలు బలపడుతున్నాయి.

సైనికబలంతో, ఊచకోతలూ అణచివేతలతో బలూచ్ ప్రజలను నియంత్రించలేమని పాక్‌పాలకులకు అర్థంకావాలి. వారి స్వాతంత్ర్య కాంక్షకు చారిత్రక కారణాలున్నాయని, తాము చేసిన, చేస్తున్న ద్రోహాలు వారిని మరింత రెచ్చగొడుతున్నాయని గ్రహించాలి. బలూచ్ వేర్పాటువాద శక్తులకు ప్రజల అండదండలు దండిగా ఉండటానికి, యువతరం సాయుధులు కావడానికీ పాక్‌పాలకులు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలు కారణం. అత్యంత అరుదైన, విలువైన ఖనిజ సంపద దండిగా ఉన్న ఈ ప్రాంతాన్ని దోచుకోవడమే తప్ప, ప్రజాశ్రేయస్సును పట్టించుకున్నది లేదు. దారిద్ర్యం, ఉపాధిలేమి, దుర్భర జీవితాలు స్థానికులను తిరుగుబాటువైపు నడిపిస్తున్నాయి. పాక్ పాలకులు బలూచిస్థాన్‌ను శత్రువుగా చూశారు, ఈ ప్రాంతం నాయకులు, గత ముఖ్యమంత్రుల సలహాలను పెడచెవినపెట్టారు, తమ నిలకడలేని విధానాలతో దానిని మరింత భ్రష్టుపట్టించారు. పాక్‌పాలకుల వైఖరిలో మార్పురావాలి. వేర్పాటువాదుల విధ్వంసానికి ప్రతిగా హింసకు పాల్పడటం, ఉగ్రవాదాన్ని నిర్మూలించేపేరిట ప్రజలను మరింత అణచివేయడమనే విషవలయం నుంచి బయటపడాలి. బలూచ్ ప్రజల వాదనలను, బాధలను వినాలి. వారి సంక్షేమం కోసం విశేషమైన కృషి జరగాలి.

సంపదను పెంచితే, పేదరికమూ పెరుగుతుంది!

‘సంపద పెంచటం ఎలా?’ అనే పేరుతో, జయప్రకాష్ నారాయణ్ (జెపి) రాసిన వ్యాసంలో (ఆగస్టు 18) ఆయన సూచించిన మార్గాలన్నీ, పేదరికాన్ని పెంచేవేగానీ, తగ్గించేవి ఎలా కావో చెప్పడానికే ఈ వ్యాసం. నిజానికి, జెపి చేసిన సూచనలు కొత్తవేమీ కాదు. 1991లో, పీవీ నరసింహారావు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సూచించిన సంస్కరణలే, ఇప్పుడు ఈయన చెపుతున్నవి. పీవీని సంస్కరణల పితామహుడు అంటారు గానీ, అంతకంటే పది సంవత్సరాల ముందే, బ్రిటన్‌లో సంస్కరణలను ప్రవేశపెట్టిన మాత మార్గరేట్ థాచర్. అదే సమయంలో అమెరికాలో ప్రవేశపెట్టిన పిత రొనాల్డ్ రీగన్.

‘పెట్టుబడి’ అనేది ఏ నిబంధనలనూ పాటించదు. దానికి నిర్నిబంధ స్వేచ్ఛ కావాలి. ఆ స్వేచ్ఛ కోసం ఉద్దేశించినవే ‘ఆర్థిక సంస్కరణలు’. ఇప్పుడు జెపి గారు చేసిన కొన్ని సూచనలను చూద్దాం.

(1) భూమికి సంబంధించీ, కార్మికులకు సంబంధించీ వున్న ‘చట్టాల సంకెళ్లను తొలగించాలి’ అని ఒక సూచన. దీని అర్థం, చిన్న చిన్న భూముల యజమానుల భూముల్ని గానీ, గిరిజన ప్రాంతాల్లోని భూముల్ని గానీ, ఎటువంటి ఆటంకాలూ (సంకెళ్ళు) లేకుండా, వారి సమ్మతి లేకుండానే, స్వాధీనం చేసుకుని, పెద్ద పెద్ద కంపెనీలు చవగ్గా కొనుక్కోవడానికి వీలునిచ్చేలా చట్టాల్ని సవరించాలి అని! అలాగే, కార్మికులు, జీతాల పెంపుకోసమో, పనిగంటల తగ్గింపు కోసమో, ఉద్యోగ భద్రత కోసమో, మెరుగైన పని పరిస్థితులకోసమో, సమ్మెలు చెయ్యడానికి వీలునివ్వని విధంగా కార్మిక చట్టాల్ని సవరించాలి అని!

(2) ‘ఉత్పాదకతనీ, సంపాదనా సామర్థ్యాన్నీ పెంచేందుకు విద్యారంగంలో మార్పులు’ తేవాలి అని ఇంకో సూచన. ఆర్థిక సంస్కర్తల దృష్టిలో, ఉత్పాదకత అంటే, వీలైనంత తక్కువ సమయంలో, అతి తక్కువ మందితో, ఎక్కువ ఉత్పత్తికి వీలునిచ్చే టెక్నాలజీని వాడడం. దానివల్ల, ఆ టెక్నాలజీని వాడే పరిశ్రమల యజమానులకు లాభాలు పెరుగుతాయి గానీ, లక్షల సంఖ్యలో నిరుద్యోగ జనాభా తయారవుతారు.



నిజానికి, సరుకుల రూపంలోనూ, ‘సేవల’ రూపంలోనూ వుండే దేశ సంపదని సృష్టించేది శ్రామిక జనాలే గానీ, శతకోటీశ్వరులో, కోటీశ్వరులో కాదు. వీళ్ళ చేతుల్లో, సంపద సృష్టికి కావలిసిన ఉత్పత్తి సాధనాలు స్వంత ఆస్తిగా వున్నాయి కాబట్టి, శ్రామికులు సృష్టించిన సంపదకి యజమానులు వీళ్ళే అయ్యారు. పేదరికానికేమో శ్రామిక జనాలు యజమానులు! ఎంత తలకిందులుగా వుంది ప్రపంచం! దీన్ని తిన్నగా తిప్పినప్పుడే పేదరికం అనేది ఈ భూమండలం నించీ మాయమవుతుంది. అంతేగానీ, సంపదని పెంచుకుంటూ పోవడం వల్ల కాదు.

(3) ‘ఇళ్ల నిర్మాణం, వాణిజ్యం, పరిశ్రమలు వంటివి ప్రైవేటు రంగం చూసుకోవాలి’ అని మరో సూచన. ప్రైవేటు రంగం అంటే, అది నూటికి నూరుపాళ్ళూ లాభాల కోసమే వెంపర్లాడే రంగం. పని గంటలూ, పని వేగమూ, పనిలో వెసులుబాటూ, ప్రమాదాల నివారణకు ఏర్పాట్లూ, జీతాలూ, ఉద్యోగ భద్రతా వంటి విషయాలలో కార్మికుల పట్ల పరమ నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించే ఘనచరిత్ర గలది, ఈ ప్రైవేటు రంగం! ఐక్యరాజ్యసమితి వంటి మర్యాదస్తుల కూటమికి చెందిన ప్రపంచ కార్మిక సంస్థా, ఇంకా అనేక దేశాలలోని కార్మిక సంఘాలూ వెలువరించిన నివేదికలు చూస్తే ప్రైవేటు రంగం బండారం తెలిసిపోతుంది.

(4) కాంట్రాక్ట్ వ్యవసాయాన్నీ, ఇతర పద్ధతులనూ ప్రోత్సహించటం ద్వారా ‘వ్యవసాయాన్ని ఆధునీకరించాల’ని జెపి ఇంకో సూచన. కాంట్రాక్ట్ వ్యవసాయం ఉద్దేశం, భారీ పెట్టుబడులతో నడిచే కంపెనీలతో అసమాన షరతులతో ఒప్పందాలు చేసుకుని, ఆ కంపెనీల దయాదాక్షిణ్యాల మీద రైతులు ఆధారపడేలా చెయ్యడం. జెపి సూచించినట్టు, ‘వ్యవసాయాన్ని ఆధునీకరించడం’ అంటే, యంత్రాల వినియోగం తప్పనిసరి చెయ్యడం. దానివల్ల వ్యవసాయం మీద ఆధారపడిన కార్మికులకు పనులు లేకుండా పోతాయి. కాంట్రాక్టు వ్యవసాయం వల్ల మేలు కంటే నష్టాలే ఎక్కువని తేల్చిన సర్వేల కోసం, వ్యవసాయ ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన పత్రికల్నీ, పుస్తకాల్నీ, పర్యావరణవేత్తల రచనలనూ చూడవచ్చును. ఈనాటి రచనల్లోనే కాదు, 150 ఏళ్ళనాటి వ్యవసాయ శాస్త్రవేత్తల, మార్క్సు వంటి సామాజిక శాస్త్రవేత్తల రచనల్లోనూ చూడవచ్చును. ఉదాహరణకి, శ్రామికుల పట్ల సానుభూతితోనూ, ‘నేల’ పట్ల ప్రేమతోనూ, 1867 నాటి ‘కాపిటల్’లో మార్క్సు ఇలా అంటాడు: “పెట్టుబడిదారీ వ్యవసాయంలో సమస్త ప్రగతీ, ఒక రకమైన కళలో ప్రగతే: అది శ్రామికుణ్ణే కాక, భూసారాన్ని కూడా దోచుకునే కళలో ప్రగతి; భూసారాన్ని ఒక నిర్ణీత కాలం పాటు పెంచడంలో సాధించే సమస్త ప్రగతీ, ఆ సారానికి గల శాశ్వత మూలాధారాలను నాశనం చేయటంలో ప్రగతే. ఒక దేశం, ఉదాహరణకు అమెరికా లాగా, వ్యవసాయం ఆధునిక పరిశ్రమల పునాదిపై అభివృద్ధి చెందటం ప్రారంభించిన కొద్దీ, ఈ విధ్వంసన క్రమం మరింత త్వరితగతితో సాగుతుంది. కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తి, సమస్త సంపదకూ మూలాధారాలను, అంటే, నేలనీ, శ్రామికుల్నీ పీల్చిపిప్పి చేయడం ద్వారా మాత్రమే, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధిపరుస్తుంది.”

(5) జెపి తన వ్యాసంలోనే ఒక చోట, ‘ఇప్పటికీ చాలామంది జీవనప్రమాణాలని నిర్ణయించటంలో తలసరి ఆదాయం అత్యంత కీలకమైనది’ అన్నారు. కానీ తలసరి ఆదాయం అనే కొలత ఎంత మోసపూరితమైనదో ఆయన గ్రహించినట్టు లేదు. దేశంలో కొత్తగా తయారైన సంపదని, దేశ జనాభాతో భాగిస్తే వచ్చేదే తలసరి ఆదాయం. ఉదాహరణకి, కిందటేడాది లెక్కల ప్రకారం, భారతదేశంలో ప్రజలకి తలసరి ఆదాయం ఏడాదికి 1 లక్షా, 72 వేలు. దీని ప్రకారం, ఒక కార్పొరేట్ వ్యవసాయ పరిశ్రమ యజమాని ఆదాయమూ, అదే పరిశ్రమలో పనిచేసే వ్యవసాయ కార్మికుడి ఆదాయమూ ఒకటే అన్నమాట! ఎంత వింత!

(6) “అధిక ఆర్థిక అభివృద్ధి” ద్వారానే పేదరికం తొలగుతుందని జెపి భావన! 1991 తర్వాత, దిగువనున్న 50 శాతం జనాభా ఆదాయం 4 రెట్లు పెరిగిందంటున్నారు ఆయన! కానీ, శతకోటీశ్వర్ల గురించిన వివరాలిచ్చే నివేదికల ప్రకారం, దేశ సంపదలో 60 శాతం, 5 శాతం మంది కోటీశ్వరుల చేతిలో వుందనీ, అడుగునున్న 50 శాతం జనాభా చేతిలో, 3 శాతం సంపద మాత్రమే వుందనీ చెపుతున్నాయి. నిజానికి, సరుకుల రూపంలోనూ, ‘సేవల’ రూపంలోనూ వుండే దేశ సంపదని సృష్టించేది శ్రామిక జనాలే గానీ, శతకోటీశ్వరులో, కోటీశ్వరులో కాదు. వీళ్ళ చేతుల్లో, సంపద సృష్టికి కావలిసిన ఉత్పత్తి సాధనాలు స్వంత ఆస్తిగా వున్నాయి కాబట్టి, శ్రామికులు సృష్టించిన సంపదకి యజమానులు వీళ్ళే అయ్యారు. పేదరికానికేమో శ్రామిక జనాలు యజమానులు! ఎంత తలకిందులుగా వుంది ప్రపంచం! దీన్ని తిన్నగా తిప్పినప్పుడే పేదరికం అనేది ఈ భూమండలం నించీ మాయమవుతుంది. అంతేగానీ, సంపదని పెంచుకుంటూ పోవడం వల్ల కాదు.

దీన్నిబట్టి అర్థం చేసుకోవలిసింది ఏమిటంటే, ఉత్పత్తి సాధనాలు, ఏ శ్రమా చెయ్యని యజమానుల చేతుల్లో వున్నంత కాలమూ, సంపదని ఎంత పెంచితే, పేదరికమూ అంత పెరుగుతుంది!

• నౌరోజీ

కూలుస్తున్నారు సరే, ఏ విలువను నిలబెడతారు?





■ కె. శ్రీనివాస్

సందర్భం

మహారణ్యం కూడా నిశ్శబ్దంగా, అదృశ్యంగా ఎదుగుతుంది, కానీ, కూలిపోయేటప్పుడు ఒంటరి చెట్టు కూడా పెద్ద చప్పుడు చేస్తుంది... ఎవరిదో ఏనాటిదో ఒక సుభాషితం ఇది. దీని ఉదాత్త అర్థమేదైనా, నిర్మాణం మితభాషి అని, విధ్వంసంలో ఒక హడావిడి ఉన్నదని మాత్రం తెలుస్తోంది.

కూలడమైనా, కూల్చడమైనా ఒక ఘటన.
కనిపించే, వినిపించే ఒక చర్య
కూల్చివేత ఒక దృశ్యం.

రాజకీయాలకు దృశ్యాలు చాలా అవసరం. ఈ సత్యం యోగి ఆదిత్యనాథ్‌కు తెలుసు. బుల్‌డోజర్‌ను చక్రాలు తొడిగిన ‘తక్షణ’ న్యాయదేవతగా ఆయన ముస్తాబు చేశాడు. దానికింద నలిగినవాళ్లకు అది రాకాసి పార కావచ్చును కానీ, ప్రేక్షక మాత్రులకు మాత్రం అది పనిచేస్తూ కనిపించే ప్రభుత్వం. జనం తరపున తానే లించింగ్ చేసే అధికారిక యంత్రం.

దశాబ్దం కిందట కేసీఆర్ కూడా ఎన్ కన్వెన్షన్ దగ్గర హడావిడి చేశారు. అయ్యప్ప సొసైటీ ఆక్రమణల గురించీ మాట్లాడారు! హైడ్రా కాదు కదా అమీబా కూడా ఆయన ఏర్పాటు చేయలేదు! తడిసిపోయిన టపాకాయ లాగా ఆ ఘట్టం పెద్దగా పేలలేదు! దృశ్యాల అవసరం ఆయనకు లేకపోయిందేమో?

బీజేపీ నుంచి కూడా నేర్చుకోగలిగిన చాకచక్యం ఉన్న రేవంత్‌రెడ్డికి, ఈ దృశ్య రహస్యం తెలిసిపోయింది. యోగికి తట్టిందో లేదో కానీ, కూల్చివేతల వెనుక అదనంగా గీతా రహస్యం కూడా రేవంత్‌కు తెలిసివచ్చింది. బుల్‌డోజర్‌కు భగవద్గీత కూడా తోడైతే, ‘దేశం కోసం ధర్మం కోసం’ చాలా చేయొచ్చు! ఏకంగా కూల్చివేతలకు ఒక సంస్థనే పెట్టొచ్చు, దానికో చట్టమూ చేయవచ్చు!

లోకంలో అక్రమంగా కట్టినవి అనేకం కూల్చవలసినవి ఉంటాయి. తలెగరేసి నిలబడవలసినవి అనేకం కూలిపోతూ ఉంటాయి. ఎవరు ఏ పార్టీకి, ఏ నాయకుడికి జైజైలు కొట్టినా, నియమాలు, చట్టాలు అందరికీ ఒకేలాగ వర్తించవని, అట్లా వర్తించకుండా చూడడానికే ప్రభుత్వాలు, వ్యవస్థలు, నిపుణులు, ప్రతిభావంతులు పనిచేస్తూ ఉంటారని అందరికీ తెలుసు. చిన్న చిన్న తప్పులకు ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గేవారు, పూచీకత్తు కట్టలేక బెయిళ్లు పొందలేనివాళ్లు వేలాదిమంది ఉంటారు. పెద్ద పెద్ద తప్పులుచేసి దర్జాగా బయటిప్రపంచంలో తిరిగేవాళ్లు, పరాయిదేశానికి రెక్కలు తొడుక్కున్నవాళ్లు వార్తల్లో పెద్ద మనుషులుగా కనిపిస్తారు. ఇదంతా సహజమని, ఈ అంతస్థుల న్యాయం, బలవంతుడి ధర్మం అచంచలమైనవని అనిపిస్తున్నప్పుడు, ఎప్పుడైనా ఒక్కసారి సంపన్నుడి జేబుకు కన్నం, పెత్తందారుకు బెత్తపు దెబ్బ తగిలినప్పుడు, పేదలకు ఉచితంగా ఒక చక్కిలిగిలి, ఒక ఊరట దక్కుతాయి. అధికారం తమ తరపునే పనిచేస్తున్నదన్న తృప్తి ప్రాప్తిస్తుంది. ఆ న్యాయం తమ కళ్లెదుటే దృశ్యమానం అయినప్పుడు, ఆ సంతోషమే వేరు!

‘హైడ్రా’ సాహసదాడుల ద్వారా రేవంత్‌రెడ్డి ప్రజలకు అమందానందాన్ని కలిగించబోయారు! కొంతవరకు విజయం సాధించారు కూడా! డబ్బూ హోదా బాగా ఉన్న సంఘబలిష్ఠుల తప్పు రట్టయిందని, వారిని కూడా చట్టం గట్టిగా కొట్టిందని చూసి, విని, తెలుసుకుని, ఒంటి కాలిమీద అయినా ఇంకా న్యాయం మిగిలుందని జనానికి నమ్మకం కలిగింది. ఆ ఉత్సాహంలో తబ్బిబ్బు అయిపోయి, ఈ దశ చిరకాలం కొనసాగుతుందని వారమో నెలో రెన్నెల్లో ఆశల్లో తేలియాడే అవకాశం దొరికింది. కలగవలసిన వారికి భయమూ కలిగింది! ఒక్కోసారి, ఇటువంటి మెరుపుకలలు లేకపోతే, ఈ లోకంలో బతకడం కష్టం!

ఈ కూల్చివేతల వల్ల, రెండు మూడు అదనపు ఫలితాలు కూడా దక్కినయి. ఒకటి, రేవంత్‌రెడ్డికి కొంత ఊరట దొరికింది. ప్రజల దృష్టి మరల్చడానికే ఈ ‘హైడ్రా’ అధ్యాయం అవతరించిందని ప్రతిపక్షాలు అంటున్నాయి కానీ, అందుకోసమే ఇదంతా అంటే సరికాదు. దాని వల్ల ఈ ఫలితం కూడా సమకూరింది అనడం నిజానికి దగ్గరగా ఉంటుంది. ఒక్కసారిగా, రుణమాఫీలు, రుణబంధులు, ఇతర ఎన్నికల వాగ్దానాలు వెనక్కుపోయాయి. తెలంగాణతల్లి వర్సెస్ రాజీవ్‌గాంధీ వివాదం పక్కకు వెళ్లింది. రేవంత్‌రెడ్డి పాలనలో సతమతమవుతున్నారు, తన ముద్ర చూపించలేకపోతున్నారు, అసలు ఇంకా పట్టే సంపాదించలేదు అని విమర్శించేవారంతా మౌనం వహించారు. కఠినమైన, సాహసమైన, న్యాయంగా కనిపించే నిర్ణయాలు తీసుకోగల సమర్థుడు అన్న ఇమేజ్‌కు ఉన్నట్టుండి ఆస్కారం ఏర్పడింది.

మరొక ముఖ్యమైన ఫలితం, ఒకనాడు చెరువుల పట్టణంగా వర్ధిల్లిన హైదరాబాద్‌ను ఎట్లా కబ్జాకోరులు నంజుకుని తిన్నారో వివరాలన్నీ బయటకు రాసాగాయి. జనంలో ఈ ఆక్రమణల మీద ఆసక్తి పెరిగింది. ఈ సమాచారపు వెల్లువ వల్ల, ఇకనైనా ఆక్రమణలను నిరోధించి, ఉన్న మేరకైనా నగరాన్ని కాపాడుకోవాలన్న స్పృహ పెరుగుతోంది. ఆక్రమణలకు మూలకారకులెవరు అన్న చర్చ జరిగి, పలుకుబడి ప్రయోగించే రాజకీయ నేతలు, నియమాల మెడలు వంచిన అధికారగణం పాత్ర గురించిన ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. ఘరానా బాబులు ఆక్రమించారు నిజమే, కానీ, వారికి అనుమతుల తివాచీలు పరిచిందెవరు? వారెందుకు శిక్ష తప్పించుకోవాలి? వంటి సూటిప్రశ్నలు న్యాయస్థానాలు కూడా సంధిస్తున్నాయి.

కాళ్ల కింద కాసింత నేల కోసం చెరువుల అంచున, నాలాల పక్కన గుడిసెలు వేసుకునే వారిని, పడావులో ఉండే ప్రభుత్వ భూములలో తలదాచుకునేవారిని అత్యుత్సాహంతో ఊడ్చిపారేసినప్పుడు, ఈ సభ్యసమాజం ఇంతగా కలవరపడదేమి? వారిని అధికార యంత్రాంగం ఏనాడూ కనికరించిన పాపాన పోదు కదా? ఈ మహానగరాన్ని వరదలో కుంభవృష్టిలో ముంచెత్తినప్పుడు, గోడలు కూలీ, కాలువల్లో కొట్టుకుపోయీ ఆ అభాగ్యులే చనిపోతారు కానీ, లారీల కొద్దీ మన్నుకుమ్మరించి మట్టాన్ని పెంచుకుని నిర్మించుకున్న కబ్జా భవంతులన్నీ క్షేమంగానే ఉంటాయి. చెరువుల దారులను పేదలెప్పుడూ మూసివేయరు. మహాభవనాలే కరకట్టలై పల్లపు జీవితాలకు గండికొడతాయి!

ఈ హడావిడి ఎక్కువ కాలం ఉండదని, నిజంగా సత్సంకల్పంతో మొదలైనా, ఒత్తిడుల బరువుతో ఇది కుంగిపోతుందని బహుశా అందరికీ తెలుసు. అస్మదీయుల మైనా నోటీసులు, కూల్చివేతలు తప్పవని ముఖ్యమంత్రి చెప్పడం బాగుంది కానీ, అన్ని అక్రమాల మూలాలు చివరకు అధికారపీఠాల పెరళ్ల దగ్గరే ముగిసి, చర్యలు క్రమంగా మగతలోకి జారుకుంటాయని కూడా తెలుసు. కానీ, ఈ వేడి ఉన్నప్పుడే, సాధ్యమైనన్ని ఎక్కువ సత్యాలు మాట్లాడుకోవాలి, అక్రమార్కులను విమర్శల బోనెక్కించాలి. మాటలకు చేతలకు నడుమ ఉండే ద్వంద్వత్వాన్ని సాధ్యమైనంతగా ఇరుకున పెట్టాలి. అందుకే, ఈ తేనెతుట్టెను కదిలించినందుకు రేవంత్‌రెడ్డిని అభినందించాలి.

రేవంత్‌రెడ్డి ఇమేజ్‌ను ‘హైడ్రా’ ఎంత వరకు మరమ్మత్తు చేయగలదు అంటే చెప్పడం కష్టం. కూల్చివేతల సారథిగా పోలీసు అధికారి రంగనాథ్‌కు హైడ్రా కీర్తిలో చాలా వాటా వెడుతుంది. చర్యలు ఆగిపోయినప్పుడు ఆ అప్రదిష్ట మాత్రం రేవంత్‌రెడ్డికే దక్కుతుంది. ప్రస్తుతం ‘హైడ్రా’ డాన్ క్విక్సోట్ లాగా అనిపిస్తుంది కానీ, మున్ముందు అసలు ఘట్టం ఆవిష్కృతమవుతుంది. ఆరంభదశలో ఉన్న సంచలనాత్మకత తగ్గి పోయి, క్రమంగా సమస్యాత్మక అంశాలు ముందుకు వస్తాయి. అసౌకర్యం కలిగించే చారిత్రక వాస్తవాలన్నీ గుర్తుకు వస్తాయి. 2000 నాటి వరదల్లో దోషులెవరు దగ్గర నుంచి, హుసేన్ సాగర్ చుట్టూ వలయాకారపు ఆక్రమణలూ, హైడ్రా ఆఫీసున్న బుద్ధభవనమూ అన్నీ ప్రశ్నార్థకాలవుతాయి! ఆక్రమణదారులు సొంతంగా అనుభవించరు, అమ్ముకుని సొమ్ముచేసుకుంటారు, కొనుక్కున్న మధ్యతరగతి గగ్గోలు పెడుతుంది. ఈ లోగా, తాత్కాలిక ఫలితాలతో సంతుష్టి చెందిన పాలకులు, మరో కొత్త సంచలనానికి వలసపోలేతారు!

> ఈ వేడి ఉన్నప్పుడే, సాధ్యమైనన్ని ఎక్కువ సత్యాలు మాట్లాడుకోవాలి, అక్రమార్కులను విమర్శల బోనెక్కించాలి. మాటలకు చేతలకు నడుమ ఉండే ద్వంద్వత్వాన్ని సాధ్యమైనంతగా ఇరుకున పెట్టాలి. అందుకే, ఈ తేనెతుట్టెను కదిలించినందుకు రేవంత్‌రెడ్డిని అభినందించాలి.

చెరువులు అయినా, మూసీ రక్షణ అయినా, కొంత కాఠిన్యాన్ని, కొంత ఆచరణాత్మకతని మిళితం చేసి వ్యవహరిస్తే ఎంతో కొంత ఫలితం దక్కుతుంది, విలువలుగా మారితే, దక్కినది నిలబడుతుంది. ఆక్రమణలు, నియమోల్లంఘనలు ఇకమీదట అనుమతించబోమని, సహజవనరుల పరిరక్షణకు అమిత ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలి. ఇప్పటిదాకా జరిగిన కబ్జాలు, జలాశయాలకు కల్పించిన అవరోధాలు, ఎంతవరకు దిద్దుబాటు చేయగలమో పరిశీలించి, ఆ దిశగా చర్యలు చేపట్టాలి, నగర జీవనాన్ని మరింత క్షేమం, సౌకర్యం, పర్యావరణ హితం చేయడమే కర్తవ్యాలుగా ఉండాలి. వర్షప్రవాహాలను ప్రభావితం చేసి, నిర్మాణాలు చేసినవారి నుంచి పెద్ద ఎత్తున జరిమానాలు వసూలు చేయాలి. భవననిర్మాణ సంస్థల నుంచి రాజకీయ కప్పాలను వసూలు చేస్తున్నారన్న వార్తలు వింటున్నాం, వాటితో పాటు, నగర పర్యావరణాన్ని, జల వనరులను రక్షించడానికి సుంకాలను కూడా వసూలు చేయాలి. అధికార యంత్రాంగాన్ని, రాజకీయ నాయకులను గత చర్యలకు, ప్రస్తుత చర్యలకు కూడా బాధ్యత వహించేట్టు చేయాలి. ఈ చర్యలకు పెద్దగా దృశ్యమానత ఉండదు మరి!

ఆప్టిక్స్‌ను ఆశ్రయించే ఆధునిక రాజకీయాలలో ఈ నిశ్శబ్దనిర్మాణాత్మకతను ఆశించడం కష్టమేమో?

> ఆక్రమణలు, నియమోల్లంఘనలు ఇకమీదట అనుమతించబోమని, సహజవనరుల పరిరక్షణకు అమిత ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలి. ఇప్పటిదాకా జరిగిన కబ్జాలు, జలాశయాలకు కల్పించిన అవరోధాలు, ఎంతవరకు దిద్దుబాటు చేయగలమో పరిశీలించి, ఆ దిశగా చర్యలు చేపట్టాలి, నగర జీవనాన్ని మరింత క్షేమం, సౌకర్యం, పర్యావరణ హితం చేయడమే కర్తవ్యాలుగా ఉండాలి. అధికార యంత్రాంగాన్ని, రాజకీయ నాయకులను గత చర్యలకు, ప్రస్తుత చర్యలకు కూడా బాధ్యత వహించేట్టు చేయాలి. ఈ చర్యలకు పెద్దగా దృశ్యమానత ఉండదు మరి! ఆప్టిక్స్‌ను ఆశ్రయించే ఆధునిక రాజకీయాలలో ఈ నిశ్శబ్దనిర్మాణాత్మకతను ఆశించడం కష్టమేమో?

డెవలప్‌మెంట్ జర్నలిజంలో మార్గదర్శకుడు విహెచ్



విహెచ్‌గా ప్రాచుర్యం పొందిన వి.హనుమంతరావు జర్నలిస్ట్‌గా 65 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో, అనేక మైలురాళ్ళను దాటారు. వార్తలు, అభిప్రాయాలను సామాన్యుల దృక్కోణం నుండి వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అందించే జర్నలిజమే నిజమైన జర్నలిజం అని ఆయన విశ్వాసం. అదే తరచు చెబుతూ ఉండేవారు.

తెలుగు దినపత్రిక విశాలాంధ్ర కోసం పార్లమెంటు సమావేశాలకు హాజరయి వార్తలు అందించిన మొదటి పాత్రికేయుని ఘనత విహెచ్‌ది. ఆయన ఐఎన్ఎస్ విక్రాంత్ నుండి యుద్ధ వార్తలు అందించిన వార్ రిపోర్టర్. జర్నలిజం పాఠశాలను; వార్తా సంస్థ, డేటా న్యూస్ ఫీచర్స్ (డిఎన్ఎఫ్)ను నెలకొల్పి, డేటాను వివరించే అభివృద్ధి జర్నలిజంలోకి యువ జర్నలిస్టులను ప్రవేశించడానికి ఆయన కృషి అపారం. రాజకీయ, పాత్రికేయ రంగాలలో పలువురు సీనియర్లు ఆయన అభిమానులున్నారంటే ఆర్థిక, రాజకీయ సామాజిక, గ్రామీణ వ్యవస్థలపై ఆయనకున్న పట్టు తెలుపుతుంది. ఆయన చెప్పింది ఆథెంటిక్.

గోదావరి జిల్లా, మండపేటలో జన్మించిన హనుమంతరావు తొలుత, కమ్యూనిస్ట్ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వద్ద స్టెనోగా చేరి, ఆ తరువాత జర్నలిజం వృత్తిలో ప్రవేశించి అంచలంచెలుగా ఎదిగి వివిధ పత్రికల్లో వివిధ హోదాలకు ఎదిగి తన ప్రతిభ చాటుకున్నారు. అనుభావిక డేటా ఆధారంగా వార్తాకథనాలు రాయడంలో ఆయన నిపుణుడు, తెలుగులో డెవలప్‌మెంట్ జర్నలిజంలో మార్గదర్శకుడు. మూడు దశాబ్దాలకు పైగా డిఎన్ఎఫ్ ఏజెన్సీని నిర్వహించడమే గాక, వార్తా రంగానికి, విద్యా, ఉద్యోగ పోటీ రంగంలో యువతకు ఏ ఏడాదికా ఏడు తాజా సమాచారంతో ఇయర్ బుక్‌లను ప్రచురించిన అరుదైన ఘనత ఆయనది.

కృష్ణా పత్రిక, ఈనాడు, ది ఎకనామిక్ టైమ్స్, విశాలాంధ్ర, ప్రజాశక్తి మొదలైన మీడియా సంస్థలలో ఆయన వివిధ హోదాలలో ప్రతిభ కనబరచారు. చట్టసభల వార్షిక బడ్జెట్‌లను అక్షరం వదలకుండా అధ్యయనం చేసిన వ్యక్తి అని చెప్పవచ్చు. అసెంబ్లీ, పార్లమెంట్ వార్షిక బడ్జెట్‌లపై వివరణాత్మక సమాచారం అందివ్వడంలో, విశ్లేషించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన సరళమైన భాషకు, నిజాయితీకి నిలువెత్తు వ్యక్తి. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలపై ఖచ్చితమైన డేటాను అందించడంలో ఆయన అందె వేసిన చెయ్యి.

ఆయన రచనలు పలు రంగాల వారిని ఆలోచింపజేసేవి. సామాజిక, ఆర్థిక సమస్యలపై రాయడానికి పలువురు యువకులను ప్రోత్సహించారు. హనుమంతరావు అనేక మంది జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు. పాత్రికేయ, రాజకీయ వర్గాల్లో అత్యంత గౌరవనీయమైన వ్యక్తులలో ఒకరు. తెలుగు ఇంగ్లీషు పత్రికలలో వివిధ హోదాలలో 65 సంవత్సరాలకు పైగా జర్నలిజం వృత్తిలో కొనసాగిన అరుదైన వ్యక్తి. వీక్షణం అనే మాసపత్రికకు వ్యవస్థాపక సంపాదకులు. హనుమంతరావు వివిధ వార్తాపత్రికలు, పత్రికలలో అసంఖ్యాకంగా వ్యాసాలు రాశారు. ఆగస్టు 30న విహెచ్ శత జయంతి.

– నందిరాజు రాధాకృష్ణ, వెటరన్ జర్నలిస్ట్

(హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో రేపు ఉదయం పదిన్నరకు వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో విహెచ్ శతజయంతి సభ)

ఎడారి బతుకులకు ఇక సెలవు!

‘నౌకరీ ఎంత చిన్నదయినా చాలు బిడ్డా.. నాలుగు ముద్దలు నోట్లోకి పోతాయ్’ అనే మాట తెలంగాణలో ఏ మూలకు పోయినా వినిపించే ముచ్చట. సర్కారీ కొలువులు తగినన్ని లేకపోవడం, ఉన్నా వాటిని భర్తీ చేయడంలో గత ప్రభుత్వాలు చూపిన నిర్లక్ష్యం, ప్రైవేటు రంగంలోనూ తగినంత ఉపాధి చూపే పరిశ్రమలు, సంస్థలు లేకపోవడంతో తెలంగాణ వ్యాప్తంగా యువత ప్రతి పల్లె నుంచి పొట్ట చేతపట్టుకొని ఎడారి దేశాలకు చిన్నాచితకా పనులకు వలసపోతోంది. వీసా మోసాల బారినపడి ఎడారి దేశాల్లో కనుచూపు మేర మనిషి అనేవాడే కనపడని ఇసుక నేలల్లో ఒంటరిగా గొర్రెలు, ఒంటెలు కాస్తూ సంవత్సరాల తరబడి చిత్రహింసలు అనుభవిస్తున్న తెలంగాణ బిడ్డలు ఎందరో లెక్కాపత్రం లేదు.

బతుకుదెరువుకు ఎడారి దేశాలకు వలస వెళ్లిన వారిలో మోసపోయిన వారు అక్కడ అనుభవించే కష్టాలపై ఇటీవల మలయాళంలో ‘ఆడుజీవితం’ అనే సినిమా వచ్చింది. తెలంగాణ బిడ్డలు కూడా ఎందరో తెలియనితనంతో ఎడారి దేశాల్లో ఎన్నో కష్టాలు పడుతున్నారు. దేశ చట్టాల బారిపడి ఏళ్లకేళ్లు జైళ్లలో మగ్గుతున్నారు. ఉరిశిక్షల పాలవుతున్నారు. గల్ఫ్ దేశాల్లోని చట్టాల కాఠిన్యంతో చనిపోయిన తర్వాత వారి శవాలు సొంత ఊళ్లకు రావడానికి నెలల తరబడి పడుతోంది. ఇంట్ల మనిషి చనిపోయాడని తెలుసు. ఆఖరి చూపు చూసుకోలేక, అంత్యక్రియలు చేయలేక, ఆచారాలతో బయటకు వెళ్లలేక ఆ కుటుంబ సభ్యులు పడే గోస ఎంత భయంకరంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం. ఇన్ని కన్నీళ్లకు, కష్టాలకు, గోసలకు కారణం ఏమిటి– ఉన్న ఊళ్లోనో, సొంత రాష్ట్రంలోనే పని దొరక్కపోవడమే. ఆ కష్టాల నుంచి, ఆ కన్నీళ్ల నుంచి మన బిడ్డలను, మన కుటుంబాలను దూరం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. అందుకే ప్రతి బిడ్డకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పెట్టుబడుల సాధనకు నిద్రపోకుండా శ్రమిస్తున్నారు.

మన రాష్ట్రం వస్తే కొలువులన్నీ మనకే అంటూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ అనేక ప్రగల్భాలు పలికారు. అందుకే యువకులు నిలువునా నిప్పుకణికలై మండారు. అగ్గి పెట్టుకొని ఆత్మహత్యలు చేసుకున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ సాగిన పోరుకు యువత తమ ప్రాణాలను సమిధలుగా మార్చారు. యువత ప్రాణాలు కోల్పోతుండడంతో ఆవేదన చెందిన కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వాలని నిర్ణయించారు. ఫలితంగా 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైంది. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్ల పాటు కొలువుదీరిన కేసీఆర్ సర్కారు యువతను గాలికొదిలేసింది. కొడుకు, బిడ్డ, అల్లుడు, సడ్డకుని కొడుకు, చుట్టపోళ్లందరికీ కొలువులు ఇచ్చుకున్న కేసీఆర్ తెలంగాణ బిడ్డల కొలువుల ముచ్చట మర్చిపోయిండు. అదేమిని అడుగుదామని నోరు తెరిస్తే అరెస్టులు, జైళ్లపాలు చేయించిండు. కడుపు మండిన బిడ్డలు, వారి కుటుంబాలు శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ఆ కుటుంబంలో కొలువులన్నీ ఊడగొట్టిండ్రు. కాంగ్రెస్ పార్టీపైనా, రేవంత్‌రెడ్డిపైనా గంపెడు ఆశలు పెట్టుకుండ్రు. వారి ఆశలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కంటిపై కునుకు లేకుండా పనిచేస్తుండు.

తెలంగాణ ఉద్యమ నినాదం, ప్రజల ఆకాంక్షల్లో ఒకటైన నియామకాల విషయంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం తొలిరోజు నుంచే దృష్టి పెట్టింది. వివిధ కేసులతో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేసి 30 వేలకుపైగా నియామకాలు పూర్తి చేసింది. ఆయా కుటుంబాల్లో ఎనలేని సంతోషాన్ని నిలిపింది. 11,062 ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆ పరీక్షలకు సంబంధించిన కీ విడుదలైంది. త్వరలోనే ఫలితాల విడుదల, నియామకాల ప్రక్రియ పూర్తి కానుంది. ఈ నియామకాలు పూర్తయితే ఆ కుటుంబాల్లో కొత్త వెలుగులు రానున్నాయి. వైద్యారోగ్య శాఖలోనూ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అసమర్థతకు మారుపేరుగా నిలిచిన టీజీపీఎస్సీని ప్రజా ప్రభుత్వం సమూల ప్రక్షాళన చేసింది. కొత్త పోస్టులు కలిపి గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదల చేసింది. నోటిఫికేషన్ల కోసం యువత సంవత్సరాల తరబడి ఎదురుచూపులు చూడకుండా, ఇబ్బంది లేకుండా చదువుకునేందుకు వీలుగా జాబ్ క్యాలెండర్‌ను ప్రజా ప్రభుత్వం జారీ చేసింది. ఓ వైపు సర్కారీ కొలువుల సందడి కొనసాగు తుండగానే, మరోవైపు ప్రైవేటు రంగంలోనూ కొలువులు పెద్ద సంఖ్యలో దొరికేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేస్తుండు. సుమారు పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ పెట్టుబడుల సాధనలో విఫలమైండు. కానీ ఎనిమిది నెలల కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో ఎంతగానో విజయవంతమయ్యారు. తొలుత దావోస్‌లో పర్యటించి వివిధ దేశాలకు చెందిన ప్రముఖ సంస్థలతో పెట్టుబడుల ఒప్పందం చేసుకున్నారు. తాజాగా అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో ఆయా దేశాల్లోని దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. మొత్తంగా వివిధ దేశాలకు చెందిన ప్రముఖ కంపెనీల నుంచి రూ.75వేల నుంచి రూ.80వేల కోట్ల పెట్టుబడులు తెలంగాణలో పెట్టేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒప్పించారు. ఈ పెట్టుబడులతో రానున్న ఐదేళ్లలో ప్రత్యక్షంగా సుమారు లక్షన్నర కొలువులు, పరోక్షంగా మరో ఆరు లక్షల కొలువులు తెలంగాణ బిడ్డలకు దొరకనున్నాయి.


> ఓ వైపు సర్కారీ కొలువుల సందడి కొనసాగుతుండగానే, మరోవైపు ప్రైవేటు రంగంలోనూ కొలువులు పెద్ద సంఖ్యలో దొరికేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేస్తుండు. ప్రైవేటు కంపెనీల్లో కొలువులకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందించేందుకు రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయిస్తున్నారు. నైపుణ్యం ఉన్నప్పుడు ఆయా కంపెనీల్లో మన తెలంగాణ బిడ్డలకు సులువుగా కొలువులు దొరుకుతయి. ఎడారి బతుకుల వెత తప్పుతుంది.



ఒకవైపు ప్రైవేటు కంపెనీలను పెట్టుబడులకు ఒప్పిస్తూనే మరోవైపు ఆ కంపెనీల్లో కొలువులకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందించేందుకు రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయిస్తున్నారు. నైపుణ్యం ఉన్నప్పుడు ఆయా కంపెనీల్లో మన తెలంగాణ బిడ్డలకు సులువుగా కొలువులు దొరుకుతయి. ఎడారి బతుకుల వెత తప్పుతుంది. ఈ విధంగా మన బిడ్డల బంగారు భవిష్యత్తుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తపన పడుతుంటే పదేళ్ల పాటు కొలువుల ముచ్చట మరిచి కమీషన్లతో కాలయాపన చేసిన కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు నిత్యం విమర్శలు, ఆరోపణలతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్రు. వారి తీరును పసిగట్టిన తెలంగాణ సమాజం శాసనసభ ఎన్నికల్లో ఓడించడమే కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో 0 సీట్లకు పరిమితం చేసింది. ఇకనైనా వారు సోయి తెచ్చుకుంటే మంచిది.

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతో ప్రజల కష్టాలు తీరుతాయని ఎంతగానో ఆశిస్తే నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్లు కేసీఆర్ చేసిండు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం కొలువుల విషయంలో, తెలంగాణ బడుగు బిడ్డల జీవితాలు మార్చేందుకు వంద శాతం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో చార్లెస్ స్వాబ్, అమెజాన్, కార్నింగ్, హెచ్‌సీఏ హెల్త్ కేర్, వాల్ష్ కర్రా హోల్డింగ్స్, కాగ్నిజెంట్ తదితర దిగ్గజ కంపెనీలను పెట్టుబడులకు ఒప్పించారు. అమెరికాలో కొలువు చేసిన నాకు అవి ఎంత ప్రతిష్ఠాత్మక సంస్థలో అవగాహన ఉంది. మన కోసం ఇంతగా తపిస్తున్న ఈ ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలి. ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న కేసీఆర్ కుటుంబ కుట్రలను మనమంతా ఏకమై తిప్పికొట్టాలి.

■ **ఈరవత్రి అనిల్**
చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 కనిష్ఠం 23.3

బై బ్యాక్
స్కీమ్‌తో బురిడీ
- రూ. 1.2 కోట్లకు పైగా కాజేసిన దంపతులు
- నిందితులకు రిమాండ్

8

పీహెచ్‌డీ అభ్యర్థులకు
‘వర్రీ’ఫికేషన్
- పే స్లిప్పులు తీసుకురావాలని అధికారుల హుకుం
- ప్రారంభమైన ధ్రువపత్రాల పరిశీలన



రాచకొండ కమిషనరేట్‌లో

స్థానచలనం

19 మంది సీఐలు, 10 మంది ఎస్సైల బదిలీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో బుధవారం భారీగా బదిలీలు జరిగాయి. 19 మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. బదిలీ జరిగిన ఇన్‌స్పెక్టర్లలో పలు పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు ఉన్నారు. ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌వోగా వినోద్‌కుమార్, హయత్‌నగర్ ఎస్‌హెచ్‌వోగా పల్స నాగయ్య, చౌటుప్పల్ ఎస్‌హెచ్‌వోగా మన్మధకుమార్, చర్లపల్లి ఎస్‌హెచ్‌వోగా రవికుమార్ నియమితులయ్యారు.



ఎయిరిండియా విమానం అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్, ఆగస్టు 28: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ఇండియా విమానం బుధవారం అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. కొచ్చిన్ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానంలో ఓ మహిళ అస్వస్థతకు గురైంది. వెంటనే పైలట్లు విమానాన్ని అత్యవసరంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. ఆ తరువాత సిబ్బంది సహాయంతో ఆమెను ఎయిర్‌పోర్టులోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు.

- పెరుగుతున్న వైరల్, మలేరియా, డెంగీ కేసులు
- రంగంలోకి వైద్యశాఖ ఉన్నతాధికారులు
- నగరంలో జ్వరాల కట్టడికి యుద్ధప్రాతిపదికన చర్యలు
- వేగంగా శానిటేషన్, ఫాగింగ్ ప్రక్రియ
- వాతావరణ మార్పులతో జలుబు, దగ్గు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక రద్దీ

నగరం జ్వరాల బారిన పడుతోంది. మారిన వాతావరణ మార్పులతో ప్రతి ఇంట్లో జ్వర బాధితులు ఉంటున్నారు. సాధారణ జ్వరాలతోపాటు మలేరియా, డెంగీతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఫలితంగా ఏరియా, ఇతర ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్ (ఓపీ) విభాగాలు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. జ్వరాల నియంత్రణకు రంగంలోకి దిగారు. ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలను పర్యవేక్షించడంతోపాటు అదనపు సిబ్బందిని నియమించారు. మలేరియా, డెంగీకి కారణమయ్యే దోమల నియంత్రణకు ఫాగింగ్ విస్తృతం చేస్తున్నారు. చెత్తాచెదారం పోగుకాకుండా చర్యలు చేపడుతున్నారు.



ఫీవర్.. హై అలర్ట్

అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం



రాంనగర్ డివిజన్ ఎస్సార్టీ క్వార్టర్స్‌లో సమస్యలు తెలుసుకుంటున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఏందీ చెత్త.. రోగాలు రావా?

కలెక్టర్ అనుదీప్ అసహనం

రాంనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ‘ఏందీ చెత్తా చెదారం? నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెందవా? ఇంత అధ్వానంగా ఉంటే వ్యాధులు ఎందుకు రావు? మీరంతా ఏం చేస్తున్నారు? క్షేత్రస్థాయిలో పర్యటించరా?’ అని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మహ్మద్ ఖాదర్‌పై అసహనం వ్యక్తం చేశారు. చెత్తా చెదారం, మట్టి కుప్పలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. డెంగీ, సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో కలెక్టర్ బుధవారం రాంనగర్‌లోని ఎస్సార్టీ క్వార్టర్స్ కృష్ణానగర్‌లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్సార్టీ కాలనీ, కృష్ణానగర్ కాలనీని ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను చూసి కలెక్టర్ కంగుతిన్నారు. వ్యర్థాలను వెంటనే తొలగించి యాంటీ లార్వా ఆపరేషన్ చేయాలని ఎంటమాలజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట కార్పొరేటర్ రవిచారి, బల్దియా అధికారులు ఉన్నారు.

జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోంది..

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

అడ్డగుట్ట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోందని, వీటి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. జ్వరాలన్నీ డెంగీ కాదని, సాధారణ జ్వరాలే అధికంగా వస్తున్నాయని చెప్పారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ బ్లాక్‌తోపాటు వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎలా అందుతుంది? సమయానికి వైద్యులు, నర్సులు వస్తున్నారా ? ఇంజక్షన్లు ఇస్తున్నారా? అని ఆరా తీశారు. అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల మేరకు ప్రభుత్వాస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని,



గాంధీ ఆస్పత్రిలో రోగుల వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ అజయ్‌కుమార్

రోగులకు వేగంగా వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గాంధీ ఆస్పత్రిలో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, ఇక్కడ అంతగా ఫీవర్ కేసులు లేవని చెప్పారు. కాగా, రోగులకు మందుల కొరత లేకుండా చూడాలని, రోగి వెంట అటెండర్ ఒక్కరే ఉండేలా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

నేలపైనే రోగులకు చికిత్స

గాంధీ ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్ వార్డులో సరిపడా మంచాలు లేకపోవడంతో రోగులు నేలపైనే చికిత్స పొందుతున్నారు. అడ్మిట్ అయిన రెండుమూడు రోజుల తర్వాతే మంచం దొరుకుతోందని, ఏ డాక్టర్ కూడా పట్టించుకోవడం లేదని పలువురు వాపోయారు.

ఉస్మానియా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

మంగళ్‌హాట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిని ప్రజావైద్య శాఖ సంచాలకుడు రవీందర్‌నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలతోపాటు కనీస సౌకర్యాలను పరిశీలించారు. మందులన్నీ లభి



క్యాజువాలిటీని తనిఖీ చేస్తున్న రవీందర్ నాయక్

స్తున్నాయా? పలువురిని అడిగి తెలుసుకున్నారు. క్యాజువాలిటీతోపాటు వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సాహయ్, ఆర్‌ఎంవోలు జయకృష్ణ, మహ్మద్ రఫి, సిద్దిఖీ, వివిధ విభాగాల వైద్యులతో డైరెక్టర్ సమీక్ష నిర్వహించారు.

‘ఫీవర్’లో బ్లడ్ స్టోరేజ్ యూనిట్

వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా, డిప్తీరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. బుధవారం ఆయన నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. వార్డుల్లోకి వెళ్లి వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. రోగులకిచ్చే మందులను పరిశీలించి వైరాలజీ, ఇతర ల్యాబ్‌లను సందర్శించారు. ల్యాబ్ సిబ్బంది పనితీరుపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫీవర్ ఆస్పత్రికి వైరల్ ఫీవర్ బాధితులు అధికంగా వస్తున్నారని, డెంగీ కేసులు ఎక్కువగా రావడం లేదని పేర్కొన్నారు. త్వరలో ఇక్కడ బ్లడ్ స్టోరేజీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల ఓపీకి నిత్యం 800 నుంచి 1100 మంది రోగులు వస్తున్నారని, డెంగీ కేసులు తక్కువ నమోదవుతున్నట్లు తెలిపారు. కమిషనర్ వెంట డీఎంహెచ్‌వో వెంకటి, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్ తదితరులు ఉన్నారు.



ఫీవర్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న వైద్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్

అర్ధరాత్రి కాల్పుల కలకలం

- గాజులరామారంలో బార్ వద్ద ఘటన
- రెండువర్గాలు బాహాబాహీ, పలువురికి గాయాలు
- పోలీసుల పనితీరుపై స్థానికుల విమర్శలు



కాల్పులు జరిగింది ఈ బార్ వద్దనే..

జీడిమెట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం బుధవారం అర్ధరాత్రి కాల్పుల మోతతో దద్దరిల్లింది. రెండు వర్గాలు తీవ్రంగా కొట్టుకోగా, రియల్ వ్యాపారి తన వద్ద ఉన్న తుపాకీతో ఆరు రౌండ్ల కాల్పులు జరిపాడు. స్థానికులు, పోలీసుల ద్వారా అందిన సమాచారం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో బాచుపల్లి నుంచి ఓ మహిళ, యువకుడు కలిసి బైక్‌పై గాజులరామారం వైపు వస్తున్నారు. స్థానికంగా ఓ బార్ వద్దకు రాగానే వాహనంలో పెట్రోలు అయిపోయింది. దీంతో యువకుడు బార్ ముందు నిలిపి ఉంచిన రెండు వాహనాల్లో పెట్రోల్ తీస్తుండగా సిబ్బంది గుర్తించి కొట్టారు. దీంతో సదరు యువకుడి వెంట వచ్చిన మహిళ మల్లంపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఓ ఎమ్మెల్సీ అనుచరుడిగా పేరున్న నరేష్‌కు ఫోన్ చేయడంతో హుటాహుటిన నలుగురితో కలిసి బార్ వద్దకు వచ్చాడు. రెండు వర్గాల మధ్య మాటామాట పెరిగి బాహాబాహికి దిగారు. ఆవేశంలో నరేష్ తన వెంట తెచ్చుకున్న తుపాకీతో గాల్లోకి ఆరు రౌండ్ల కాల్పులు జరపడంతో బార్ సిబ్బంది పరుగులు తీశారు. ఈ ఘటనలో కొందరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. జీడిమెట్ల పోలీసులు ఇద్దరు యువకులు, మహిళను అదుపులోకి తీసుకున్నారు. అయితే, కాల్పుల ఘటనపై పోలీసులు కిమ్మనకపోవడంపై స్థానికంగా తీవ్ర విమర్శలొస్తున్నాయి. అర్ధరాత్రి దాటినా బార్ తెరిచి ఉండడం గమనార్హం.

ఎమ్మెల్సీ అనుచరుడు నరేష్‌పై దర్యాప్తు చేయాలి

అర్ధరాత్రి కాల్పులకు తెగబడిన ఎమ్మెల్సీ అనుచరుడు, బీఆర్‌ఎస్ నాయకుడు మండల నరేష్‌పై పోలీసులు లోతుగా దర్యాప్తు చేయాలని బీజేపీ నాయకుడు సతీశ్ డిమాండ్ చేశారు. గతంలో తమ కార్యకర్తలపై దాడి చేశాడని, మల్లంపేట కేవీఆర్ లేఅవుట్‌లోని పార్కు స్థలం కబ్జాలో నరేష్ పాత్ర ఉన్నదని ఆరోపించారు. ఆయన భూకబ్జాలపై ఇప్పటికే కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అక్రమ ఆయుధాలు కలిగిన నరేష్‌తోపాటు అతడికి సహకరిస్తున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధిపై విచారణ జరపాలని సతీశ్ డిమాండ్ చేశారు.

ఎవరు సార్

యూజ్‌లెస్‌ఫెలో ?

ఉన్నతాధికారిపై ఎదురుతిరిగిన కానిస్టేబుల్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆ పోలీసు కానిస్టేబుల్‌లో ఉన్నతాధికారి పట్ల అప్పటిదాకా ఉన్న భయం పోయి.. ఎక్కడలేని ధైర్యం ఆవహించేసింది. డ్యూటీలో తన ఆలస్యానికి గల కారణాన్ని అర్థం చేసుకోకుండా అనవసరంగా యూజ్‌లెస్ ఫెలో అంటూ తనపై నోరు పారేసుకున్నారనే ఆవేదనతో ఎదురు తిరిగి గట్టిగా ప్రశ్నించాడు. బుధవారం పశ్చిమ మండలంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. బుధవారం రోల్‌కాల్ కోసం ఉదయం 10:30 గంటలకు ఉన్నతాధికారి స్టేషన్‌కు వస్తున్నారంటూ ముందుగానే సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అదే సమయానికి సదరు ఉన్నతాధికారి వచ్చారు. ఒక్కరు తప్ప పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది అంతా వచ్చారు. ఆలస్యంగా వచ్చిన ఆ ఒక్కరు అక్కడ పనిచేసే కానిస్టేబుల్ ! నిండు గర్భిణి అయిన భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లి.. అక్కడ ఆమెకు ప్రసవం జరిగేదాకా ఉండటంతో 15-20 నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు. అంతే.. ఆ కానిస్టేబుల్‌పై సదరు ఉన్నతాధికారి ఇంతెత్తున లేచారు. డ్యూటీ అంటే అంత చులకనా? బాధ్యత లేదా? రోల్‌కాల్‌కే ఆలస్యంగా వచ్చావు.. అసలు డ్యూటీ సరిగా చేస్తున్నావా? ఎందుకూ పనికిరారు.. యూజ్‌లెస్ ఫెలోస్ అని ఆవేశంతో ఊగిపోయారు. దానికి ఆ కానిస్టేబుల్.. నా భార్య పురిటినొప్పులతో బాధపడుతుంటే ఆస్పత్రికి తీసుకెళ్లాను.. కొంత ఆలస్యమైంది అని

మిగతా 6వ పేజీలో..

సోషల్ మీడియాపై నిఘా

- రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు
- సైబరాబాద్ సీపీ అవినాష్ హెచ్చరిక
- గణేష్ ఉత్సవాలపై కీలక సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభమయ్యే వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జరుపుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి సూచించారు. సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం గచ్చిబౌలిలోని కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో పాటు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్తు, పోలీస్, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీపీ మాట్లాడారు. ‘సెప్టెంబర్ 7 నుంచి 17 వరకు ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగడానికి పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. మండపాల నిర్వాహకులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. విజిబుల్ పోలీసింగ్‌తో పాటు సీసీటీవీ కెమెరాలపై దృష్టి సారిస్తాం. ఎక్కడ ఘటన జరిగినా పోలీసులు చర్యలు తీసుకోవాలి. 17న నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు, చెరువుల ఎంపిక, రోడ్ల మరమ్మతు, విద్యుత్తు, భారీ క్రేన్లు, మంచినీటి సౌకర్యం, ట్రాఫిక్ రద్దీ తదితర వసతులపై జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలి’ అని సూచించారు. ఈ సమావేశంలో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పొట్రు, రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జాయింట్ సీపీ జోయల్ డెవిస్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్లు ఉపేందర్‌రెడ్డి, వెంకన్న, డీసీపీలు, ఏసీపీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సీపీ సమావేశం

గణేష్ ఉత్సవాలతో పాటు నిమజ్జనానికి ఒకరోజు ముందు వచ్చే మిలాద్ ఉన్ నబీ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సెంట్రల్ పీస్ వెల్ఫేర్ కమిటీతో బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..అరాచకశక్తులు సోషల్‌మీడియాలో కించపరిచే వ్యాఖ్యలు చేసినా, రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, విశ్వప్రసాద్, ఎస్‌బీ డీసీపీ సాయిచైతన్య, స్నేహమెహ్రా, కృష్ణశర్మ, అదనపు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

నిద్రపోయే వేళ..
రీల్స్..షార్ట్స్! 8

ప్రైవేట్ సెక్యూరిటీ
ఏజెన్సీల పాత్ర కీలకం 8

దేవాలయ భూమిలో
సీసీ రోడ్డు

బటన్ నొక్కు.. సాయం పొందు !

- గ్రేటర్‌లో స్మార్ట్‌పోల్స్ ఏర్పాటుకు కసరత్తు

- ప్రతి పోల్‌కూ స్ట్రీట్ లైట్, సీసీ కెమెరా, ప్యానిక్ బటన్
- ప్రయోగాత్మకంగా రెండు చోట్ల ఏర్పాటు
- వీధి వ్యాపారులకు ప్రత్యేక పాలసీ
- మెరుగైన వీధిదీపాల నిర్వహణకు చర్యలు
- విభాగాల వారీగా కమిటీలు.. కమిషనర్ ఉత్తర్వులు

ఉచిత వైఫై, డిజిటల్ బోర్డు, ఎన్విరాన్‌మెంట్ సెన్సార్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో పౌర సేవల మెరుగుదల, సాంకేతిక సేవల విస్తృతంపై చేసేందుకు జీహెచ్‌ఎంసీ కసరత్తు చేస్తోంది. సమగ్ర ట్రాఫిక్, రహదారి నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఆశ్రయించడం నుంచి కాలుష్యం వివరాలు తెలిసేలా స్మార్ట్ పోల్స్. వీధిదీపాల మెరుగైన నిర్వహణ, వీధి వ్యాపారుల పాలసీపై విభాగాల వారీగా నాలుగు కమిటీలు వేసింది. ఆయా అంశాలకు సంబంధించి ఏం చేయాలన్నది నిర్ణయించడంతోపాటు టెండర్ ప్రకటన, బిడ్ల పరిశీలన పూర్తి చేసేలా బాధ్యతలు సంబంధిత అధికారులకు అప్పగిస్తూ కమిషనర్ ఆమ్రపాలి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత విభాగాల అదనపు కమిషనర్లు, ఇంజనీర్లను కమిటీ సభ్యులుగా నియమించారు.

బటన్ నొక్కి హలో.. హలో

నగరంలో త్వరలో ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద స్మార్ట్ పోల్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ప్రయోగాత్మకంగా సచివాలయం ఎదుట, నెక్లెస్‌రోడ్ ఇందిరాగాంధీ విగ్రహం చౌరస్తా వద్ద రెండింటిని ఏర్పాటు చేశారు. ఈ స్మార్ట్ పోల్‌కు వీధి దీపం, సీసీ కెమెరా, ప్యానిక్ బటన్, ఉచిత వైఫై, డిజిటల్ బోర్డు, ఎన్విరాన్‌మెంట్ సెన్సార్ ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్యానిక్ బటన్ నొక్కితే కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని ప్రతినిధులతో నేరుగా మాట్లాడొచ్చు. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నామన్నది తెలుసుకొని పోలీసులు సాయమందించే అవకాశముంటుంది. అలాగే ప్రజలు వినియోగించుకునేలా ఉచిత వైఫై.. ప్రకటనలు, ట్రాఫిక్ నిబంధనలు, ఇతర అంశాలను ప్రదర్శించేలా డిజిటల్ బోర్డులు, కాలుష్యం వివరాలు తెలిపే సెన్సార్లు ఉంటాయి. పార్కింగ్‌కు అవకాశమున్న చోట ఎలక్ట్రిక్

మిగతా 6వ పేజీలో..



మెరుగైన వీధి దీపాల నిర్వహణకూ..

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఈఈఎస్‌ఎల్‌కు అప్పగించినా నగరంలో వీధి దీపాల నిర్వహణ అత్యంత అధ్వానంగా తయారైంది. 60-70 శాతానికి మించి లైట్లు వెలగడం లేదని జీహెచ్‌ఎంసీ అధికారులే అంగీకరిస్తున్నారు. 5.20 లక్షలకుపైగా ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేసినా నిర్వహణ సరిగా లేక ప్రధాన, అంతర్గత రహదారులు అంధకారంగా మారుతున్నాయి. ఈఈఎస్‌ఎల్ ఒప్పందం వచ్చే ఏప్రిల్‌తో ముగియనుంది. ఈ నేపథ్యంలో సాంకేతికత ఆధారంగా వీధిదీపాల మెరుగైన నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సూచించనుంది. టెండర్ ప్రక్రియ, ఏజెన్సీ ఎంపిక కూడా కమిటీ బాధ్యతే.

బిత్తిరిసత్తిపై సీసీఎస్‌లో కేసు నమోదు

● భగవద్గీతను అవమానించడంపై రాష్ట్రీయ వానరసేన ఫిర్యాదు

హిమాయత్‌నగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బిత్తిరిసత్తి అలియాస్ కావలి రవికుమార్‌పై సీసీఎస్ సైబర్‌క్రైమ్స్‌లో కేసు నమోదైంది. రాష్ట్రీయ వానరసేన ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసారు. ఆ మధ్య బిత్తిరిసత్తి బిల్లుగీత పేరుతో ఘంటసాల ఆలపించిన భగవద్గీతను అనుకరిస్తూ ఓ పేరడీ చేసాడు. అయితే అది అసభ్యకరంగా ఉందని, హిందువులకు పవిత్రమైన భగవద్గీతను సత్తి అవమానించాడని వానరసేన అభ్యంతరం వ్యక్తం చేసింది. క్షమాపణలు చెప్పాలని కోరింది. క్షమాపణలు చెప్పడానికి బిత్తిరిసత్తి నిరాకరించడంతో వానరసేన ప్రతినిధులు సైబర్‌క్రైమ్స్‌లో ఫిర్యాదుచేసారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తాజాగా మరోసారి ఫిర్యాదుచేయడంతో సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసారు.

పోలీస్ స్టేడియం కోసం స్థలాల పరిశీలన


స్థలాల మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్, రెవెన్యూ అధికారులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా నూతన ఆస్పత్రి నిర్మాణానికి గోషామహల్ పోలీసు స్టేడియం స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించిన నేపథ్యంలో పోలీస్ స్టేడియం కోసం ప్రత్యామ్నాయంగా స్థలాన్ని కేటాయించనున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఆయన బహదూర్‌పురా, పేట్లబురుజులోని పోలీస్ ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీ స్థలాలను పరిశీలించారు త్వరలో దీనికి సంబంధించి పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు.

ఎవరు సార్ యూజ్‌లెస్‌లో ?

(5వ పేజీ తరువాయి)

వివరణ ఇచ్చాడు. అప్పటికీ కోపం తగ్గని ఆ అధికారి.. 'ఇలాంటి పనికి మాలిన సాకులు చెబుతూనే ఉంటారు.. కనీస బాధ్యత అనేదే లేకుండా" అని తీవ్ర స్వరంతో అన్నారు. కాసేపు అక్కడే మౌనంగా ఉండిపోయిన కానిస్టేబుల్, లోపలికి వెళ్లి యూనిఫామ్ వేసుకొని బయటకొచ్చి.. ఆ ఉన్నతాధికారి ఎదుట నిలబడ్డాడు. ' నా భార్యను నేను కాకపోతే ఎవరు సార్ ఆస్పత్రికి తీసుకెళ్లేది?' అని ఆవేదనాపూరిత స్వరంతో కాస్త గట్టిగానే నిలదీశాడు.

బటన్ నొక్కు.. సాయం పొందు !

(5వ పేజీ తరువాయి)

వాహనాల చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. స్మార్ట్ పోల్స్ ఏర్పాటుకు సంబంధించి జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్, అడ్వర్టయిజ్‌మెంట్ విభాగాల అధికారులు ఇప్పటికే పలు నగరాల్లో అధ్యయనం చేశారు.

రహదారులపై రయ్ రయ్

ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టేలా, వాహనదారుల ఇబ్బందులు తగ్గించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నారు. సెన్సార్లు, ఐవోటీ డివైస్‌లు వంటి అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ రియల్ టైం ట్రాఫిక్ వివరాలు తెలుసుకుంటూ వాహనాల రాకపోకలు పర్యవేక్షిస్తారు. నగర రహదారులపై ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా సమర్థ ట్రాఫిక్ విధానాల రూపకల్పన అమలుకు కమిటీ కృషి చేయనుంది. ప్రాంతాల వారీగా వాహనాల రాకపోకలు ఎంత మేర ఉన్నాయన్న వివరాలు అందుబాటులో ఉంచుతారు. దీని ఆధారంగా నూతన భవనాలకు అనుమతి ఇవ్వనున్నారు. అప్పటి వరకు ఆ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎలా ఉంది..? నూతన భవనాలతో ఎంత మేర అదనంగా వాహనాలు వస్తాయన్నది అంచనా వేసేలా ట్రాఫిక్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (టీఐఏ) విధానాలు రూపొందిస్తారు. ఆన్ అండ్ ఆఫ్ స్ట్రీట్ పార్కింగ్ విధానాలు, స్మార్ట్ పార్కింగ్ వసతుల కల్పనకు కమిటీ దిశానిర్దేశం చేయనుంది. రోడ్లు, ఆస్తుల కోసం జీఐఎస్ విధానాన్ని అమలు చేస్తూ రహదారుల వ్యవస్థ మెరుగుదలకు శ్రీకారం చుట్టనున్నారు.

> **కమిటీలు, సభ్యుల వివరాలు**
>
> **సమగ్ర ట్రాఫిక్, రోడ్ మేనేజ్‌మెంట్ కమిటీ**
>
> అదనపు కమిషనర్ (ట్రాఫిక్), ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ), హైదరాబాద్ అర్బన్ మెట్రోపాలిటన్ ట్రాఫిక్ అథారిటీ (హెచ్‌యుఎంటీఏ) ఎండీ, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్.
>
> **స్మార్ట్ పోల్స్ కమిటీ**
>
> ముగ్గురు అదనపు కమిషనర్లు (ప్రకటనలు, ఐటీ, ఎలక్ట్రికల్)
>
> **వీధి దీపాలు**
>
> అదనపు కమిషనర్ (ట్రాఫిక్), అదనపు కమిషనర్ (ఎలక్ట్రికల్), చీఫ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం).
>
> **వీధి వ్యాపారుల పాలసీ**
>
> అదనపు కమిషనర్ (యూసీడీ), అదనపు కమిషనర్ (ఎస్టేట్), హైదరాబాద్ అర్బన్ మెట్రోపాలిటన్ ట్రాఫిక్ అథారిటీ (హెచ్‌యుఎంటీఏ) ఎండీ, చీఫ్ సిటీ ప్లానర్, జీహెచ్‌ఎంసీ

వీధి వ్యాపారుల పాలసీకి..

గ్రేటర్‌లో వీధి వ్యాపారులకు సంబంధించి ఇప్పటివరకు సమగ్ర పాలసీ లేదు. గతంలో అంబర్, గ్రీన్, రెడ్ జోన్ అని పలు ప్రాంతాలను గుర్తించినా అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో వీధి వ్యాపారుల రక్షణ, వారి హక్కులకు భంగం కలగకుండా ఏం చేయాలన్న దానిపై కమిటీ విధి విధానాలు రూపొందించనుంది.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మిరాజ్

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

మదీన, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ అధికారులకు సూచించారు. నియోజకవర్గానికి చెందిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన జోనల్ కమిషనర్ టి.వెంకన్నతో కలిసి బుధవారం నర్కిఫూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రెయిన్‌బజార్, తలాబ్ చంచలం, కుర్మగూడ, సంతోష్‌నగర్, డబీర్‌పురా డివిజన్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నాలాలు, డ్రైనేజీల పూడికతీత పనులు చేపట్టి, రానున్న వర్షాలకు వరద సమస్యలు రాకుండా చూడాలన్నారు. రోడ్లు, వీధిదీపాలు, పారిశుధ్యం, చెట్ల కొమ్మలు, డ్రైనేజీ, టౌన్‌ప్లానింగ్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, మహ్మద్ వసీయుద్దీన్, ఆలందార్‌వాలా జాహీ, ముజఫర్ హుస్సేన్, సయ్యద్ సొహైల్ ఖాద్రి, నస్రీన్ సుల్తాన, సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈలు హరికిశోర్, ఏకంబరం, రామారావు, టౌన్‌ప్లానింగ్ సీపీ మహ్మద్ అబ్దుల్ మాజీద్, ఏసీపీ, డీఈలు, ఏఈలు పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్

నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రాజేంద్రనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాలు, గణేశ్ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ గణేశ్ ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. ఎంఎం పహాడీలోని లక్కీ ప్యాలెస్‌లో అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, మతపెద్దలు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ, అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హిందువులు, ముస్లింలు, సిక్కులతోపాటు దేశంలోని అన్ని కులాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని, నవరాత్రి ఉత్సవాలు, గణేశ్ నిమజ్జోనత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మండపాల వద్ద కొత్తవారు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అన్ని మండపాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తారన్నారు. నిమజ్జనోత్సవాలను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రవి, వెంకన్న, శ్రీనివాస్‌తో పాటు మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

జాతీయ స్పోర్ట్స్ మీట్‌కు శివరాంపల్లి కేంద్రీయ విద్యార్థులు



స్పోర్ట్స్ మీట్‌కు అర్హత సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీపీ శర్మ

రాజేంద్రనగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ స్పోర్ట్స్ మీట్‌కు శివరాంపల్లి లోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు అర్హత సాధించారు. బుధవారం శివరాంపల్లి లోని కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీపీ శర్మ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ స్పోర్ట్స్ మీట్‌కు అర్హత సాధించిన ఆశీష్ నెహ్రా, వివేక్ రావత్, భవ్య, రోష్మీథాప, శ్రీశాంత్, నమన్, తుషార్‌ను సన్మానించి అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. సెప్టెంబర్ 11 నుంచి 15వ తేదీ వరకు ఐఐటీ కాన్పూర్‌లోని కేంద్రీయ విద్యాయాల స్కూల్‌లో 53వ జాతీయ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నారు.

రెండంతస్తుల భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

రాజేంద్రనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెండంతస్తుల భవనం పై నుంచి కిందపడిన ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ సర్కిల్ మాణిక్యమ్మ కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే... మహబూబ్‌నగర్ జిల్లా చౌడాపూర్ మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిని పెద్ద చిన్నయ్య(35) నగరానికి వచ్చి రాజేంద్రనగర్ సమీపంలోని మాణిక్యమ్మ కాలనీలో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటూ మేస్త్రీ పనులు చేసుకుంటున్నాడు. అదే కాలనీలో ఉంటున్న దత్తు అనే వ్యక్తి నూతన భవనాన్ని నిర్మిస్తున్నాడు. బుధవారం భార్యతో కలిసి పనికి వెళ్లాడు. రెండో అంతస్తులో గోడపైకి ఎక్కి మార్కింగ్ చేస్తుండగా, ప్రమాదవశాతు కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రాజేంద్రనగర్ పోలీసులు ఘటనాస్థలికి వచ్చి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు నష్టపరిహారంగా రూ. 8.50 లక్షలు ఇవ్వడానికి భవన యజమాని దత్తు, మృతుడితో పనులు చేయిస్తున్న మాధవరావు ముందుకొచ్చారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫర్నిచర్ దుకాణంలో అగ్నిప్రమాదం

మంగళ్‌హాట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఫర్నిచర్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లక్షల విలువ చేసే ఫర్నిచర్ కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికు వివరాల ప్రకారం.. మల్లేపల్లికి చెందిన ఫైజాన్ 'ఆలం రహీం' పేరుతో ఫర్నిచర్ దుకాణాన్ని ఏర్పాటు చేసి నాలుగు సంవత్సరాలు నడుపుతున్నాడు. మంగళవారం రాత్రి 9.30 గంటలకు దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు.

తెల్లవారుజామున దుకాణంలో నుంచి పొగలు వస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఫైర్‌సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మూడు ఫైరింజన్లతో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల విలువ చేసే ఫర్నిచర్ కాలిపోయినట్టు పోలీసులు తెలిపారు. హబీబ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రశాంత్ కాలనీలో శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు, చెట్ల మధ్య వేలాడుతున్న వైర్లు



శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు

- శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో పలుచోట్ల
- చెట్ల మధ్య వేలాడుతున్న తీగలు
- ప్రమాదాలు జరిగితే కానీ పట్టించుకోరా అంటున్న ప్రజలు

రాజేంద్రనగర్, ఆగస్టు27(ఆంధ్రజ్యోతి): శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. కొన్నిచోట్ల చెట్ల కొమ్మల మధ్య నుంచి వైర్లు ఉండటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుంతోదనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఐదు రోజుల క్రితం శిథిలావస్థకు చేరుకున్న స్తంభాలకు ఆనుకుని ఉన్న ఎండిన చెట్టును డీసీఎం వాహన ఢీకొంది. ఈ ఘటనలో చెట్టు ఒరిగి విద్యుత్ వైర్లపై పడింది. ఈ మార్గంలో పాఠశాలలకు విద్యార్థులను తీసుకు వెళ్తున్న స్కూల్ బస్సులు ఎక్కువగా నడుస్తాయని, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలి వచ్చిపోయే వారిపై పడుతాయోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పాడైన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఐక్యత వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా, ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ప్రమాదం జరిగితే కాని పట్టించుకోరా స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గాలి దుమారం వస్తే ఏ క్షణంలో విద్యుత్ స్తంభాలు కూలిపోతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి చెట్ల మధ్య వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని వారు కోరుతున్నారు.

సినీ విజ్ఞాన విశారద ఎస్వీ రామారావు: డాక్టర్ కేవీ రమణాచారి



పురస్కారగ్రహీతల్ని సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

రవీంద్రభారతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సినీగేయ రచయితగా, నటుడిగా, దర్శకుడిగా తనదైన పాత్ర పోషించిన ఎస్వీ రామారావు సినీ విజ్ఞాన విశారద అని రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి కొనియాడారు. బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సహకారంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఎస్వీ రామారావు 85వ జన్మదినం సందర్భంగా ప్రముఖ వ్యాఖ్యాతలు ఆశాలత, మురళీకృష్ణ, ఎం.దక్షిణమూర్తి, డా.వి.వి.రామారావులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి సన్మానగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఎస్వీ రామారావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ సాంస్కృతిక, సినీరంగంలో తనదైన సేవలందించిన ఎస్వీ రామారావు జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందకరమన్నారు. ఆయన పుట్టినరోజు పురస్కరించుకుని వ్యాఖ్యాతలను సత్కరించుకోవడం శుభసూచికమన్నారు. ఎన్నో వేదికలపై వ్యాఖ్యానం చేసిన పలువురికి సన్మానించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డా.బి.వి.పట్టాభిరామ్, లంక లక్ష్మీనారాయణ, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిఫా సాకర్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జితేందర్ రెడ్డి, శివసేనా రెడ్డి

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) ఫిఫా ఇంటర్ కాంటినెంటల్ సాకర్ టోర్నమెంట్ పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఛైర్మన్ కె.శివసేనారెడ్డి ఆవిష్కరించారు. వచ్చేనెల 3 నుంచి 9వ తేదీ వరకు గచ్చిబౌలి ఫుట్‌బాల్ స్టేడియంలో ఈ టోర్నీ జరగనుంది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక ఇంటర్ కాంటినెంటల్ ఫిఫా కప్‌నకు హైదరాబాద్ ఆతిథ్యమిస్తోందని వెల్లడించారు. భారత్-మారిషస్ జట్ల మధ్య ఈ మ్యాచ్‌లు జరగనున్నాయని చెప్పారు. ఈ టోర్నీ విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీసీ-ఎండీ సోనీ బాల, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఫల్గుణ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా షెడ్యూల్డ్ ట్రైబల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎక్సైజ్) నూతన కార్యవర్గం ఎంపిక

- తెలంగాణ అధ్యక్షుడిగా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్
- ప్రధాన కార్యదర్శిగా సూపరింటెండెంట్ నవీన్‌కుమార్




ఆర్. కిషన్, అధ్యక్షుడు



నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా షెడ్యూల్డ్ ట్రైబల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎక్సైజ్) కొత్త కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖలో పనిచేసే 336 మంది ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని అబ్కారీ భవన్‌లో ఎన్నుకున్నారు. అల్ ఇండియా ట్రైబల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎక్సైజ్ శాఖ తెలంగాణ అధ్యక్షుడిగా రంగారెడ్డి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్, ప్రధాన కార్యదర్శిగా మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్, ట్రెజరర్‌గా కే.శ్రీనివాస్, స్టేట్ కో-ఆర్డినేటర్‌గా డి. తిరుపతి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా డిప్యూటీ కమిషనర్ మెదక్ జె. హరికిషన్ అడ్వైజరుగా జాయింట్ కమిషనర్ (డిస్టలరీస్) సురేష్ ఎన్నికయ్యారు. వీరితోపాటు 9 మంది ఉపాధ్యక్షులు, ఏడుగురు జాయింట్ సెక్రటరీలు, ఆరుగురు ఆర్గనైజింగ్ కార్యదర్శులు, 16 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఉచితంగా శ్రీలలితా విష్ణుసహస్రనామ స్తోత్ర గ్రంథం



రాంనగర్/చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీగణపతి మహా నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ రచయిత, శ్రీశైలం దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ రచనా సంకలనం శ్రీలలితా విష్ణుసహస్రనామ స్తోత్ర వైభవ గ్రంథాన్ని జంటనగరాల్లోని సాంస్కృతిక, సాహిత్య, కళా సంస్థలకు, అర్చకులకు, వేదపండితులకు, వేద పాఠశాలలకు ఉచితంగా అందజేయనున్నట్లు శృంగేరీ జ్ఞాన సరస్వతీ ఆలయ అధికారి కళా జనార్దనమూర్తి తెలిపారు. స్తోత్రవిద్యలతో రూపుదిద్దుకున్న శ్రీలలితా విష్ణుసహస్రనామ స్తోత్ర మంగళ గ్రంథాన్ని సెప్టెంబర్ 3, 4వ తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిక్కడపల్లి త్యాగరాయ గానసభ, ముషీరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న జ్ఞానసరస్వతీ ఆలయంలో పొందవచ్చని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ ప్రత్యేక సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, కిమ్స్ ఆస్పత్రి ఛైర్మన్ బొల్లినేని కృష్ణయ్య సౌజన్యంతో అందిస్తున్న గ్రంథాన్ని గత వారం హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి సన్నిధానంలో ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఆవిష్కరించారని ఆయన తెలిపారు. తొలిసారిగా ఇంతటి మహాగ్రంథ వితరణకు పూనుకున్న తమకు ఈ పవిత్ర కార్యక్రమంలో సహకరించిన ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గాంధీలో ఆమరణ దీక్ష చేస్తున్న నాయకులకు సంఘీభావం తెలిపిన ఎంపీ ఆర్.కృష్ణయ్య

అడ్డగుట్ట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గాంధీ ఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ నాయకులను బుధవారం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ పటేల్, బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ నేతలు 4 రోజులుగా అమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని మంగళవారం వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఎక్కువగా ముఖ్యమంత్రులుగా రెడ్లు పాలించారని బీసీలకు అవకాశం రానివ్వలేదన్నారు. గ్రామ సర్పంచ్‌లకు కూడా తాము పనికిరామా అని ప్రశ్నించారు. గాంధీలో చికిత్స పొందుతున్న బీసీ నాయకుల ఆరోగ్యంపై వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. సిద్ధేశ్వర పటేల్ ఆరోగ్యం క్షీణిస్తుందని వైద్యులు వివరించారు. అతడికి ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/LEbOit1లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తర్వాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

'హైడ్రా' భూ బకాసురుల భరతం పట్టాలి

- సీపీఐ కార్యవర్గ సభ్యుడు చంద్రమోహన్

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో బిల్డర్లతో కుమ్మక్కై భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై విచారణ జరిపించాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు జి.చంద్రమోహన్‌గౌడ్ డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ విభాలలోని అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలని బుధవారం ఆయన ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు అన్యాక్రాంతం కావడానికి పెద్ద తిమింగళాలే కారణమన్నారు. చెరువులకు పట్టిన చెరను తొలగించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన 'హైడ్రా' భూ బకాసురుల భరతం పట్టాలన్నారు. ఈ క్రమంలో పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని వారు కోరారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

- సామాజిక కార్యకర్త సంజయ్ కుమార్

మంగళ్‌హాట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గోవధ నిషేధ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సామాజిక కార్యకర్త సంజయ్‌కుమార్ భూపే డిమాండ్ చేశారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం గోశాలలోని గోమాత దూడలకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగల పేరుతో కొందరు గోవులను యధేచ్ఛగా వధిస్తున్నారని, ఇలా చేసుకుంటే పోతే భవిష్యత్‌లో గోమాతను మ్యూజియంలో చూడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. గోవును రాష్ట్ర గోమాతగా ప్రకటించాలని అప్పుడే గోవులను కాపాడుకున్న వారమవుతామన్నారు. తమ గోశాలలో దాదాపు 40 గోవులు ఆరోగ్యకరంగా ఉన్నాయని వాటి రక్షణను తమ కుటుంబ సభ్యులు అప్యాయంగా చూసుకుంటున్నారని సంజయ్‌కుమార్ భూపే తెలిపారు.



రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

పిల్లర్ నంబర్ 274 వద్ద బస్టాప్ ఏర్పాటు చేయండి

రాజేంద్రనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 274 వద్ద బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని శివరాంపల్లి ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. బుధవారం పి.వెంకటేశ్ ఆధ్వర్యంలో ప్రతనిధులు రాజేంద్రనగర్ డిపో మేనేజర్ భద్రీనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



శోభాయాత్రలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ గ్రేటర్ హైదరాబాద్ యాదవ్ సంఘం నాయకులు

ముగిసిన భాగ్యనగర్ శ్రీకృష్ణాష్టమి శోభాయాత్ర

గోషామహల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ శ్రీకృష్ణాష్టమి ఉత్సవ సమితి శోభాయాత్ర ముగింపు వేడుకలు బుధవారం అత్యంత కన్నులపండువగా ముగిశాయి. శోభాయాత్రకు ఎంపీ ఎం.అనిల్‌కుమార్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం (జాంబాగ్) అధ్యక్షుడు బోయిని వెంకటేశ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. గౌలిగూడ ఉస్మాన్‌షాహీలోని జంగల్ విఠోబా దేవాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గౌలిగూడ చమాన్, ఉస్మాన్‌షాహీ, జాంబాగ్, యాదవ సంఘం భవన్‌కు చేరుకుంది.

యాదవ సంఘం రాష్ట్ర ట్రస్టు బోర్డు సభ్యుడు వి.పాండు యాదవ్, వి.కిషన్ యాదవ్, శైలేందర్ యాదవ్, సల్లా ఆనంద్ యాదవ్, శ్రీ గణేష్ యాదవ్ శోభాయాత్రపై పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో జె.సతీష్‌యాదవ్, సందీప్ యాదవ్, బి.శ్రీశైలం యాదవ్, ఎన్.దిలీప్ యాదవ్, కపిల్ యాదవ్, జె.హరీష్, రాజా యాదవ్, రవి యాదవ్, జశ్వంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మురికికూపంగా నర్సబాయి కుంట

- బాబుల్‌రెడ్డి నగర్‌లో ఇళ్ల మధ్య పారుతున్న మురుగు
- దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు
- వృద్ధి చెందుతున్న దోమలు
- అనారోగ్యాలతో చిన్న పిల్లలు, వృద్ధులు



బాబుల్‌రెడ్డినగర్‌లో ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న నవయువ యువజన సంఘం అధ్యక్షుడు ఎర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి

రాజేంద్రనగర్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): అధికారులు నిర్లక్ష్యంతో నర్సబాయి కుంట మురికికూపంగా మారింది. మైలార్‌దేవుపల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్, మార్కండేయనగర్ బస్తీలను ఆనుకుని ఉన్న నర్సబాయికుంటను పార్కుగా అభివృద్ధి చేస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు చెరువు వద్ద కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ఆ డబ్బంతా మట్టిలో పోసినట్లయింది. అయితే అది నేడు మురికి గుంటగా మారింది. స్థానికంగా ఇళ్ల నుంచి వెలువడుతున్న మురుగు నీరు మొత్తం సమీపంలోని నర్సబాయి కుంటలోకి చేరుతుంది. దాంతో మురుగు నీటిలో దోమలు వృద్ధి చెంది స్థానికులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. దుర్వాసనతో ఇళ్లల్లో కూడా ఉండలేని పరిస్థితి నెలకొందని బాబుల్‌రెడ్డి నగర్ ప్రజలు వాపోతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు విషజ్వరాల బారిన పడుతున్నారని వారు ఆందోళన చెందుతున్నారు

డ్రైనేజీ పైపులైన్‌కు మరమ్మతులు చేయాలి

ప్రగతికాలనీ, బృందావన్‌కాలనీ, బాబుల్‌రెడ్డినగర్, మార్కండేయనగర్ బస్తీల నుంచి లోతట్టు ప్రాంతంలో ఉన్న నర్సబాయి కుంట లోకి మురుగునీరు రాకుండా గతంలో డ్రైనేజీ పైపులైన్‌ను వేశారు. ఆ పైపులైన్ బాబుల్‌రెడ్డినగర్ బస్తీని ఆనుకుని ఉన్న నర్సబాయి కుంట నుంచి ఆదర్శ వడ్డెర బస్తీ మీదుగా శివరాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి కాలువల ద్వారా కింది భాగంలోకి వెళుతుంది. అయితే పై బస్తీల నుంచి వస్తున్న డ్రైనేజీ పైపులైన్ బాబుల్‌రెడ్డినగర్ బస్తీ వద్ద పగలడంతో మురుగునీరంతా బాబుల్‌రెడ్డినగర్‌లోని ఇళ్ల మధ్య పారుతూ దుర్వాసన వెలువడుతుంది. ఎగువ భాగాన ఉన్న ప్రాంతాల్లో పగిలిన డ్రైనేజీ పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని నవయువ యువజన సభ్యులు కోరుతున్నారు. . బుధవారం నవయువ యువజన సంఘం అధ్యక్షుడు ఎర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి నర్సబాయికుంట వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. మురుగు కారణంగా బాబుల్‌రెడ్డినగర్ బస్తీలో చాలామంది ప్రజలు అనారోగ్యాలతో బాధపడుతున్నారని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

పాలకులు ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కితే..

ప్రజలు సరైన రీతిలో గుణపాఠం చెబుతున్నారు

- విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించిన వామపక్ష నేతలు



నివాళులర్పిస్తున్న సీపీఐ శాసనసభ నేత కూనంనేని సాంబశివరావు

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిన పాలకులకు ప్రజలు సరైన రీతిలో గుణపాఠం చెబుతున్నారని సీపీఐ శాసనసభ నేత కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఇందుకు నిదర్శనం గత ఎన్నికల్లో ఏపీలో చంద్రబాబునాయుడు, నేడు తెలంగాణలో కేసీఆర్ అని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా పాలన చేస్తుందని, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఆనాటి పోలీసు కాల్పుల్లో మృతి చెందిన విద్యుత్ అమర వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే అందుకు వ్యతిరేకంగా వామపక్షపార్టీలు, కాంగ్రెస్ పార్టీలు నిరసన వ్యక్తం చేసినందుకు గుర్రాలతో తొక్కించి పోలీసులతో కాల్పులు జరిపించిందని ఆయన ఆరోపించారు. విద్యుత్ నిరసనకారులపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరుపగా ముగ్గురు అమరులయ్యారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఇకనైనా పాలకులు విద్యుత్ సంస్కరణలను పక్కన పెట్టి విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ బ్యాంక్ విధానాలకు అనుగుణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణలు తీసుకువస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని ఆయన ఆరోపించారు. విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలన్న ఆయన, అందుకోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఐఎంఎల్ మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకటరెడ్డి, గుమ్మడి నర్సయ్య, పీవోడబ్ల్యూ జాతీయ అధ్యక్షురాలు సంధ్య, రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నర్సింహా, సీపీఐ నగర కార్యదర్శి ఈటి నర్సింహా, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గోవర్ధన్, ఎంసీపీఐ నాయకులు అనిల్, ఇతర వామపక్ష నేతలు పాల్గొన్నారు.

నగరంలో-నేడు

మీట్ ది ప్రెస్ వేదిక: బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ సమయం: ఉ. 11.00 గంటలకు నిర్వహణ: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్	**బీసీ సమ్మిట్** వేదిక: హోటల్ సెంట్రల్‌కోర్ట్, లక్డీకపూల్ సమయం: మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహణ: జాతీయ బీసీ సంఘం
షామిదాస్ పుస్తకావిష్కరణ వేదిక: ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ సమయం: సాయంత్రం 6 గంటలకు నిర్వహణ: కో-స్కూల్	**ఎలక్ట్రిక్ ఎక్స్‌పో** వేదిక: హైటెక్స్, మాదాపూర్ సమయం: ఉదయం 10.01 గంటలకు నిర్వహణ: సెట
హోం కమింగ్ వేదిక: లమాఖాన్, బంజారాహిల్స్ సమయం: రాత్రి 7గంటలకు నిర్వహణ: లమాఖాన్	**'త్రికాల' పుస్తకావిష్కరణ** సమయం: సాయంత్రం 6 గంటలకు వేదిక: రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్

నిద్రపోయే వేళ.. రీల్స్.. షార్ట్స్!

కొవిడ్ తర్వాత చాలామంది జీవన శైలి మారింది. ఆన్‌లైన్ క్లాసుల నేపథ్యంలో యువత, చిన్నారుల చేతుల్లోకి వచ్చిన ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్లను ఇప్పటికీ వదలలేకపోతున్నారు. వీటి కారణంగా చిన్నారులు, యువత జీవ గడియారం పనితీరూ మారిపోతుంది. వేళ కాని వేళ నిద్ర పోవడం, నిద్రపోవాల్సిన సమయంలో రీల్స్, షార్ట్స్ వీక్షణంతో గడిపేయడంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.



● మారుతున్న జీవ గడియారం
● కొవిడ్ తర్వాత మారిన పరిస్థితులు
● ఎక్కువ సమయం స్మార్ట్ పరికరాలతోనే గడుపుతున్న నేటితరం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ వచ్చిన తరువాత చాలామంది జీవనశైలి మారింది. దానితో పాటుగా కొత్త అలవాట్లు కూడా పుట్టుకువచ్చాయి. ఆ అలవాట్లలో కొన్ని ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటే, మరికొన్ని ప్రమాద హేతువులుగానూ మారాయి. అలాంటి వాటిలో ఒకటి యువత, చిన్నారులలో సెల్ ఫోన్! ఆన్‌లైన్ క్లాస్‌లంటూ అప్పట్లో చాలామంది పిల్లల చేతుల్లోకి వచ్చిన ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్లు ఆ తరువాత కూడా వారి చేతిని వదలనంటున్నాయి. చిన్నారుల ఆరోగ్యం, మరీ ముఖ్యంగా నిద్రకు ముప్పును కలిగిస్తున్నాయి. అర్ధరాత్రుల వరకూ స్మార్ట్ పరికరాలకే అతుక్కుపోవడం, ఉదయమే నిద్ర లేచి క్లాస్‌లకు వెళ్లడం, సగటున ఓ పిల్లాడికి ఉండాల్సిన కనీస నిద్ర కరవవడంతో క్లాస్‌రూమ్‌లో నిద్రపోవడం, పాఠ్యాంశాలపై ఏకాగ్రత చూపలేక పోవడం, మతిమరుపు, కంటి చూపు తగ్గడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమయానికి నిద్రపోవడం లేదనే తల్లిదండ్రులు ఎంతమంది ఉంటున్నారో, అంతకంటే ఎక్కువగానే పిల్లలు నిద్ర మత్తుతోనే ఎక్కువగా ఉంటున్నారని, ఏకాగ్రత చూపడం లేదనే టీచర్లూ ఉన్నారు.

వేళ కాని వేళ..

ప్రతి ఒక్కరిలోనూ జీవ గడియారం ఉంటుంది. మనం అలారం పెట్టుకుంటే, దానికి ఓ నిమిషం అటు, ఇటుగా నిద్ర నుంచి లేస్తున్నామంటే అది సక్రమంగా పనిచేయడం వల్లనే. ఇప్పుడు ఆ గడియారపు పనితీరు సమూలంగా మారిపోతుంది. వేళ కాని వేళ నిద్ర పోవడం, నిద్రపోవాల్సిన సమయంలో రీల్స్, షార్ట్స్ వీక్షణంతో గడిపేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ విషయమై కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ ఉదయ్ మాట్లాడుతూ.. యువతలో జీవ గడియారం దెబ్బతింటుంది. ఇది రీ సెట్ కావడమంటే, నిద్రపోవడంలో కష్టం కావడం మాత్రమే కాదు, ఉదయమే లేవడం కష్టమవుతుంది. అందరూ అనుకున్నట్లు బద్దకమో లేదంటే మరేదో కాదు స్లీప్ హార్మోన్స్ మెలటోనిన్, సెరటోనిన్ సరిగా పనిచేయకపోవడం అని అన్నారు. సాధారణంగా ఓ వ్యక్తికి 7-8గంటలు నిద్ర అవసరమైతే, యువతకు 8-9 గంటలు అవసరం. సామాజిక మాధ్యమాల కాలంలో వీరు 5-6గంటలు నిద్రపోవడమే గగనంగా మారిందంటున్నారు డాక్టర్లు. వారాంతాల్లో వారు అధిక సమయం నిద్రపోతే.. మిగిలిన రోజుల్లో ఆ ప్రభావం ఉంటుందంటున్నారు.

పరిష్కారాలు

నిద్రలేమికి చికిత్స కంటే కూడా ప్రవర్తన పరమైన మార్పులే కీలకం. స్మార్ట్ ఉపకరణాల వాడకాన్ని నిద్రకు కనీసం గంట ముందు దూరంగా ఉంచడం మంచి పద్ధతి. రాత్రి పూట కాఫీ, టీలకు దూరంగా ఉండాలి. ఆటలు ఆడటం, వ్యాయామాలు చేయడం ద్వారా సరిగా నిద్రపోయేందుకు అవకాశాలున్నాయి. యోగా, ధ్యానం కాస్త సహాయపడవచ్చు.

సమస్యలెన్నో..

ఒకరోజు నిద్రపోకపోతే ఏమవుతుందిలే అని చాలామంది అనుకుంటారు. ముఖ్యంగా యువత. ఒకరోజు నిద్ర లేకపోతే అది సమస్యలకు మూల కారణం అవుతుందని చెబుతున్నారు పల్మనాలజిస్ట్ వెంకటేశ్వరరావు. సరిగా నిద్రపోకపోతే ఆరోగ్య సమస్యలు చాలానే ఉంటాయి. అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా, ఊబకాయం, పీడకలలు, నార్కోలెప్సీ లాంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయి. యువతలో నిద్రలేమి కారణంగా కోపం, అసహనం వంటి సమస్యలూ వస్తాయన్నారు. తగినంత నిద్ర లేకపోతే జ్ఞాపకశక్తిపై పెను ప్రభావమే చూపుతుందంటున్నారు డాక్టర్లు.

చాయా చిత్రాలు సామూహిక చైతన్యాన్ని ప్రేరేపిస్తాయి

● అదనపు డీజీపీ మహేష్ భగవత్



చాయా చిత్రాలను తిలకిస్తున్న అదనపు డీజీపీ మహేష్ భగవత్

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చాయా చిత్రాలు భావోద్వేగాన్ని రేకెత్తించడమే కాక సామూహిక చైతన్యాన్ని ప్రేరేపిస్తాయని రాష్ట్ర అదనపు డీజీపీ మహేష్ భగవత్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి వార్తా చాయాచిత్ర ప్రదర్శనను బుధవారం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ చిత్రాలు ఫొటో జర్నలిజం, డాక్యుమెంటరీ ఫొటోగ్రఫీలో సాక్ష్యంగా నిలుస్తాయని చెప్పారు. చిత్రాలు వాస్తవికతను ప్రతిబింబిస్తూ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుమల్ల గంగాధర్, కేఎస్ హరి, కోశాధికారి కె. అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు నక్కా శ్రీనివాస్, ఎండీ అలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ క్రమబద్ధీకరణ కో-ఆర్డినేషన్ కమిటీ నేతలు డా. ధర్మతేజ, డా. ఉపేందర్, డా. చిరంజీవిలు కోరారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బుధవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేషన్ కమిటీ స్టేట్ కో-ఆర్డినేటర్ డా.ధర్మతేజ మాట్లాడుతూ.. కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించిన తర్వాతే విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక నియామకాలు చేపట్టాలన్నారు. అప్పటి వరకు ఏడవ వేతన సవరణ ప్రకారం బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏతో యూజీసీ పే స్కేల్ ఇవ్వాలని, సర్వీస్‌ని గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.నర్సింహులు, యాదగిరి కంభంపాటి, డా. విజయ్‌కుమార్, డా. అవినాష్‌కే, డా. ఎం.కిషోర్‌కుమార్, డా. ముఖ్థం మొహియుద్దీన్, డా. పడాల లక్ష్మణ్, డా. పి. రాధాకృష్ణ పాల్గొన్నారు.

విటమిన్-డి లోపంతోనే వెన్ను, మెడ నొప్పి

ప్రముఖ స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు ప్రొఫెసర్ మేజర్ డా. భక్తియార్ చౌదరి



వెన్ను, మెడ నొప్పికి కారణాలు వివరిస్తున్న డా.భక్తియార్ చౌదరి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో లక్షలాది మంది జీవితంలో ఏదో ఒక సమయంలో వెన్ను, మెడ నొప్పితో బాధపడుతూ ఉంటారని, దీనికి 'విటమిన్-డి' లోపమే కారణమని ప్రముఖ స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు ప్రొఫెసర్ మేజర్ డాక్టర్ ఎస్. భక్తియార్ చౌదరి తెలిపారు. బేగంపేట హోటల్ గ్రీన్‌పార్కులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల పిల్లలు, గృహిణులు, సాయుధ దళాల సిబ్బంది, వివిధ వృత్తులలో ఉన్న రోగులకు నలభై ఏళ్ల చికిత్స అందించిన అనుభవంతో పదివేల మందిని అనవసర శస్త్రచికిత్సల నుంచి రక్షించానని తెలిపారు. భారతదేశంలో 20 నుంచి 50 ఏళ్ల స్త్రీలలో సుమారు 79 శాతం మంది దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతున్నారన్నారు. 59 శాతం మంది పురుషులతో పోలిస్తే నడుము నొప్పి 80 శాతం మంది స్త్రీలను ప్రభావితం చేస్తుందన్నారు. వెన్ను, మెడనొప్పి కేసుల్లో ఎక్కువ భాగం 70-80 శాతం యాంత్రిక కారణాల వల్ల ఉత్పన్నమవుతాయన్నారు. జనన లోపాలు, పార్శ్వగూని, క్యాన్సర్‌లు, నఖితులు, గాయం తదితర సమస్యలకు శస్త్రచికిత్స అవసరమన్నారు. జీవితంలో కొన్ని అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా అధిగమించవచ్చని, ఆహారం సమయానికి తీసుకోవాలన్నారు. సూర్యరశ్మి శరీరానికి తగిలేటట్టు చూసుకోవాలన్నారు. సమావేశంలో ఐఏఓహెచ్ మాజీ జాతీయ అధ్యక్షుడు, ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డా. జె.విజయారావు, ఎల్ఎల్ఎం, ఇంటీరియర్ డిజైనర్ శాంతి వాసిరెడ్డి పాల్గొన్నారు.

మెట్రో పార్కింగ్ చార్జీల వసూళ్లను ఉపసంహరించుకోవాలి

నేడు, రేపు సంతకాల సేకరణ ● 1న 'చలో నాగోల్ మెట్రో స్టేషన్'

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైల్ ప్రయాణికుల నుంచి పార్కింగ్ చార్జీలు వసూళ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటా రమేష్, ఆనగంటి వెంకటేష్, పి.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్ ఆధ్వర్యంలో యువజన సంఘాల సమావేశాన్ని హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత మెట్రో సంస్థదే అన్నారు. ప్రభుత్వ భూములను ఉచితంగా తీసుకొని, వాటిలో ఎలాంటి కనీస వసతులు కల్పించకుండా ప్రయాణికులు వాహనాలు నిలిపితే పార్కింగ్ చార్జీల పేరుతో దండుకోవడం సరికాదన్నారు. తక్షణమే నాగోల్, మియాపూర్, మిగతా అన్ని స్టేషన్లలో ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 29న నాగోల్, 30న మియాపూర్ మెట్రో పార్కింగ్‌ల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపడతామని, అనంతరం మెట్రో ఎండీకి వినతిపత్రం అందజేస్తామన్నారు. అయినా వసూళ్లపై వెనక్కి తగ్గకపోతే సెప్టెంబర్ 1న 'చలో నాగోల్ మెట్రోస్టేషన్' నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అనిల్‌కుమార్ (ఏ.ఐ.వై.ఎఫ్), ఎం.రవి కుమార్, బి.ఎస్.కృష్ణ, మనోహర్ (పి.వై.ఎల్), జావిద్, హష్మీ పాల్గొన్నారు.

దేవాలయ భూమిలో సీసీ రోడ్డు

● అడ్డుకున్న దేవాదాయశాఖ అధికారులు



దేవాలయ భూమిలో నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

నార్సింగ్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం, నెక్నాంపూర్ గ్రామంలో సర్వే నంబర్ 112లో గల దేవాలయ భూమిలో మణికొండ మునిసిపల్ అధికారులు సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎండోమెంట్ ఈవో అరుణకుమారి ఆధ్వర్యంలో అధికారులు రోడ్డు పనులను అడ్డుకున్నారు. అనుమతి లేకుండా దేవాలయ భూముల్లో రోడ్డు నిర్మాణం చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. మునిసిపల్ అధికారులపై దేవాదాయ శాఖ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

అభివృద్ధి చెందుతున్న నగరాల్లో..

ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల పాత్ర కీలకం

● రేపు హెచ్‌సీఎస్సీ ఆధ్వర్యంలో 'నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024'



మాట్లాడుతున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ప్రముఖ స్థానంలో ఉందని, భద్రత, రక్షణ విషయంలో సురక్షితమైన ప్రాంతమని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఇన్వెస్టర్స్ భావిస్తున్నారని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిటీ పోలీస్-హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ) ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024' లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల పాత్ర చాలా కీలకమన్నారు. ఆ దిశగా ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను బలోపేతం చేసి, దేశ, రాష్ట్రాల రక్షణ, భద్రతలో వారిని భాగస్వాములను చేసేందుకు హెచ్‌సీఎస్సీ నడుం బిగించిందన్నారు. అందుకు అవసరమైన సానుకూల వాతావరణాన్ని, మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వంతో, అధికారులతో చర్చించి సెక్యూరిటీ ఏజెన్సీల ప్రాముఖ్యతపై తెలియజేయడానికి ఈనెల- 30న కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిటీ పోలీస్- హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024' నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్‌కు దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వ్యాపారవేత్తలు, నిపుణులు హాజరవుతారని వెల్లడించారు.

హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సెక్యూరిటీ ఏజెన్సీల పాత్రపై, దేశ భద్రత, రక్షణలో వారి ప్రాముఖ్యతను వివరించారు.

హెచ్‌సీఎస్సీ ఫిజికల్ సెక్యూరిటీ ఫోరం జాయింట్ సెక్రటరీ కల్నల్ కె.ఎస్. రావు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 20వేల ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల ద్వారా 90 లక్షల మంది పనిచేస్తున్నారన్నారు.హైదరాబాద్‌లో సుమారు 400 ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల ద్వారా 4 లక్షల మంది సెక్యూరిటీ ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. దేశంలో ప్రైవేట్ సెక్యూరిటీ రెగ్యులేటరీ యాక్టు 2005 అందుబాటులోకి వచ్చిందని, దాన్ని దేశవ్యాప్తంగా బలోపేతం చేసి, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల భాగస్వామ్యాన్ని పెంచడమే 'నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024' ముఖ్య ఉద్దేశమని కల్నల్ వెల్లడించారు. సమ్మిట్‌లో ఫిజికల్ సెక్యూరిటీతో పాటు సైబర్ సెక్యూరిటీ, ట్రాఫిక్ ఫోరం, ఉమెన్ సేఫ్టీ, సీఎస్ఆర్ ఫోరంలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, హెచ్‌సీఎస్సీ ఈసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ట్రాఫిక్ ఫోరం సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, సీఎస్ఆర్ ఫోరం సెక్రటరీ ప్రశాంత్‌కుమార్, హెచ్‌సీఎస్సీ సలహాదారు భరణి ఆరోల్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అభ్యర్థులకు 'వర్రీ'ఫికేషన్

● జేఎన్‌టీయూలో ప్రారంభమైన ధ్రువపత్రాల పరిశీలన
● ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారు పే స్లిప్పులు తీసుకురావాలని అధికారుల ఆదేశం
● అడ్మిన్ విభాగం అధికారుల తీరుపై అభ్యర్థుల ఆగ్రహం



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మూలిగే నక్కపై తాడిపండు పడ్డ చందంగా తయారైంది జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ అభ్యర్థుల దుస్థితి. వర్సిటీలో పీహెచ్‌డీ చేద్దామని నెలల తరబడి ఎదురుచూస్తున్న అభ్యర్థులకు నిబంధనల పేరుతో అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ఎంతోకష్టపడి ప్రవేశపరీక్ష రాసి పాసయ్యాక, ధ్రువపత్రాల వెరిఫికేషన్ పేరిట, అవసరమున్నవి, లేనివి కూడా కావాలంటూ.. ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చేముందు పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ అభ్యర్థులు తాము పనిచేస్తున్న ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థల్లో జాయినింగ్ డేట్ నుంచి ఇప్పటివరకు అన్ని నెలల జీతాల స్లిప్పులు తీసుకురావాలని నిబంధనల్లో పేర్కొనడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో పదేళ్ల కిందట ఉద్యోగంలో చేరిన తమ వద్ద.. అప్పట్నుంచి పేస్లిప్పులు లేకపోతే పీహెచ్‌డీ సీటివ్వరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా నిబంధనలు పెట్టిన అధికారి వద్దనైనా అన్ని నెలల పే స్లిప్పులు ఉంటాయా అని ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న అభ్యర్థులను ఆ సంస్థల గుర్తింపు పత్రాలు, సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు కూడా తీసుకు రావాలని అడ్మిషన్ విభాగం అధికారులు కోరడం విడ్డూరంగా ఉందని అభ్యర్థులు వాపోతున్నారు. ప్రైవేటు సంస్థల్లో చిన్నచిన్న ఉద్యోగాలు చేసే తమకు ఇన్నేసి పత్రాలు కావాలని అడగడమంటే తమ ఉద్యోగాలకు ఎసరు పెట్టడమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పెట్టేముందు అభ్యర్థులకు ఉండే ఇబ్బందులను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని, పీహెచ్‌డీ ధ్రువపత్రాల పరిశీలనకు జాయినింగ్ డేట్ నుంచి పే స్లిప్పులు తీసుకురావాలన్న నిబంధనను సడలించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

80 మందే హాజరు

సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 324 మంది హాజరు కావాల్సి ఉండగా.. బుధవారం 80 మందే హాజరైనట్లు తెలిసింది. మొత్తం 222 పీహెచ్‌డీ సీట్ల ప్రవేశాలకు ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ ఇచ్చిన జేఎన్‌టీయూ అధికారులు ఆర్నెల్ల తర్వాత ప్రవేశపరీక్ష నిర్వహించారు. రెండు నెలలుగా ఇంటర్వ్యూల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియతో మరింత జాప్యం తప్పడం లేదు. వర్సిటీ అధికారుల తీరుతో విసుగుచెందిన అభ్యర్థులు కొందరు ప్రైవేటు యూనివర్సిటీల బాట పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి సత్వరం పీహెచ్‌డీ ఇంటర్వ్యూల షెడ్యూలు ప్రకటించాలని, ప్రవేశాలను వీలైనంత త్వరగా పూర్తిచేసి తదుపరి నోటిఫికేషన్ ఇవ్వాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్

చెక్కుల పంపిణీలో అవినీతి

● చెక్కుకు రూ.10వేల చొప్పున రెవెన్యూ సిబ్బంది వసూలు
● జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



హైకోర్టు కాపీని చూపిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఖైరతాబాద్ మండలం రెవెన్యూ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోపించారు. లబ్ధిదారుల వద్ద చెక్కుకు రూ.10 వేల చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. నవోదయకాలనీలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖలో అవినీతి లీలలు వెలుగులోకి వస్తాయనే ఉద్దేశంతో అధికారులు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. రెండు డివిజన్‌లకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మాత్రమే పంపిణీ చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, అధికారులు దీన్ని విస్మరిస్తున్నారన్నారు.

తాజాగా లబ్ధిదారులకు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌తో రహ్మత్‌నగర్‌లో పంపిణీ చేయాలని నిర్ణయించామని చెప్పారు. కానీ అధికారులు ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తప్పుదోవ పట్టించేలా తప్పుడు సమాచారం ఇచ్చి ఖైరతాబాద్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేశారని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది అవినీతి బాగోతాలపై త్వరలో ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

● అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను చాలావరకు నివారించవచ్చని అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుకోని విధంగా ప్రమాదం జరిగితే ఎలా నివారించాలనే దానిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫైర్ సేఫ్టీ డ్రిల్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా 884 డ్రిల్స్ నిర్వహించి వేలాది మంది విద్యార్థులు, ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించినట్లు నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు

ఉచిత వైద్య శిబిరం

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జడ్ చొంగ్తు బుధవారం శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుమేహం, రక్తపోటు, గుండె వ్యాధులకు సంబంధించి విజయ డయాగ్నస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. మరో కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగుల కోసం మంచినీటి సరఫరాకు నూతనంగా వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు.

బై బ్యాక్ స్కీమ్‌తో బురిడీ

రూ. 1.2 కోట్లకు పైగా కాజేసిన దంపతులు ● నిందితులకు రిమాండ్

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా తాము నిర్మించబోయే విల్లాస్, గేటెడ్ కమ్యూనిటీ వ్యాపారంలో పెట్టుబడి పెట్టండి.. 13 నెలల్లోనే అధిక ఆదాయం పొందండి అంటూ బురిడీ కొట్టించిన దంపతులు రూ. 1,02,89,000 వసూల్ చేసి పారిపోయారు. ఈవోడబ్ల్యూ (ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్) డీసీపీ కె. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..

గోపన్‌పల్లికి చెందిన జుల్లపల్లి చంద్రశేఖర్, సునీత దంపతులు అమాకాన్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థను ప్రారంభించారు. చేవెళ్లలో విల్లాస్, గేటెడ్ కమ్యూనిటీలు నిర్మిస్తున్నామని, మా వ్యాపారంలో పెట్టుబడులు పెడితే 13 నెలల్లో 55 శాతం లాభాలతో బై బ్యాక్ స్కీమ్‌తో అసలుతో కలిపి చెల్లిస్తామని నమ్మించారు. తెలిసినవారు, స్నేహితుల నుంచి పెట్టుబడులు సేకరించారు. కూకట్‌పల్లికి చెందిన చక్కా సుధీర్ రూ. 60 లక్షలు, ప్రణయ్ రూ. 17,89,000, వైదేహి రూ. 25 లక్షలు పెట్టుబడి పెట్టారు. అందుకు చేవెళ్లలో ఉన్న ల్యాండ్‌ను షూరిటీగా పెట్టారు. తమకు చేవెళ్లలో ఉన్న 33 గుంటల భూమి సరిపోవడంలేదని, పక్కనే కొంత భూమిని కొనుగోలు చేసి భారీ స్థాయిలో వెంచర్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామంటూ నమ్మించారు. వెంచర్ ప్రారంభించకపోవడం, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఈవోడబ్ల్యూ పోలీసులు దంపతులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

డ్రగ్స్, మనీల్యాండరింగ్ పేరుతో మోసం

వృద్ధుడిని బెదిరించి రూ. 1.53 లక్షల కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మనీల్యాండరింగ్ పేరుతో వృద్ధుడిని బెదిరించి రూ. 1.53 లక్షలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. నగరానికి చెందిన 84 ఏళ్ల వృద్ధుడికి ఇటీవల గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. మీ ఫోన్ డిస్‌కనెక్ట్ చేస్తున్నాం.. ఇతర వివరాలకు 9 నొక్కండి అని చెప్పారు. ఏంటో తెలుసుకుందామని 9వ నంబర్ నొక్కాడు. అలంబాగ్ పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నాం అంటూ.. ఓ వ్యక్తి మాట్లాడాడు. మీ ఆధార్ కార్డు అడ్రస్‌తో డ్రగ్స్ పార్శిల్ దొరికిందని, మీ ఖాతా నుంచి అక్రమ లావాదేవీలు జరిగాయని, మీపై మనీల్యాండరింగ్ కింద క్రిమినల్ కేసు నమోదైందని చెప్పాడు. కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నామని బెదిరించాడు. మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును ఆర్‌బీఐ అధీనంలో ఉన్న ఖాతాకు పంపండి. మీ ఖాతాను పరిశీలించి అక్రమాలు లేవని తేలితే డబ్బు తిరిగి జమ చేస్తారని, తప్పించుకోవాలని చూస్తే అరెస్ట్ చేస్తారని భయపెట్టాడు. అలా వృద్ధుడి ఖాతాలో ఉన్న రూ. 1.53 లక్షలు కాజేశారు. తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు చిన్నారి



చిన్నారి రూపను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న చర్లపల్లి పోలీసులు

కుషాయిగూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దారి తప్పి రోడ్డుపై ఏడుస్తున్న చిన్నారిని పోలీసులు చేరదీసి ఆకలి తీర్చారు. చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ వై. రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో ఆస్టిన్ ఫార్మా, పోస్టాఫీసు మధ్య దారిలో మూడేళ్ల వయస్సుగల బాలిక ఏడుస్తూ ఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకొని బాలికను స్టేషన్‌కు తీసుకెళ్లారు. సరిగా మాటలు రాకపోవడంతో చిన్నారి ఏమీ చెప్పలేకపోయింది. దీంతో బాలిక ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. దాదాపు మూడు గంటల అనంతరం బాలిక తల్లిదండ్రులు శోభాలక్ష్మి, నారాయణ పాశ్వాన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. బిహార్ నుంచి వచ్చిన వారు మింట్ కాలనీ సమీపంలో నివసిస్తూ ఓ పరిశ్రమలో కూలీలుగా పనిచేస్తున్నారు. పక్క ఇళ్లలో ఉన్న పిల్లలతో ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చిన వారి కుమార్తె రూప(3) దారి తప్పిపోయి ఏడుస్తుండడంతో పోలీసులు చేరదీశారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రౌడీషీట్ తెరుస్తామని పోలీసులు వేధిస్తున్నారు

● మహిళ ఆరోపణ

బోరబండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తనకు సంబంధం లేని కేసులను అంటగడుతూ రౌడీషీట్ తెరుస్తామని బోరబండ పోలీసులు వేధిస్తున్నారని బంజారానగర్‌కు చెందిన సరళ ఆరోపించింది. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బెల్ట్‌షాపు నిర్వహణను మానేసి ఎనిమిది నెలలు అయిందని, పాత కేసులను తిరగదోడుతూ రౌడీషీట్ ఓపెన్ చేస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతరులు నిర్వహించే బెల్ట్ షాపుతో తనకు సంబంధం లేదన్నారు. బెల్ట్ షాపుల తనిఖీల పేరుతో ఈ నెల 15, 16 తేదీలలో ఇంటికి వచ్చిన పోలీసులు కుటుంబ సభ్యులను, అద్దెకు ఉన్న అడ్వకేట్‌ను వేధించి దాడి చేశారన్నారు. దాడి జరిగిన రోజున అడ్వకేట్ బార్ అసోసియేషన్‌లో ఫిర్యాదు చేసి, హైకోర్టులో కేసు వేశారని తెలిపింది. ఈ సంఘటనలతో తనకు సంబంధం లేదని, కేసును రాజీ చేయించాలని నాపై ఒత్తిడి చేస్తున్నారని ఆమె తెలిపారు. పోలీసుల వేధింపులు తాళలేక బుధవారం ఇంట్లో ఆత్మహత్యకు యత్నిస్తే కుమారుడు రక్షించాడని ఆమె చెప్పింది.

ఆరోపణలు అవాస్తవం

సరళ ఆరోపణలు అవాస్తవమని సీఐ ఎస్‌వీ శేఖర్ తెలిపారు. ఆమెపై ఇప్పటికే 9 కేసులున్నాయని, అయినా మద్యం అమ్మడం మానలేదన్నారు. విచారణకు వెళ్లిన పోలీసులకు సహకరించకుండా బ్లాక్‌మెయిల్ చేసిందన్నారు. బెల్ట్‌షాపులపై దాడుల్లో భాగంగానే ఆమె ఇంటికి వెళ్లామన్నారు.

ఖేలో ఇండియా పరిశీలకుడిగా మ్యాక్స్‌వెల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా మహిళల సైక్లింగ్ లీగ్ పరిశీలకుడిగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైక్లింగ్ కోచ్ మ్యాక్స్‌వెల్ ట్రీవర్ నియమితుడయ్యాడు. ఈనెల 31 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు చెన్నైలో జరగనున్న సైక్లింగ్ లీగ్‌లో ప్రతిభావంతులైన సైక్లిస్టులను గుర్తించి ఆ వివరాలను ఖేలో ఇండియా విభాగానికి మ్యాక్స్‌వెల్ అందించనున్నాడు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 29 ఆగస్టు 2024

మీ పిల్లలు బాగా చదువుకోవాలా?

సాధారణంగా తల్లితండ్రుల దృష్టంతా పిల్లల చదువుపైనే ఉంటుంది. పిల్లలు బాగా చదువుకోవాలంటే వారికి తగిన వాతావరణం కల్పించాలంటున్నారు మానసిక నిపుణులు. పిల్లలకు తల్లితండ్రులు ఇవ్వాల్సిన సలహాలేమిటో చూద్దాం..

సరిహద్దులు నిర్మించండి..

చాలా మంది పిల్లలకు చదువుకొనే సమయంలో ఏకాగ్రత కోల్పోతూ ఉంటారు. ఫోన్ చూసుకోవటం.. టీవీ చూడటం.. గేమ్స్ ఆడుకోవటం వంటి పనులు చేస్తూ ఉంటారు. అందువల్ల పిల్లలకు- చదువుకోవటానికి.. ఖాళీ సమయంలో ఇతర పనులు చేయటానికి మధ్య ఉన్న తేడాను వివరించాలి. ప్రతి రోజూ ఈ రెండు పనులను వేర్వేరుగా సమయాన్ని కేటాయించుకొమ్మని సలహా ఇవ్వాలి. అప్పుడు వారికి స్పష్టత రావటంతో పాటుగా సమయ పాలన కూడా అలవాటు అవుతుంది.

అలవాటైన ప్రదేశం..

ఇంట్లో పిల్లలు చదువుకోవటానికి ఒక ప్రదేశాన్ని నిర్దేశించండి. వారిని ప్రతి రోజూ ఆ ప్రదేశంలోనే కూర్చుని చదవమని సలహా ఇవ్వండి. ఒక సారి వారికి ఆ ప్రదేశంలో కూర్చుని చదవటం అలవాటు అయితే ఏకాగ్రతతో చదవగలుగుతారు.



ప్రాధమ్యాలు..

చాలా మంది పిల్లలకు కొన్ని పాఠాలు ఆసక్తికరంగా ఉంటాయి. కొన్నింటిపై దృష్టి పెట్టరు. అందువల్ల ఏఏ పాఠాలు ముఖ్యమైనవో ముందే గుర్తించి వాటిని చదవమని సలహా ఇవ్వండి. దీని వల్ల వారికి పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చే అవకాశముంటుంది.

టెక్నిక్స్ ఫలిస్తాయి..

చాలా మంది ఎక్కువ సేపు కూర్చుని చదివితే ఏకాగ్రతతో చదివినట్లు అనుకుంటారు. కానీ ఏకాగ్రతతో చదవటమంటే పూర్తి దృష్టిని కేంద్రీకరించటం. సాధారణంగా పిల్లలు 25 నిమిషాలకు మించి ఏకాగ్రతతో చదవలేరు. ఆ తర్వాత ఒక ఐదు నిమిషాలు బ్రేక్ తీసుకొని మళ్లీ చదివితే పాఠాలు త్వరగా అర్థమవుతాయి. ఇలాంటి టెక్నిక్స్‌ను పాటించటం వల్ల ఎక్కువ ఫలితాలుంటాయి.

ధ్యానం.. యోగా

రోజుకు కనీసం ఒక అరగంట యోగా.. ధ్యానం చేయమని ప్రోత్సహించండి. దీని వల్ల పిల్లలు చురుకుగా తయారవుతారు. ఏకాగ్రత కూడా పెరుగుతుంది.

వాస్తవిక లక్ష్యాలు..

చాలా సందర్భాలలో తల్లితండ్రులు తమ పిల్లలకు పెద్ద పెద్ద లక్ష్యాలు పెడతారు. వీటిని చేరుకోలేక పిల్లలు మానసికంగా చాలా ఇబ్బందులకు గురవుతారు. పిల్లల సామర్థ్యాన్ని.. వారి ఆసక్తులను గమనించి లక్ష్యాలను నిర్దేశిస్తే మంచి ఫలితాలు లభిస్తాయి.

ప్రేమతో..

ప్రతి రోజు పిల్లలతో కనీసం ఒక గంట సేపు గడపండి. వారితో ప్రేమగా మాట్లాడండి.. వారికి ఏం కావాలో తెలుసుకోండి. అప్పుడు వారు చదువుపై మరింత దృష్టి కేంద్రీకరించగలుగుతారు. •

జీర్ణక్రియ సాఫీగా...

దానిమ్మ పండులో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలం. రుచితో పాటు ఆరోగ్యం కూడా. అందుకే ప్రతిరోజూ దానిమ్మ గింజలను తినాలంటున్నారు పరిశోధకులు. ఇంతకీ దానిమ్మ ఉపయోగాలేంటీ..

- దానిమ్మను సూపర్‌ఫుడ్ అంటారు. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల వాపులు తగ్గుతాయి. కీళ్ల వాతం తగ్గిపోతుంది.
- దానిమ్మ గింజలను లేదా జ్యూస్‌ను తరచు తీసుకుంటే రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.
- ఇవి తినటం వల్ల నోటిలో ఉండే బ్యాక్టీరియా పోతుంది.
- పీచుపదార్థం కాబట్టి గుప్పెడు గింజలు తిన్నా.. తిన్న ఫీలింగ్ కలుగుతుంది. ముఖ్యంగా జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. అందుకే బరువు తగ్గాలనుకునేవారు మెనూలో దానిమ్మ గింజలను చేర్చాల్సిందే.
- ఇది మంచి ఇమ్యూనిటీ బూస్టర్. దీనివల్ల జలుబు, దగ్గు, జ్వరం లాంటివి దరిచేరే అవకాశాలు తక్కువ.
- దానిమ్మ గింజలను తరచూ తింటుంటే చర్మంలో మృదుత్వం వస్తుంది. దీంతో యంగ్‌గా కనిపిస్తారు.
- ఈ పండును తినటం వల్ల ఒత్తిడి తగ్గిపోతుంది. •



'మిస్ ఇండియా అందాల పోటీల్లో శారీరక సౌందర్యం ఒక్కటే అర్హత కాదు, అంతఃసౌందర్యం కూడా చాలా ముఖ్యం' అంటారు ఫెమినా 'మిస్ తెలంగాణ- 2024' టైటిల్ విజేత ప్రకృతి కంబం. 'మిస్ ఇండియా' పోటీలకు ఎంపికైన ఈ అమ్మాయి లలిత కళలు, క్రీడల్లో మాత్రమే కాదు... నిజ జీవితంలోనూ ఒక ధీర. అందం, ఆత్మవిశ్వాసంతో పాటు దక్షిణాది సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని చాటడానికి 'మిస్ ఇండియా' పోటీలను ఒక వేదికగా మలుచుకొంటానని చెబుతున్న ప్రకృతితో 'నవ్య' మాట కలిపింది.



అంతఃసౌందర్యం ముఖ్యం

"మిస్ ఇండియా' పోటీలకు ఎంపికవడం చాలా సంతోషంగా ఉంది. ఇది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. నన్ను నేను మరింతగా మెరుగు పరుచుకొంటూ, కొత్త విషయాలు నేర్చుకొంటూ ముందుకు వెళ్లడానికి అవసరమైన స్థైర్యాన్ని ఈ పోటీలు నాకు కల్పించాయి. అందాల పోటీలో శారీరక సౌందర్యం ఒక్కటే ప్రామాణికం కాదు. అంతకు మించి క్రమశిక్షణ, మేధస్సు, సామాజిక స్పృహ, సాంస్కృతిక అస్తిత్వం, వ్యక్తిత్వం తాలూకూ ప్రభావాలు మరెన్నో ముడిపడి ఉంటాయి. శరీర దారుఢ్యం కూడా చాలా కీలకం. తెల్లవారుజామున 4.30కి నా రోజు మొదలవుతుంది. యోగాతో పాటు జిమ్‌లో వర్కవుట్స్ లాంటివి చేస్తుంటాను. 'మిస్ ఇండియా' పోటీల్లో స్పీచ్, వాక్ వంటి రకరకాల విభాగాల్లో మెప్పించాలి. ఆ క్రమంలో నడకను, ఉచ్చారణను, ఆలోచనలను, ఆహార్యాన్ని.. ఇలా ప్రతి ఒక్క అంశాన్నీ న్యాయనిర్ణేతలు సూక్ష్మంగా పరిశీలిస్తారు. కనుక అందాల పోటీలో రాణించడానికి అంతఃసౌందర్యంతో పాటు బహుముఖ ప్రజ్ఞ కూడా చాలా అవసరం. ఈ పోటీలో పాల్గొనడం అంటే మరొకరితో పోటీ పడటం కాదు... నాతో నేను తలపడుతున్నట్టు.

అలా చూడటం సరికాదు...

లైంగిక దాడి లేదా వేధింపులకు లోనైనవారిని బాధితులుగా చూడటం సరికాదు. అసలు వారిని అలా సంబోధించకూడదు కూడా. ఒక అమ్మాయి తనకెదురైన హింసను బయటకు వెల్లడించడానికి అనువైన వాతావరణం ఇంట, బయట తప్పనిసరిగా కల్పించాలి. తనకు ఒక భరోసా ఇవ్వగలగాలి. అంతేకానీ.. కుటుంబ పరువు, ప్రతిష్ఠ పేరుతో నోరు మూయించడం లాంటివి చేస్తే మాత్రం సమాజంలో మరింత మంది నేరగాళ్ల తయారవడానికి మనమే పరోక్షంగా కారణం అవుతాం. 'హింసను ఎదుర్కొన్నవారు సైతం మీ అంతరాత్మకు మినహా మరెవ్వరి సందేహాలనూ తీర్చనక్కర్లేదు. ఎవరో ఏదో అనుకొంటారని వెనకడుగు వేయద్దు. నిర్భయంగా బయటకు వచ్చి అన్యాయంపై పెదవి విప్పండి. నిశ్శబ్దాన్ని ఛేదించండి. ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లండి' అని ప్రతి ఒక్కరికీ ఓ సోదరిగా చెబుతాను.

అథ్లెటిక్స్‌లోనూ...

జీవితంలో ఎలాంటి కష్టం లేకుండా విజయం వరించడం సాధ్యం కాదు కదా. మనం ఎంచుకున్న ఈ రంగంలోనూ కొన్ని కష్టాలుంటాయి. ముఖ్యంగా మనకు ఇష్టమైన ఆహారాన్ని చాలా సందర్భాలలో తీసుకోలేకపోవచ్చు. నేనైతే, రోజులో ఎక్కువగా నీళ్లు తాగుతుంటాను. చర్మాన్ని కాంతిమంతంగా ఉంచడంలో అంతకు మించిన చిట్కా మరొకటి లేదని నమ్ముతాను. డైట్ విషయంలో చాలా కచ్చితంగా ఉంటాను. చిన్నప్పటి నుంచి క్రీడలన్నా, నృత్యం, సంగీతమన్నా విపరీతమైన ఇష్టం. నేను అథ్లెట్‌ను కూడా. స్కూల్, కాలేజీ రోజుల్లో త్రోబాల్ టీమ్ కెప్టెన్‌గా వ్యవహరించాను. అందాల పోటీల వైపు ఆసక్తి కలగకపోతే, క్రీడా రంగం వైపు వెళ్లేదాన్నేమో! భరతనాట్యంతో పాటు హిప్‌హాప్ లాంటి పాశ్చాత్య నృత్యరీతులనూ నేర్చుకొన్నాను. అవన్నీ నాకు ఈ పోటీల్లో పనికొస్తున్నాయి. కల్చరల్ ఐడెంటిటీ ఇక్కడ చాలా కీలకం. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సంస్కృతుల మేళవింపును నేను 'మిస్ ఇండియా' పోటీ వేదికపై పరిచయం చేయాలని అనుకొంటున్నాను. అదే నా అస్తిత్వం కూడా.

అమ్మానాన్న ప్రోత్సాహం...

ఇదివరకు 'మిస్ గ్రాండ్ కర్ణాటక', 'టైమ్స్ ఫ్రెష్ ఫేస్ బెంగళూరు' టైటిల్స్ గెలుచుకున్నాను. నిజానికి అందాల పోటీలో పాల్గొనాలన్న ఆలోచనకు స్ఫూర్తి మా అక్క ప్రేరణ. తను నాకన్నా నాలుగేళ్లు పెద్ద. నిబంధనల ప్రకారం ఉండాల్సినంత ఎత్తు లేకపోవడంతో 'మిస్ ఇండియా' పోటీ ఫైనల్స్ వరకు వెళ్లి వెనక్కి వచ్చింది. దాంతో నన్ను అటువైపు వెళ్లమని అక్క ప్రేరేపించింది. చదువుతో పాటు ఆట, పాటలన్నిటిలో అమ్మానాన్న మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారు. చదువు పూర్తయ్యాక ఎటువైపు వెళ్లినా తమకు అభ్యంతరం లేదన్నారు. అందాల పోటీ అనగానే 'ఆ రంగంలోని లోటుపాట్లు, కష్టసుఖాలన్నిటినీ ముందు అర్థం చేసుకోండి. తర్వాత మీ వంతు కృషితో ముందుకు సాగండి'అని సూచించారు.

అందుకు గర్విస్తున్నా...

నేను పుట్టి, పెరిగిందంతా బెంగళూరులో. అక్కడే బీకామ్ పూర్తి చేశాను. మాది తెలంగాణ. మా తాతయ్య ప్రొఫెసర్ కేవీ బాలముకుంద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పని చేశారు. మా నానమ్మ నీల తొలి నాళ్లలో ఆకాశవాణిలో గాయని. ఒకప్పుడు కుటుంబమంతా చిక్కడపల్లిలో ఉండేవాళ్లు. మా నాన్న పురుషోత్తం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడంతో ఉద్యోగరీత్యా బెంగళూరులో స్థిరపడ్డారు. మా అమ్మ రూప తమిళియన్. అలా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో నాకు మంచి ప్రవేశమే ఉంది. కర్ణాటకలో ఉన్నా, తెలుగు భాషా, సంస్కృతులకు దగ్గరగానే పెరిగాను. మా నాయనమ్మ ప్రభావంతో ఇక్కడి పండుగలు, ఆచార వ్యవహారాలన్నీ చిన్నప్పటి నుంచి నా జీవితంలో భాగం అయ్యాయి. నాన్న ద్వారా ఈ నేల గొప్పతనం గురించి ఎన్నోసార్లు విన్నాను. అలాంటిది ఇప్పుడు తెలంగాణ అమ్మాయిగా 'మిస్ ఇండియా' పోటీలకు వెళ్లడం నాకు చాలా గర్వంగా ఉంది.

సినిమాల్లో రాణించాలి...

తెలుగు సినిమాల్లో నటిగా రాణించాలన్నది నా అంతిమ లక్ష్యం. ఇప్పటికే మా అక్క ప్రేరణ తెలుగు సీరియల్ 'కృష్ణాముకుంద మురారీ'లో లీడ్ రోల్ చేస్తోంది. నేనూ ఒక సినిమాలో నటించాను. ఇప్పటికే సినిమాల వైపు కూడా దృష్టిపెడుతూ, కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నాను. అల్లు అర్జున్‌తో నటించాలన్నది నా కోరిక. ప్రస్తుతం 'మిస్ ఇండియా' పోటీలకు సన్నద్ధమవుతున్నాను. ప్రతి అమ్మాయికీ తన కెరీర్‌ను ఎంపిక చేసుకోవడంలో స్వేచ్ఛ ఉండాలి. వారి కలలకు తల్లిదండ్రులు మద్దతుగా నిలవాలి. అందాల పోటీలో పాల్గొని టైటిల్స్ గెలవడమే నా ఆశయం కాదు, నా వంతుగా సమాజానికి సహాయపడాలి. ముఖ్యంగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల ముఖంలో సంతోషాన్ని చూడటానికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించాలన్నది నా కోరిక."

• కేవీ
ఫొటోలు:రాజ్‌కుమార్



వేధింపులకు వ్యతిరేకంగా...

కోల్‌కతాలో డాక్టర్ మీద అఘాయిత్యం, మహారాష్ట్ర బద్లాపూర్‌లోని చిన్నారులపై అమానుషం... ఇలాంటి వార్తలు వింటున్నప్పుడు మనసంతా ఆందోళనగా ఉంటుంది. అలా అని బాధపడుతూనో, భయపడుతూనో కూర్చోకూడదు కదా! మనం బతికేది ఇలాంటి సమాజంలోనా? అని ప్రశ్నిస్తూ దోషులను, సమాజాన్ని నిలదీయాలి. ప్రతి ఆడపిల్ల జీవితంలో వేధింపులు భాగమేమో. నాకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని తప్పనిసరిగా ఇక్కడ ప్రస్తావించాలి. స్కూల్లో చదువుతున్నప్పుడు చాలామందిలానే నేనూ శారీరక, మానసిక, లైంగిక వేధింపులు ఎదుర్కొన్నాను. అది నన్ను బాగా కుంగదీసింది. ఆ బాధను బహిర్గతం చేయాలా వద్దా అని చాలా రోజులు నాలో నేను మథనపడ్డాను. ఇలా ఎన్నాళ్లని కుమిలిపోవాలి? నేను చెయ్యని తప్పునకు నేనెందుకు ఆత్మన్యూనతకు లోనవ్వాలి? ఒక రోజు జరిగిన విషయాన్ని అమ్మానాన్న దృష్టికి తీసుకెళ్లాను. ఆ సమయంలో వారు నాకు అందించిన ధైర్యం, నా పట్ల ప్రవర్తించిన తీరు నన్ను ఒక ధీరగా నిలబెట్టాయి. నా జీవితంలో గర్వపడే క్షణాలు అంటే, నా చేదు అనుభవాన్ని బహిర్గతం చేయడమే. అమానుషత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తడమే.

కౌన్సెలింగ్

క్యాల్షియం ఇలా...

Q A

డాక్టర్! నా వయసు 55 సంవత్సరాలు. మెనోపాజ్‌లో భాగంగా క్యాల్షియం సప్లిమెంట్లు తీసుకుంటున్నప్పటికీ, నా ఎముకలు గుల్లబారుతున్నాయి. ఇందుకు కారణమేంటో తెలియడం లేదు. శరీరం క్యాల్షియంను శోషించుకోవడం కోసం నేనేం చేయాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

మెనోపాజ్‌కు చేరుకున్న మహిళలకు వైద్యులు క్యాల్షియం సప్లిమెంట్లను సూచించడం సహజం. అయితే శరీరం క్యాల్షియంను పూర్తిగా శోషించుకోవడం కోసం, అందుకు తోడ్పడే పోషకాలను కూడా సరిపడా తీసుకుంటూ ఉండాలి. అవేంటంటే...

- ఆహారంతో కలిపి తీసుకున్నప్పుడు క్యాల్షియం కార్బొనేట్‌ను శరీరం చక్కగా శోషించుకుంటుంది. కాబట్టి ఈ సప్లిమెంటును భోజనం తర్వాత తీసుకోవాలి.
- క్యాల్షియం సప్లిమెంట్లను విటమిన్ డితో కలిపి తీసుకోవాలి. శరీరం క్యాల్షియంను శోషించుకోవడంలో విటమిన్ డి ఎంతో బాగా సహాయపడుతుంది.
- ఒకసారికి 500 మి.గ్రాములకు వింంచి క్యాల్షియం తీసుకోకూడదు. ఎక్కువ తీసుకోవడం వల్ల శోషణ సామర్థ్యం కుంటుపడుతుంది.
- ఫోర్టిఫైడ్ పదార్థాలు తింటూ ఉండాలి. క్యాల్షియం కలిగిన సిరీల్స్, నారింజ రసం, సోయా విల్క్ తీసుకోవాలి.
- పాలకూర, కేల్, బ్రొకొలిలలో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. వీటిని ఆలివ్ లేదా కొబ్బరి నూనెలతో కలిపి తినడం వల్ల శోషణ పెరుగుతుంది.
- **టోఫు:** క్యాల్షియం సల్ఫేట్‌తో తయారుచేసిన టోఫుతో శాకాహారులు సరిపడా క్యాల్షియం సమకూర్చుకోవచ్చు.
- **నువ్వులు:** నువ్వులను నానబెట్టి, నూనె లేకుండా వేయించి, మొలకెత్తించి తినడం వల్ల వాటిలోని క్యాల్షియం శోషణ పెరుగుతుంది.
- కాఫీ, సోడా, ఉప్పు ఎక్కువగా ఉండే పదార్థాలు క్యాల్షియం శోషణకు అవరోధంగా మారతాయి. కాబట్టి వాటిని తీసుకోవడం మానేయాలి.
- బీన్స్‌లో ఫేటేట్స్ ఉంటాయి. ఇవి కాల్షియం శోషణను అడ్డుకుంటాయి. కాబట్టి బీన్స్‌ను కొన్ని గంటలపాటు నానబెట్టి, కడిగి, ఉడకబెట్టుకుని వండుకోవాలి.
- ఐరన్‌లో కోసం ఆకుకూరలు, గుడ్లు, మాంసం, లివర్ తరచూ తింటూ ఉండాలి.
- శాకాహారులు మష్రూమ్స్ అవకాడొ, దానిమ్మ, బీట్‌రూట్ తినొచ్చు.
- ప్రతి రోజూ పాలు, పెరుగు తింటూ ఉండాలి.





శనగపిండితో అందం

రుచికరమైన వంటలు వండుకోవటానికి ఉపయోగపడే శనగపిండిలో సహజమైన పోషకాలుంటాయి. ముఖ్యంగా చర్మం అందం పెంచటానికి ఇది ఉపయోగపడుతుంది. శనగపిండితో సులువుగా ఫేస్‌ప్యాక్ ఎలా చేయాలో తెల్సుకుందాం.

- బౌల్‌లో టేబుల్ స్పూన్ శనగపిండి, టేబుల్ స్పూన్ అలోవెరా జెల్ వేసి మెత్తగా చూర్ణం చేయాలి. ఈ మిశ్రమనిణ్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రపరచాలి. అలోవెరాలోని యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల నల్లటి మచ్చలు పోతాయి. శనగపిండితో చర్మం మృదువుగా తయారవుతుంది.
- రెండు టేబుల్ స్పూన్ల శనగపిండి, చిటికెడు పసుపు వేసి కలపాలి. సరిపడ రోజ్‌వాటర్ కలిపి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిముషాల తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద నొప్పులు పోతాయి.
- ఒక టమోటాను పేస్ట్‌లా చేసుకోవాలి. బౌల్‌లో టేబుల్ స్పూన్ శనగపిండి వేసి అందులోకి టమోటా పేస్ట్ వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి ముఖానికి పట్టించాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మం మీద వలయాలతో పాటు ముఖంలోని జిడ్డు తొలగిపోతుంది.
- రెండు చిన్న అరటిపండ్లను చూర్ణం చేయాలి. ఈ గుజ్జులోకి రెండు టేబుల్ స్పూన్ల శనగపిండి వేసి మెత్తగా కలపాలి. ఈ చూర్ణాన్ని ముఖానికి పట్టిస్తే అందంగా కనపడుతుంది.
- బౌల్‌లో ఒకటిన్నర టేబుల్ స్పూన్ వేసి ఇందులో అర టీస్పూన్ నిమ్మరసం కలపాలి. కొద్దిగా పసుపు, టేబుల్ స్పూన్ పెరుగు వేసి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత మంచి నీళ్లతో కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మం ఫ్రెష్‌గా అనిపిస్తుంది. ముఖం శుభ్రం అవుతుంది.
- రెండు వందల గ్రాముల బొప్పాయి ముక్కల్ని చూర్ణం చేయాలి. బౌల్‌లో ఈ బొప్పాయి చూర్ణం వేసి, టేబుల్ స్పూన్ శనగపిండి వేసి కలపాలి. ఇందులోకి కొద్దిగా రోజ్ వాటర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రం చేయాలి. •

డిబేట్

తల్లిదండ్రులు స్నేహితులు కాగలరా!

నటి, ఎంపీ జయాబచ్చన్, ఆమె కూతురు శ్వేతా నందా మధ్య ఓ ఆసక్తికరమైన చర్చ సాగింది. 'పిల్లలకు తల్లితండ్రులు స్నేహితులు కాగలరా'..? ఈ అంశంపై ఇద్దరూ పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీనికి వేదిక... జయ మనవరాలు, శ్వేత తనయ నవ్య నవేలీ నందా నిర్వహిస్తున్న ఓ పాడ్‌కాస్ట్.

తల్లిదండ్రులు పిల్లలతో స్నేహితుల్లా మెలగగలరా..? ఇది ఎప్పటికీ ఎడతెగని చర్చ. ఈ చర్చను మరింత లోతుకు తీసుకువెళ్లింది జయ, శ్వేతల సంభాషణ. నవ్య హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'వాట్ ది హెల్ నవ్య' పాడ్‌కాస్ట్‌లో తరచూ బచన్ కుటుంబానికి సంబంధించిన కథలు వినిపిస్తుంటాయి.

ఇందులో శ్వేత మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహితులుగా ఉండలేరని అన్నారు. స్నేహితులతో ఏ విషయమైనా పంచుకోవచ్చని, అదే పిల్లలతో అయితే అలా కుదరదనేది ఆమె వాదన.

"ఈ మధ్య ప్రతిఒక్కరూ 'తల్లిదండ్రులు స్నేహితులు'లా ఉండాలని కోరుకొంటున్నారు. ఈ కోణం నాకు అస్సలు అర్థంకాదు. ఎందుకంటే పిల్లలు పిల్లలే. స్నేహితులు స్నేహితులే. నా మిత్రులతో పంచుకున్న విషయాలన్నిటినీ నా పిల్లలతో చెప్పలేను కదా" అంటారు శ్వేత.

దీన్ని ఖండించిన జయాబచ్చన్... "నీ అభిప్రాయం సరైంది కాదు. మన పిల్లలు మన స్నేహితులు ఎందుకు కాలేరు? ఒక వయసు దాటిన తరువాత నీ పిల్లతోనే నీకు దోస్తీ కుదురుతుంది" అన్నారు. ఈ వాదనతో శ్వేత ఏకీభవించలేదు. "ఎన్ని చెప్పినా ఒక స్థాయికి వెళ్లేసరికి 'నేను నీ తల్లిని. పిల్లవి నీకేం తెలుసు' అనే పెద్దరికం పెద్దల్లో వచ్చేస్తుంది" అన్నారు.

ఇద్దరి భిన్నాభిప్రాయాల నేపథ్యంలో నవ్య కూడా చర్చలోకి దిగింది. 'తల్లిదండ్రులు పిల్లలకు స్నేహితులు ఎందుకు కాలేరు' అని శ్వేతను ప్రశ్నించిన నవ్య... 'అమ్మా... ఇప్పుడు నువ్వు, అమ్మమ్మా ఇద్దరూ తల్లులే. కనుక మీరిద్దరూ 'స్నేహితులు కాగలరు' అంటూ పరిస్థితిని సమతూకం చెయ్యడానికి ప్రయత్నించింది.

అయితే శ్వేత తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు.

> **తల్లిదండ్రులు స్నేహితులుగా మెలగడమంటే తమ పిల్లల్ని తమతోపాటు పెద్దలుగా భావిస్తున్నట్టే అని 2002లో ఓ అధ్యయనం వెల్లడించింది. దీనివల్ల పెద్దలతో ఎలా మసలుకోవాలో తెలియని అయోమయ స్థితిలోకి పిల్లలు వెళ్లిపోతారని పేర్కొంది..**

ప్రస్తుతం తను, జయ ఇద్దరూ తల్లులే అయినప్పటికీ పిల్లల్ని పెంచే విధానాల్లో తమ మధ్య ఎంతో వ్యత్యాసం ఉందంటారు శ్వేత. "నేను, అమ్మ స్నేహితులం కాదు. ఇప్పటికీ ఎప్పటికీ ఆమె నా తల్లి. ఒక కూతురుగా తనతో ప్రవర్తించే తీరులో నాకు కొన్ని హద్దులు ఉంటాయి. వాటిని అతిక్రమించకూడదు. అదే స్నేహంలో అయితే



ఎలాంటి పరిధులూ, పరిమితులూ ఉండవు. ఎవరైనా సరే కుటుంబంతో అపరిమిత సమయం గడపగలరు... నవ్య వాళ్ల అమ్మమ్మతో గడిపినట్టు. అంతమాత్రాన వారిద్దరూ స్నేహితులు కారు. ఎందుకంటే నవ్య తనకు సంబంధించిన ప్రతి విషయాన్నీ మా అమ్మతో నిజాయతీగా పంచుకోలేకపోతోంది" అనేది శ్వేత వాదన. అయితే తల్లిదండ్రులు కొంతవరకు స్వేచ్ఛ ఇవ్వాలంటారు ఆమె. "దానివల్ల పిల్లలకు తమ తప్పులను సరిదిద్దుకొనే అవకాశం కలుగుతుంది. అది వారి మానసిక పరిపక్వతకు దోహదపడుతుంది" అంటారు ఆమె.

"దీనికి నేను ఒప్పుకోను. అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. పిల్లలు తప్పులు చేయకుండా వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యత పెద్దలదే" అంటూ జయ చర్చను ముగించారు.

ఈ చర్చ నెట్టింటికి చేరింది. కొందరు జయను సమర్థిస్తుంటే... మరికొందరు శ్వేత పక్షాన నిలిచారు. మరి నిపుణుల మాటేమిటి?

జీన్ ట్వెంగే, డబ్ల్యూ కీత్ క్యాంపబెల్ తమ 'ది నార్సిసిజమ్ ఎపిడెమిక్: లివింగ్ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఎన్‌టైటిల్‌మెంట్' అనే పుస్తకంలో ఏం చెప్పారంటే... 'తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహితులుగా మెలిగేందుకు ప్రయత్నించినప్పుడు సమస్యలకు కారకులవుతారు' అని. 'ఈ క్రమంలో ప్రధానంగా ఎదురయ్యే ఇబ్బంది పిల్లల మీద పెద్దలు అధికారం కోల్పోవడం. ఫలితంగా తల్లిదండ్రులు నిర్లక్ష్యానికి గురవుతారు. పిల్లల ఆలనాపాలనలో కొన్ని నిబంధనలు, పరిమితులు తప్పనిసరి. ఒకవేళ స్నేహితులుగా ఉంటే పిల్లల్లో క్రమశిక్షణ కూడా కరువవుతుంది' అని కొందరు అభిప్రాయపడ్డారు.

తల్లిదండ్రులు స్నేహితులుగా మెలగడమంటే తమ పిల్లల్ని తమతోపాటు పెద్దలుగా భావిస్తున్నట్టే అని 2002లో ఓ అధ్యయనం వెల్లడించింది. దీనివల్ల పెద్దలతో ఎలా మసలుకోవాలో తెలియని అయోమయ స్థితిలోకి పిల్లలు వెళ్లిపోతారని పేర్కొంది. అమ్మానాన్నలతో స్నేహితుల్లా సాన్నిహిత్యంగా ఉండే ప్రతిఒక్క చిన్నారిలో ఇదేరకమైన పరిస్థితి ఉంటుందని చెప్పలేమని మరో అధ్యయన సంస్థ 'స్టాటిన్ హెచ్' తెలిపింది. అలాగే ఇరవై నాలుగు గంటలూ నిఘా పెట్టడంవల్ల పెద్దలపై పిల్లల్లో నమ్మకం సన్నగిల్లుతుందని గుర్తించినట్టు స్వీడన్‌కు చెందిన ఆ అధ్యయన సంస్థ చెప్పింది. మరి మీ ఓటు ఎవరికి? శ్వేతకా? జయాబచ్చన్‌కా? •



దిక్సూచి



ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్‌ఆర్‌ఐ సెకండ్ ఫేజ్

గుంటూరులోని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- ఎన్‌ఆర్‌ఐ కోటా కింద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఆర్‌ఐ వీసా- పాస్‌పోర్ట్- ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. అభ్యర్థులు తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

అడ్మిషన్స్

ఏసీఎస్‌ఐఆర్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్‌ఐఆర్)- ఇంటిగ్రేటెడ్ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(ఐడీడీపీ-ఎంటెక్&పీహెచ్‌డీ); పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

పరిశోధన విభాగాలు

సైన్స్ విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్

- మెడికల్ రీసెర్చ్ ● ఇంజనీరింగ్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.acsir.res.in/admissions

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం

రిమైండర్

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 3 నుంచి
- **నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024 తేదీ:** అక్టోబరు 9న
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 10
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 17
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** అక్టోబరు 26
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

కురుక్షేత్ర వర్సిటీలో పీజీ డిప్లొమా

కురుక్షేత్ర యూనివర్సిటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ- 'పీజీ డిప్లొమా ఇన్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఈవెనింగ్ ప్రోగ్రామ్. దీనిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద నిర్వహిస్తున్నారు. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఇన్ హిస్టరీ ఉత్తీర్ణులై ఉండాలి. మోడరన్ ఇండియన్ హిస్టరీ ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల: సెప్టెంబరు 2న
- ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల: సెప్టెంబరు 5
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 9 నుంచి
- **వెబ్‌సైట్:** www.kuk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/ZZBciGsలో చదవండి.

నవ్య చిత్రజ్యోతి

హీరోగా మారిన విలన్ కథ ఇది




నేను 'మగధీర' చిత్రానికి కో డైరెక్టర్‌గా పని చేశా. ఆ సమయంలోనే దేవ్ గిల్‌తో పరిచయం ఏర్పడింది. దేవ్ ఈ సినిమా ప్రపోజల్‌తో వచ్చాడు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అన్నారు దర్శకుడు త్రికోటి. దేవ్ గిల్ హీరోగా నటించిన 'అహో విక్రమార్క' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ నెల 30న ఆ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో దేవ్ గిల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాడు. ఓ విలన్ హీరోగా మారితే ఎలా ఉంటుందనేది ఈ చిత్రకథ అనీ, మదర్ సెంటిమెంట్ కూడా ఉందనీ ఆయన తెలిపారు.

రచయిత నరసింగరావు కన్నుమూత



కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'గులాబి', రామ్‌గోపాల్ వర్మ 'అనగనగా ఒకరోజు' లాంటి పలు హిట్ చిత్రాలకు మాటల రచయితగా పనిచేసిన నడిమింటి నరసింగరావు (72) కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలకు చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

కౌంట్‌డౌన్ మొదలు



ప్రపంచ వ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'పుష్ప 2 ది రూల్' చిత్రం విడుదలకు కౌంట్ డౌన్ మొదలైంది. మరో వంద రోజుల్లో అంటే డిసెంబర్ 6న ఈ సినిమా విడుదల కానుందని మేకర్స్ పేర్కొంటూ పోస్టర్ విడుదల చేశారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకుడు. నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. మరో వైపు నిర్మాణానంతర పనులు కూడా శరవేగంతో జరుగుతున్నాయి. 'కంటెంట్ పరంగానే కాకుండా టెక్నికల్‌గా కూడా 'పుష్ప 2' అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది. మీరు ఎంత ఎక్స్‌పెక్ట్ చేసినా అంతకు మించి 'తగ్గేదేలే' అనిపించే రీతిలో సినిమా ఉంటుంది' అని దర్శకనిర్మాతలు చెప్పారు. దేవిశ్రీప్రసాద్ పాటలు అలరిస్తాయని తెలిపారు.

అందరి పేర్లు బయటపెట్టాలి



మలయాళ చిత్ర ప్రముఖులపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఎఫ్‌ఈఎఫ్‌కేఏ (ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ) దర్శకుల సంఘం ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. జస్టిస్ హేమ కమిటీ నివేదికలో లైంగిక వేధింపులకు పాల్పడిన అందరి పేర్లను బయట పెట్టాలంటూ ఎఫ్‌ఈఎఫ్‌కేఏ దర్శకుల సంఘం డిమాండ్ చేసింది. "ప్రస్తుతం ఈ విషయం కోర్టులో ఉన్నందున దీనిపై ఎక్కువ మాట్లాడాలనుకోవడం లేదు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ అందరి పేర్లు బయటకి రావాలి. దోషులకు కఠిన శిక్ష పడాలి. నిందితులలో మా సంఘం సభ్యులున్నా.. మేం కలుగజేసుకోం" అని పేర్కొంది.

సిద్ధిఖీపై కేసు

మలయాళ నటుడు సిద్ధిఖీపై నటి రేవతి సంపత్ లైంగిక ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. అలాగే, బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు ఇండస్ట్రీలో మరీ ఎక్కువ

నటి షకీలా తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. "లైంగిక వేధింపులు కేవలం మలయాళ చిత్రసీమలోనే కాదు.. తమిళ ఇండస్ట్రీలోనూ ఉన్నాయి. తెలుగు ఇండస్ట్రీలో అయితే మరీ ఎక్కువగా ఉన్నాయి. అడ్జస్ట్‌మెంట్లు, కమిట్‌మెంట్ల గురించి మేనేజర్లు ముందే అడుగుతారు" అని ఆరోపించారు.

నోరు విప్పితే ట్రబుల్‌మేకర్స్ ముద్ర

హేమ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి స్వర భాస్కర్. "హేమ కమిటీలో వెలువడిన చీకటి వాస్తవాలు చూసి షాకయ్యా. బాధితులు ఎవరైనా ఏ విషయంపై అయినా నోరు తెరచి మాట్లాడితే వారిని ట్రబుల్‌మేకర్స్‌గా ముద్ర వేస్తారు" అని స్వర భాస్కర్ పేర్కొన్నారు. ప్రతి పరిశ్రమలోనూ మహిళలు ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొంటున్నారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ అన్నారు. వేధింపులను వెలుగులోకి తెచ్చేందుకు హేమ కమిటీ రిపోర్ట్ ఉపయోగపడిందన్నారు. ఈ నివేదిక మనలో మార్పు తీసుకురావాలి అని ఆమె ఆకాంక్షించారు.

ఇన్ ప్రోగ్రెస్



గన్నూ.. గర్ల్!

శ్రీ సింహా కోడూరి, సత్య ప్రధాన పాత్రధారులుగా రూపొందిన 'మత్తు వదలరా' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. రితేశ్ రానా దర్శకత్వంలో చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నిధి పాత్ర షోషిస్తున్నారు. గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో ఉన్న ఫరియా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సునీల్, వెన్నెల కిశోర్, అజయ్, రోహిణి తదితరులు నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది.

సెప్టెంబర్‌లో జిగేల్



త్రిగుణ్, మేఘనా చౌదరి జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డాక్టర్ వై జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'సెప్టెంబర్‌లో 'జిగేల్' చిత్రాన్ని విడుదల చేస్తాం. యువతను ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోంది' అని నిర్మాతలు చెప్పారు. రఘుబాబు, పృథ్వి కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఆనంద్ మంత్ర

నీలి మేఘములలో...



రానా దగ్గుబాటి సమర్పణలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం సెప్టెంబర్ 6న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. లీడ్ పెయిర్ జర్నీని అందంగా ఆవిష్కరిస్తూ భరద్వాజ్ గాలి రాసిన 'నీలి మేఘములలో' పాటను బుధవారం విడుదల చేశారు. వివేక్ సాగర్ ఈ గీతానికి స్వరాలు అందించారు.

ప్రేమికుడి వీక్షణం



యువ కథానాయకుడు రామ్ కార్తీక్ హీరోగా, కశ్వి హీరోయిన్‌గా నటించిన 'వీక్షణం' చిత్రం తొలి కాపీతో విడుదలకు సిద్ధమైంది. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం సిద్ శ్రీరామ్ పాడిన 'ఎన్నెన్నో' పాటను విడుదల చేశారు. ప్రేమలో మునిగిన ప్రేమికుడి మనసుని ఆవిష్కరించే ఈ పాటను రెహ్మాన్ రాయగా, సమర్థ్ గొల్లపూడి స్వరాలు సమకూర్చారు.

సాధనకు దీక్ష అవసరం



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'దీక్ష' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. కిరణ్ కుమార్, అలేఖ్యారెడ్డి జంటగా నటించిన ఈ చిత్రాన్ని పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాం.' అని కోరారు. ఒక మంచి సినిమాలో అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు హీరో, హీరోయిన్లు కృతజ్ఞతలు తెలిపారు.

వేములవాడలో నిత్యాన్నదాన సత్రం


» తిరుమల తరహాలో ఏర్పాటు చేస్తాం : మంత్రి పొన్నం



సిరిసిల్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల తరహాలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో సైతం నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం వేములవాడ రాజరాజేశ్వరస్వామిని మంత్రి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రానున్న కార్తీక మాసంలోగా భక్తులకు నిత్యాన్నదాన సత్రం అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సత్రం ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అన్నివర్గాల ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఆలయ అభివృద్ధి కోసం రూ 50 కోట్లు మంజూరు చేశామని, బ్రేక్ దర్శనం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

పెసర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

» రైతులు నష్టపోకుండా చూడాలి.. సీఎంకు హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆహార పంటలకు బదులు పప్పుధాన్యాల సాగుతో లాభాలు సాధించాలన్న రైతుల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం అడియాశలు చేయడం శోచనీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర దక్కడం లేదని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో విఫలమయ్యారంటూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. పెసరకు కేంద్రం ప్రకటించిన రూ.8,682 మద్దతు ధరతో ఎవరూ కొనడంలేదని, దీంతో రైతులు క్వింటాలు పెసరను రూ.6,000 నుంచి రూ.6,500కు అమ్ముకొనే పరిస్థితి వచ్చిందన్నారు. 'మీ పాలనలో పంటలు పండించడం, పంటలను విక్రయించడం రైతన్నకు కత్తిమీద సాముగా మారింద'న్నారు. ఇప్పటికైనా వ్యవసాయ, రైతు వ్యతిరేక విధానాలను వీడాలని, మార్క్‌ఫెడ్ ద్వారా పెసర కొనుగోలు కేంద్రాలను అన్ని జిల్లాల్లో తక్షణం ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాగా, సీఎం రేవంత్‌ప్రాతినిధ్యం వహించే కొడంగల్ నియోజకవర్గంలోనే ఉపాధ్యాయుల్లేక పాఠశాల మూతపడటం సిగ్గుచేటని హరీశ్ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి ఉంటే ఎవరూ పట్టించుకోవడంలేదని, రాష్ట్రంలో చాలా చోట్ల ఈ పరిస్థితి ఉందన్నారు. తక్షణమే విద్యా వాలంటీర్లను నియమించి పాఠశాలలు మూతపడకుండా చూడాలని డిమాండ్ చేశారు.

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాల నిలుపుదల

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రవేశాలను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పాత నోటిఫికేషన్‌కు సంబంధించిన మెరిట్ లిస్టుతో కొత్త సీట్లు ఎలా భర్తీ చేస్తారు? అని ప్రశ్నించింది. కొత్త పీహెచ్‌డీ సీట్లకు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి, అర్హులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరుతూ అమరేందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. పాత నోటిఫికేషన్ ఆధారంగా కొత్త సీట్లను భర్తీ చేయరాదని ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను సెప్టెంబరు 18కి వాయిదా వేసింది.

జన్వాడ ఫామ్‌హౌస్‌కు అనుమతులే లేవు!

కానీ.. ఇంటి నంబర్ కేటాయింపు.. పన్ను వసూళ్లు.. 111 జీవో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

» రెండో రోజూ రెవెన్యూ అధికారుల సర్వే
» ఫిరంగి కాలువ పరిధిలో ఆక్రమణలపై ఆరా
» ఒకటి, రెండు రోజుల్లో మళ్లీ పరిశీలన
» పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక



జన్వాడలోని ఫామ్‌హౌస్ వద్ద గ్రామ నక్షను పరిశీలిస్తున్న అధికారులు

శంకర్‌పల్లి, ఆగస్టు 28: జన్వాడలో కేటీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించి ఎలాంటి అనుమతులూ తీసుకోలేదని తెలిసింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ ప్రాంతమంతా 111 జీవో పరిధిలో ఉంది. ఇక్కడ 2013-14 మధ్య ఫామ్‌హౌస్‌ను నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనికి సంబంధించి అప్పటి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కానీ, ఆ ఇంటికి నంబర్ కేటాయించి, ఏటా పన్ను వసూలు చేస్తుండడం గమనార్హం. సర్వే నంబర్ 311-7లో 362 గజాల్లో ఇంటి నిర్మాణం ఉన్నట్లు పంచాయతీ రికార్డుల్లో ఉండగా.. ఫామ్‌హౌస్ 1,210 గజాల్లో ఉందని విశ్వసనీయ సమాచారం. 111 జీవో పరిధిలో కాంక్రీటుతో నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలు ఉండగా.. అందుకు విరుద్ధంగా ఫామ్‌హౌస్‌ను మూడు అంతస్తుల్లో నిర్మించారు. మరోవైపు... జన్వాడ ఫామ్ హౌస్ వద్ద బుధవారం కూడా రెవెన్యూ అధికారుల సర్వే కొనసాగింది. చేవెళ్ల రెవెన్యూ డివిజన్ సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో శంకర్‌పల్లి ఆర్ఐ తేజ, సర్వేయర్ సాయితేజ, నీటి పారుదలశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ లింగం తదితరులు మియాఖాన్‌గడ్డ నుంచి జన్వాడ ఫామ్‌హౌస్ మీదుగా శంకర్‌పల్లి మండల సరిహద్దు వరకు 500మీటర్ల మేర సర్వే చేపట్టారు. డిజిటల్ సర్వే (డీజీపీఎస్) మిషన్‌తో ఫిరంగి కాలువను పరిశీలించారు. కాలువతో, బఫర్ జోన్ ప్రాంతం ఏ మేరకు ఆక్రమణకు గురైందనే విషయాన్ని ఆరా తీశారు. ఒకటి రెండు రోజుల్లో మరో సారి సర్వే చేపట్టి, పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు.

ఎఫ్‌టీఎల్‌లో సుందరీకరణా?

ఇరిగేషన్ శాఖ ఎలా అనుమతినిచ్చింది?.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ విస్మయం

» మీర్ పేటలో మూడు చెరువుల సందర్శన
» రాంనగర్‌లో నాలా ఆక్రమణల పరిశీలన
» రికార్డుల ప్రకారం చర్యలు చేపట్టాలని
» అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు
» హైడ్రాకు వెల్లువెత్తుతోన్న ఫిర్యాదులు



మీర్‌పేట్‌లోని చంద చెరువు వద్ద ఎఫ్‌టీఎల్ దిమ్మెను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ సిటీ/రాంనగర్, సికింద్రాబాద్, చంపాపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చెరువు ఎఫ్‌టీఎల్‌లో సుందరీకరణ పనులా? ఇరిగేషన్ అధికారులు ఎలా అనుమతించారు? ప్రభుత్వ విభాగాలే ఇలా నిర్మాణాలు చేపడుతాయా? అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ విస్మయం వ్యక్తం చేశారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు, పెద్దచెరువు, జిల్లెలగూడలో ఉన్న చంద చెరువును బుధవారం ఆయన సందర్శించారు. సుందరీకరణ పేరుతో మూడు చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో బండ్(కట్ట)లు, పాత్ వేలు, ల్యాండ్ స్కేపింగ్ వంటివి చేపట్టడంపై ఇరిగేషన్ శాఖ ఎన్‌వోసీతోనే ఈ పనులు చేశారా? అని అధికారులను ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్లతో సుందరీకరణ చేపట్టారని చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు, స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చంద చెరువు వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లోని కొంత భాగంతోపాటు పార్కింగ్ ప్రాంతం ఎఫ్‌టీఎల్‌లోనే ఉందన్న ఫిర్యాదు నేపథ్యంలో ఆ ప్రాంతాన్నీ రంగనాథ్ పరిశీలించారు. అక్కడ ఉన్న ఎఫ్‌టీఎల్ దిమ్మెను చూసి, దీని ఇక్కడేనా ఉండేది? అని ప్రశ్నించారు. ఫంక్షన్ హాల్ యజమానులు తమ వద్ద ఉన్న రికార్డులను చూపించగా, అధికారులకు సమర్పించాలని సూచించారు. మంత్రాల చెరువు, పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతం సైతం కబ్జాకు గురైనట్టు ఆయన గుర్తించారు. లెనిన్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి.. వివరాలు తెలుసుకున్నారు. ఆయా చెరువుల్లోని ఆక్రమణదారులకు గతంలో ఏమైనా నోటీసులు ఇచ్చారా? ఆక్రమణలను కూల్చేశారా? అని బాలాపూర్ రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేసి తనకు అందజేయాలని, దాని ఆధారంగానే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారం పరిధిలోని సర్వే నంబర్ 125లో ఉన్న ప్లాట్లు పతుల్లాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో లేవని, హైడ్రాకు కొంత మంది తప్పుడు సమాచారం ఇచ్చారని సదరు ప్లాట్ల యజమానులు పేర్కొన్నారు. అలాగే, రాంనగర్‌లోని మణెమ్మ గల్లీలో నాలాను జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులతో కలిసి రంగనాథ్ పరిశీలించారు. వర్షం పడితే బస్తీ నుంచి వరద నీరు బయటకు వెళ్లే దారి లేక ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు ఆక్రమణలతో బస్తీలోకి అంబులెన్స్ వచ్చే పరిస్థితి కూడా లేకుండాపోయిందని చెప్పారు. దీనిపై స్పందించిన రంగనాథ్.. రికార్డుల ప్రకారం నాలాను గుర్తించి, ఆక్రమణలు ఉంటే తొలగించాలని అధికారులను ఆదేశించారు. గురువారమే చర్యలకు శ్రీకారం చుట్టాలని, అవసరమైతే పోలీస్ బందోబస్తు తీసుకోవాలని సూచించారు. కాగా, చెరువుల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బుద్ధ భవన్‌లోని కార్యాలయానికి వచ్చి నేరుగా రంగనాథ్‌కే కొందరు ఫిర్యాదు చేస్తుండగా.. మరికొందరు టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్లు చేస్తున్నారు. చెరువుల మ్యాపులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాలు తెలియజేస్తూ ఆక్రమణలకు సంబంధించిన ఆధారాలు సమర్పిస్తున్నారు. 15 రోజుల్లోగా ఫిర్యాదుపై స్పందన రాకుంటే మరోసారి వచ్చి కలవాలని పౌరులకు రంగనాథ్ సూచిస్తున్నారు. ఫిర్యాదులపై కొన్ని ప్రాంతాలకు హైడ్రా బృందాలు నేరుగా వెళ్లి వివరాలు సేకరిస్తున్నాయి. ఇందులో భాగంగానే బుధవారం మీర్‌పేట, రాంనగర్ ప్రాంతాలను రంగనాథ్ పరిశీలించారు.

హైదరాబాదీల సమస్యలకు హైడ్రా పరిష్కారం : మల్లు రవి

హైదరాబాద్ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు హైడ్రా శాశ్వత పరిష్కారం చూపుతోందని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. హైడ్రా కూల్చివేత పనులకు అన్ని వర్గాలు, పార్టీలు మద్దతు ప్రకటిస్తున్నాయని చెప్పారు. ఆక్రమణలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. గత సర్కారు హైదరాబాద్‌ను పట్టించుకోలేదని.. చిన్న వానకే పలు ప్రాంతాలు జలమయమై పోతున్నాయన్నారు. తెలంగాణను లూటీ చేసి మద్యం కుంభకోణంలో జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చిన కవితను కడిగిన ముత్యం అనడానికి సిగ్గుండాలని కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం మండిపడ్డారు. కవిత ఏమైనా దేశం కోసం త్యాగం చేసి జైలుకెళ్లిందా.. అంటూ బీఆర్ఎస్ నేతలను నిలదీశారు.'

బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు చెందిన కళాశాలలకు నోటీసులు

ఎంఎల్ఆర్ఐటీ, ఏరోనాటికల్ కాలేజీల్లో ఆక్రమణలు తొలగించాలని ఆదేశం

దుండిగల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చెరువులు, నాలాల ఆక్రమణల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు చెందిన కళాశాలలకు నోటీసులు జారీ చేసింది. చెరువును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలనే ఆదేశించింది. ఈ మేరకు మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మర్రి లక్ష్మణ్ రెడ్డికి చెందిన ఎంఎల్ఆర్ఐటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలకు దుండిగల్ తహసీల్దార్ ఈ నెల 22నే నోటీసులు జారీ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్‌లో ఈ కళాశాలలు ఉన్నాయి. దుండిగల్‌లోని చినదామెర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని 8 ఎకరాల 24 గుంటల్లో కళాశాలల కోసం నిర్మాణాలు చేపట్టినట్టు అధికారులు గుర్తించారు. ఇందులో సర్వే నెంబర్ 489లో 1 ఎకరంలో భవనాలు నిర్మాణాలు , సర్వే నెంబరు 484, 485, 488లో రెండెకరాల్లో శాశ్వత షెడ్డులు, సర్వే నెంబరు 492, 489లోని మూడు ఎకరాల్లో వాహనాల పార్కింగ్ కొనసాగిస్తున్నారని, అలాగే, ఎంఎల్ఆర్ఐటీ కాలేజీ రోడ్డు 2.24 ఎకరాల్లో ఉన్నాయని నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఏడు రోజుల్లోగా ఆయా నిర్మాణాలను తొలగించాలని లేని పక్షంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందులో స్పష్టం చేశారు. కాగా, నోటీసుల నేపథ్యంలో నిర్మాణాలను కూల్చివేయకుండా ఉండేందుకు కళాశాల యాజమాన్యం న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు తెలిసింది. గతంలో ఇదే కళాశాలపై కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు ఫిర్యాదు ఆధారంగా కళాశాలలో భవనాలను మాత్రం కూల్చివేశారు. ఈ కూల్చివేత జరుగుతుండగానే న్యాయస్థానం నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్న యాజమాన్యం కూల్చివేతను అడ్డుకుంది. ఇప్పుడు హైడ్రా రాకతో ఏరోనాటికల్, ఎంఎల్ఆర్ఐటీ కళాశాలల మరోసారి వార్తల్లో నిలిచాయి.

కొందరినే టార్గెట్ చెయొద్దు!

» అందరినీ ఒకే విధంగా చూడాలి
» అధికారుల అక్రమ నిర్మాణాల నుంచి కూల్చివేతలు మొదలుపెట్టండి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష వరకు అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, వారందరికీ నోటీసులు ఇస్తారా అని హైకోర్టు ప్రశ్నించింది. ముందు ప్రభుత్వ అధికారులకు చెందిన అక్రమ నిర్మాణాల నుంచి కూల్చివేతలు ప్రారంభించాలని జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేవలం కొంతమందిని టార్గెట్ చేయకుండా అందరినీ ఒకే విధంగా చూడాలని పేర్కొంది. దుర్గం చెరువు పరిధిలో అక్రమ నిర్మాణాలు అన్నింటికీ నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించింది. అధికారుల నోటీసులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టారంటూ అధికారులు ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా గుట్టలబేగంపేట్ గ్రామ పరిధిలోని కావూరి హిల్స్‌లో ఇళ్లు నిర్మించుకున్న మాడిశెట్టి మురళీధర్ రావు సహా ఏడుగురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ చట్టబద్ధంగా అనుమతులు తీసుకుని, 500 గజాల్లో స్టిల్ట్, నాలుగు ఫ్లోర్ల నివాస గృహాలు నిర్మించుకున్నారన్నారు. అవి ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని నోటీసులు ఇవ్వడం చెల్లదని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ దుర్గం చెరువు ఆక్రమణలు, కాలుష్యం అంశాన్ని చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ సుమోటోగా విచారిస్తోందని, చెరువు పరిశీలనకు నిపుణుల కమిటీని సైతం వేసిందని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులకు నోటీసులు ఇచ్చిందన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ హద్దులు గుర్తించి ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలని సీజే ఆదేశించారని తెలిపారు. ఈ వ్యవహారం చీఫ్ జస్టిస్ కోర్టులో ఉన్నందున పెండింగ్‌లో ఉన్న ప్రజాప్రయోజన వ్యాజ్యానికి ప్రస్తుత పిటిషన్లను సైతం జత చేయాలని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం ఆదేశించింది.

దుర్గంచెరువు నీళ్లు పైకొచ్చే చాన్స్ లేదుగా

దుర్గం చెరువు సమీపంలోని అమర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఉన్న నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసుపై హైకోర్టు స్టే విధించింది. అన్ని అనుమతులతో చేపట్టిన నిర్మాణాలకు నోటీసు ఇవ్వడంపై ప్లాట్ నెంబర్ 79 యజమాని ఎల్ ఊర్మిళాదేవి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది రాయ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 1991లో హుడా అనుమతులతో కట్టుకున్న ఇళ్లను ఇప్పుడు దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని చెప్పడం చెల్లదని అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. దుర్గం చెరువు చుట్టూ నిర్మాణాలు, వాకింగ్ ట్రాక్‌లు, కేబుల్ బ్రిడ్జి, మాల్స్ కట్టారని, చెరువు నీళ్లు పైకి రావడానికి అవకాశమే లేదని, ఇప్పుడు ఎఫ్‌టీఎల్ అంటే ఎలా అని ప్రశ్నించింది.

సీఎం సోదరుడి ఇంటికీ నోటీసులు..!

» దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఇల్లు, ఆఫీసు
» నెక్టర్స్, డాక్టర్స్ కాలనీలు, కావూరీహిల్స్ అమర్ సొసైటీ వాసులకు కూడా జారీ
» 30 రోజుల్లో తొలగించాల్సిందే
» ఆదేశించిన రెవెన్యూ అధికారులు



సీఎం సోదరుడు నివాసం ఉంటున్న భవనం ఇదే

హైదరాబాద్/జూబ్లీహిల్స్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చెరువుల కబ్జాలపై సీరియస్‌గా ఉన్న ప్రభుత్వం బుధవారం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. స్వయానా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఉంటున్న ఇంటికి నోటీసులను అంటించారు. మాదాపూర్ అమర్ కో-ఆపరేటివ్ సొసైటీలో తిరుపతి రెడ్డి ఉంటున్న అద్దె ఇల్లు, కార్యాలయం దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన కట్టడాలను తమంతటతాముగా తొలగించాలని పేర్కొంటూ 30 రోజుల గడువు ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో.. శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్/తహసీల్దార్.. దుర్గంచెరువుకు ఆనుకుని ఉన్న నెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, కావూరీహిల్స్, అమర్ సొసైటీ వాసులకు కూడా జారీ చేశారు. ఆ మేరకు పలు ఇళ్లకు నోటీసులను అంటించారు. వీరికి కూడా నెల రోజుల గడువు ఇస్తూ.. ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించిన కట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా కూల్చివేయాలని స్పష్టం చేశారు. ఇదే ప్రాంతంలో ఉంటున్న ఓ మీడియా సంస్థ కార్యాలయానికి కూడా నోటీసులు అంటించారు. ఇలా బుధవారం ఒక్కరోజే ఈ నాలుగు కాలనీల్లోని వందల ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు వాల్టా చట్టంలోని సెక్షన్ 23(1) కింద తాఖీదులు ఇచ్చారు. లేని పక్షంలో తామే కూల్చివేతలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో.. దుర్గం చెరువు పరిసర కాలనీల్లో ఒక్కసారిగా కలకలం రేగింది.

కుంచించుకుపోయిన దుర్గంచెరువు!

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి జీహెచ్ఎంసీ పాతిన హద్దురాళ్లను ఎవరూ పట్టించుకోవడం లేదు. దుర్గం చెరువు సగం భాగంలోకి నివాస ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు చొచ్చుకువచ్చాయి. పదేళ్ల క్రితం ప్రాథమిక నోటిఫికేషన్ ద్వారా ఎఫ్‌టీఎల్‌ను గుర్తించారు. ఆ తర్వాత తుది నోటిఫికేషన్ ద్వారా ఆ ప్రాంతానికి రక్షణ కల్పించలేదు. తొలుత గుట్టలు ఉన్న ప్రాంతంలో వంద ఎకరాలకుపైగా చెరువు విస్తరించి ఉందని అధికారులు అంచనా వేశారు. అయితే.. కొలతల తర్వాత.. దుర్గంచెరువు 84 ఎకరాల్లోనే ఉందని తేల్చారు. నగరం పశ్చిమ భాగంలో అత్యంత ప్రసిద్ధి చెందిన చెరువుగా.. 'సీక్రెట్ లేక్'గా దుర్గం చెరువుకు గుర్తింపు ఉంది. అయితే.. హైటెక్‌సిటీ ఏర్పాటు తర్వాత క్రమంగా చెరువు చుట్టూ ఆక్రమణలు పెరిగాయి. ఈ ప్రాంతాల్లో న్యాయమూర్తులు, రాజకీయ నేతలు, ఇంజనీర్లు, ఉన్నతాధికారులు, విశ్రాంత బ్యూరోక్రాట్లు.. ఇలా ప్రముఖులు నివాసాలను ఏర్పాటు చేసుకోవడంతో.. క్షేత్రస్థాయి సిబ్బంది కబ్జాల జోలికి వెళ్లలేదని తెలుస్తోంది.

ఎమ్మెల్యే మర్రి విద్యా సంస్థల భూమి పత్రాలను పరిశీలించండి

» వారి వాదనలు వినండి..
» చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి
» రెవెన్యూ అధికారులతో హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన విద్యా సంస్థల భూమి పత్రాలను పరిశీలించాలని రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. పత్రాలు పరిశీలించడంతో పాటు వారి వాదనలు విన్న తర్వాతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని దుండిగల్ తహసీల్దార్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. దుండిగల్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్, మారుతి ఎడ్యుకేషనల్ సొసైటీ, తదితర సంస్థల భవనాలు చిన్నదామెర చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్‌లో నిర్మించారని.. వాటిని తొలగించాలని ఆదేశిస్తూ తహసీల్దార్ నోటీసులు జారీచేశారు. ఈ నోటీసులను సవాల్ చేయడంతో పాటు హైడ్రా, ఇతర శాఖల అధికారులు ఎలాంటి కూల్చివేతలు చేపట్టకుండా అడ్డుకోవాలని ఆయా సంస్థలు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశాయి. దుండిగల్‌లోని 483, 484, 485, 486, 487, 488 తదితర సర్వే నంబర్లలో 17.20 ఎకరాలు, 10 ఎకరాల్లో ఉన్న విద్యాసంస్థలను కూల్చివేయాలని, అవి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని నోటీసులు ఇచ్చారని పిటిషనర్లు తెలిపారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. చిన్నదామెర చెరువుకు సంబంధించిన 8.25 ఎకరాలను పిటిషనర్లు ఆక్రమించారంటూ తహసీల్దార్ ఏకపక్షంగా నిర్ధారణకు వచ్చారన్నారు. తమ భవనాలను అక్రమ కట్టడాలుగా నిర్ధారించడం చెల్లదని, కేవలం ఏడు రోజులు సమయమిచ్చి వాటిని కూల్చేయాలని చెప్పడం అక్రమమని పేర్కొన్నారు. 2007లో గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శి, ఈవో సంతకాలతో అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థుల చదువులు, విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యా సంస్థలను కూల్చబోమని హైడ్రా ఇటీవల పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏఏజీ రజనీకాంత్‌రెడ్డి వాదిస్తూ.. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ చెరువుల పరిశీలనకు ఇటీవల అడ్వకేట్ కమిషనర్లను నియమించిందన్నారు. ఆక్రమణలు ఉన్న చెరువుల్లో చిన్నదామెర కూడా ఉందని.. పిటిషనర్లు అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏడు రోజుల్లో కూల్చాలన్న తహసీల్దార్ నోటీసును షోకాజ్ నోటీసుగా భావించాలని పేర్కొంది. వారంలో పత్రాలతో తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించింది. తహసీల్దారు వాటిని పరిశీలించి, వాదనలు విని చట్టప్రకారం వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఆలోగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ విచారణను ముగించింది. కాగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్ట్, అనురాగ్ వర్సిటీ, నీలిమ మెడికల్ కాలేజీ తదితర విద్యా సంస్థలపై 30 వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పేర్కొంది.

హైడ్రా అంటే భయం పుట్టాలి: కూనంనేని

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హైడ్రా అంటే ఆక్రమణదారుల్లో భయం పుట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. హైడ్రా కూల్చివేతల విషయంలో పేద, మధ్య తరగతి ప్రజల్లో అయోమయం, గందరగోళం నెలకుందని అన్నారు. చెరువులు, ప్రభుత్వ వక్ఫ్, దేవాదాయ భూములలో కబ్జాలు, ఆక్రమణలపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని కోరారు. పేదవారికి, మధ్య తరగతి ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గం, పునరావాసం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆక్రమణల కూల్చివేత విషయంలో ప్రభుత్వం వెనుకంజ వేయకూడదని, బడాబాబులకు భయపడకుండా ముందుకుసాగాలని కోరారు. చెరువులను, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారి పేర్లు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

బీజేపీ ఏ పార్టీని విలీనం చేసుకోదు: రఘునందన్

సిద్దిపేట కలెక్టరేట్: బీజేపీ ఏ పార్టీని విలీనం చేసుకోవడానికి సిద్ధంగా లేదని.. ఎవరితోనూ సంప్రదింపులు జరగలేదని ఆ పార్టీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్ తీర్పుపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. బెయిల్ అనేది కోర్టులకు సంబంధించిన అంశమని.. కవితకు బెయిల్ వస్తే బీజేపీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. సమస్యలను పక్కదారి పట్టించడానికే కాంగ్రెస్ డ్రామాలాడుతోందని, మోకాలికి బోడిగుండుకు ముడిపెడుతోందని ఫైర్ అయ్యారు.

ప్రపంచ శ్రేణికి
యూపీఐ, రూపే విస్తరణ

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



ముంబై: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), రూపేలను వాస్తవిక ప్రపంచ శ్రేణి ఉత్పత్తులుగా తీర్చి దిద్దడంపై దృష్టి సారిస్తున్నట్టు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. బుధవారం నాడిక్కడ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2024లో ఆయన మాట్లాడుతూ..పలు దేశాల నుంచి యూపీఐ, రూపేలకు వస్తున్న ప్రోత్సాహకరమైన స్పందనను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. వీటికి తోడు ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న సీబీడీసీ (సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ) అంతర్జాతీయ సహకారానికి అవకాశం ఉన్న మరో విభాగమని చెప్పారు. ప్రస్తుతం భూమి లేని కౌలు రైతులకు రుణ సహాయం లేదా ప్రభుత్వ సహాయం అందించడానికి, రైతులకు కార్బన్ క్రెడిట్లు అందించేందుకు సీబీడీసీని ఉపయోగించుకుంటున్నట్టు దాస్ వెల్లడించారు. యూపీఐ వంటి సత్వర రిటైల్ పేమెంట్ వ్యవస్థలతో అనుసంధానమై సీబీడీసీ విజయవంతంగా పని చేసేలా చేయగలిగామని, ఆఫ్‌లైన్ సొల్యూషన్ల ద్వారా లబ్ధి పొందడం కోసం ప్రయోగాలను కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఈ దిశగా సాధించే పురోగతి ఆధారంగా సీబీడీసీ ఏర్పాటు కోసం ఇతర దేశాలు చేస్తున్న ప్రయత్నాలకు కూడా సహకరిస్తామని ఆయన తెలిపారు. అంతర్జాతీయ అనుసంధానిత మార్కెట్లో ఉన్న రిస్క్‌లను పరిష్కరించుకుంటూనే అందుబాటులో ఉన్న అవకాశాలు సొమ్ము చేసుకోగల శక్తివంతమైన వ్యవస్థలను రూపొందించుకోవాలని ఆర్థిక సంస్థలు, ఫిన్‌టెక్ స్టార్టప్‌లకు ఆయన పిలుపు ఇచ్చారు.

ఐదు ప్రాధాన్యతా అంశాలు: డిజిటల్ ప్రభుత్వ మౌలిక వసతులు (డీపీఐ), వినియోగదారుల రక్షణ, సైబర్ భద్రత, సుస్థిర ఫైనాన్స్, ప్రపంచ శ్రేణి సహకారం అనే ఐదింటినీ ఆర్‌బీఐ ప్రాధాన్యతాంశాలుగా గుర్తించిందని చెప్పారు. ఫిన్‌టెక్ రంగం నియంత్రణ వైఖరినికూడా దాస్ ప్రస్తావించారు. ఫిన్‌టెక్ రంగం ఒక క్రమపద్ధతిలో, స్థిరంగా అభివృద్ధి చెందాలంటే ఇన్నోవేషన్, విచక్షణ మధ్య సమతూకం అవసరమన్నారు.

రిలయన్స్-వాల్ట్ డిస్నీ విలీనానికి సీసీఐ గ్రీన్ సిగ్నల్

రూ.70,000 కోట్ల భారీ మీడియా వెంచర్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్-వాల్ట్ డిస్నీ మీడియా ఆస్తుల విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. ఈ జాయింట్ వెంచర్ కంపెనీలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 63.16 శాతం, వాల్ట్ డిస్నీకి 36.84 శాతం వాటా ఉంటుంది. ఇక ఈ విలీనానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదమే తరువాయి. ఎన్‌సీఎల్‌టీ కూడా ఆమోదం తెలిపితే దేశంలో రూ.70,000 కోట్ల భారీ మీడియా వెంచర్ ఏర్పడనుంది. అదే జరిగితే వీక్షకులకు రెండు స్ట్రీమింగ్ సర్వీసులు, 120కిపైగా టీవీ ఛానల్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ జాయింట్ వెంచర్ కంపెనీకి రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ భార్య నీతా అంబానీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. సోనీ, నెట్‌ఫ్లిక్స్‌లతో పోటీ పడేందుకు వీలుగా రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ జాయింట్ వెంచర్ కంపెనీలో రూ.11,500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది.

ఎస్‌ఎంఈ షేర్లతో జర జాగ్రత్త

మదుపరులను హెచ్చరించిన సెబీ

న్యూఢిల్లీ: చిన్నమధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎస్‌ఎంఈ) కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెట్టే విషయంలో జాగ్రత్తగా ఉండాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరోసారి మదుపరులను హెచ్చరించింది. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా నిండా మునగడం ఖాయమని స్పష్టం చేసింది. ఎస్‌ఎంఈ కంపెనీల షేర్ల లిస్టింగ్, ట్రేడింగ్‌లో ప్రమోటర్లు అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో సెబీ ఈ హెచ్చరిక చేయడం విశేషం. లిస్టింగ్ తర్వాత కొన్ని ఎస్‌ఎంఈ కంపెనీలు లేదా వాటి ప్రమోటర్లు తమ కంపెనీల కార్యకలాపాలపై అతిశయోక్తులు చెబుతూ మదుపరులను మాయ చేస్తున్నట్టు ఇటీవల వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెబీ ఈ హెచ్చరిక చేసింది.

రీసోర్స్‌ఫుల్ ఆటో ఐపీఓ దెబ్బతోనే: ఇటీవల రూ.12 కోట్ల సమీకరణ కోసం పబ్లిక్ ఇష్యూకి వచ్చిన రీసోర్స్‌ఫుల్ ఆటోమొబైల్స్ అనే ఎస్‌ఎంఈ కంపెనీ ఐపీఓ 419 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. సోమవారం నాడు ముగిసిన ఐపీఓ ద్వారా రూ.12 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తే ఏకంగా రూ.4,800 కోట్లకు బిడ్స్ వచ్చాయి. ఢిల్లీలో కేవలం రెండు దుకాణాలు, 8 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్న ఈ ఎస్‌ఎంఈ కంపెనీ ఐపీఓ ఈ స్థాయిలో సబ్‌స్క్రైబ్ కావడంతో ఈ మార్కెట్లో ఏదో జరుగుతోందనే అనుమానాలు మరింత బలపడ్డాయి. దీనికి తోడు పెద్దగా ఫండమెంటల్స్ లేకపోయినా కొన్ని ఎస్‌ఎంఈల ఐపీఓలు మూడు నుంచి నాలుగున్నర రెట్ల లాభాలతో లిస్టవుతున్నాయి. దీంతో ఎస్‌ఎంఈల లిస్టింగ్ లాభాలను సెబీ ఇటీవల 90 శాతానికి పరిమితం చేసింది. అయినా మార్కెట్లో వీటి హవా నడుస్తోంది. నిజానికి సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ ఈ ఏడాది మార్చిలోనే ఎస్‌ఎంఈల షేర్లలో పెట్టుబడులు పెట్టేటప్పుడు మదుపరులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

సెకండరీ మార్కెట్ ట్రేడింగ్‌కు యూపీఐ బ్లాక్ విధానం: సెకండరీ మార్కెట్ లావాదేవీలను మరింత సురక్షితం చేయాలని సెబీ భావిస్తోంది. ఇందుకోసం క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లు అందరూ సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్ చేసే ఇన్వెస్టర్లకు తప్పనిసరిగా యూపీఐ బ్లాక్ మెకానిజం అందుబాటులోకి తేవాలని ప్రతిపాదించింది. ఇది ప్రైమరీ మార్కెట్లో ఐపీఓలకు దరఖాస్తు చేసే మదుపరులకు అందిస్తున్న ఏఎస్‌బీఏ తరహాలో ఉండాలని స్పష్టం చేసింది. దీని వల్ల మదుపరుల నిధులతో పాటు సెక్యూరిటీలకూ భద్రత లభిస్తుందని సెబీ తెలిపింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో జీక్యూజీకి మరింత వాటా

న్యూఢిల్లీ: ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ జీక్యూజీ పార్ట్‌నర్స్.. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈక్విటీలో తన వాటాను మరింత పెంచుకుంది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ నెల 23న కంపెనీ ఈక్విటీలో మరో 0.43 శాతం (4.52 కోట్ల షేర్లు) వాటా కొనుగోలు చేసింది. దీంతో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఈక్విటీలో జీక్యూజీ పార్ట్‌నర్స్ వాటా 4.74 శాతం నుంచి 5.17 శాతానికి చేరింది. ఈ 0.43 శాతం వాటా కోసం జీక్యూజీ పార్ట్‌నర్స్ దాదాపు రూ.433 కోట్లు ఖర్చు చేసింది. జీక్యూజీ పార్ట్‌నర్స్ ఇప్పటికే అదానీ గ్రూప్‌లో కీలక ఇన్వెస్టర్‌గా ఉన్న సంగతి తెలిసిందే.

అపోలో ఆయుర్‌వైద్‌తో అవెస్థాజెన్ భాగస్వామ్యం

చెన్నై: అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలపైనా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా గ్రూప్ కంపెనీ అపోలో ఆయుర్‌వైద్, అవెస్థాజెన్ లిమిటెడ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా అవెస్థాజెన్ అనుబంధ కంపెనీలు ఆయుర్వేద వైద్య విధానానికి అనుగుణంగా తయారు చేసే కొన్ని ఆహార ఉత్పత్తులు, అనుబంధ పదార్థాలను అపోలో ఆయుర్‌వైద్.. 'అవెస్థాఆయుర్‌వైద్' బ్రాండ్ పేరుతో మార్కెట్ చేయనుంది. ఈ ఆహార ఉత్పత్తులు, పదార్థాలు.. మధుమేహం, బరువు నియంత్రణ, మెటబాలిక్ డిజార్డర్స్ సరిదిద్దేందుకు ఉపయోగపడతాయని రెండు కంపెనీలు తెలిపాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,150 ▲	93,600 ▲
ముంబై	71,691 ▼	65,669 ▼	84,929 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29 వ తేదీ

హైదరాబాద్	490	విజయవాడ	520
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	508	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	109	విజయవాడ	108
వరంగల్	109	గుంటూరు	107
కరీంనగర్	109	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	100
కర్నూలు	109	నెల్లూరు	100
విశాఖపట్నం	104	అనంతపురం	107
గోదావరి	108		

అత్యుత్తమ బ్యాంకుగా ఎస్‌బీఐ

ఈ దశాబ్దం భారత్‌దే

బ్యాంక్ కొత్త చైర్మన్ శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) కొత్త చైర్మన్‌గా తెలుగు బిడ్డ చల్లా శ్రీనివాసులు శెట్టి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బ్యాంకు చైర్మన్‌గా వ్యవహరించిన దినేశ్ కుమార్ ఖారా ఈ నెల 27న పదవీ విరమణ చేయటంతో ఆయన స్థానంలో శెట్టి బాధ్యతలు చేపట్టినట్లు రెగ్యులేటరీ సంస్థలకు పంపిన ఒక ప్రకటనలో ఎస్‌బీఐ వెల్లడించింది. కాగా బ్యాంకు నికర లాభాలు మరింత పెంచడంతో పాటు బ్యాంకును అత్యంత విలువైన ఆర్థిక సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాసులు శెట్టి ప్రకటించారు. ఎస్‌బీఐని దేశంలోనే అత్యుత్తమ బ్యాంకుగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తానని ఒక సందేశంలో ఉద్యోగులకు హామీ ఇచ్చారు. దాదాపు 50 కోట్ల మంది ఖాతాదారులకు ఆర్థిక సేవలు అందిస్తున్న ఎస్‌బీఐ.. మార్కెట్ క్యాప్‌పరంగా గత పదేళ్లలో ప్రపంచంలోని అతి పెద్ద బ్యాంకుల్లో 52వ స్థానం నుంచి 17వ స్థానానికి ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్థిక వృద్ధిలో దూసుకుపోతూ ప్రస్తుతం మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశం స్థాయి నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారుతోందన్నారు. నిక్కచ్చిగా ఈ దశాబ్దం మన దేశానిదేనన్నారు. ఈ దశాబ్దం ఎస్‌బీఐది కూడా కావాలని తాను కోరుకుంటున్నట్టు శ్రీనివాసులు శెట్టి తెలిపారు. 1988లో ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరిన శెట్టి.. బ్యాంక్‌లోని పలు కీలక విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తించారు.

రూ.7,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి గాను టియర్-2 బాండ్ల ద్వారా ఎస్‌బీఐ రూ.7,500 కోట్లు సమీకరించింది. 15 సంవత్సరాల కాలపరిమితి ఉండే ఈ బాండ్లపై ఏటా 7.42 శాతం వడ్డీ చెల్లిస్తారు. రూ.5,000 కోట్లకు బిడ్స్ ఆహ్వానిస్తే ప్రావిడెంట్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, మ్యూచువల్ ఫండ్స్, బ్యాంకుల నుంచి రూ.8,800 కోట్లకుపైగా బిడ్స్ వచ్చాయి. అయితే ఎస్‌బీఐ రూ.7,500 కోట్ల బిడ్స్‌ను మాత్రమే స్వీకరించింది. ఈ బాండ్స్ కాలపరిమితి 15 సంవత్సరాలు ఉన్నా.. పదేళ్ల తర్వాత వెనక్కి తీసుకునే హక్కు ఎస్‌బీఐకి ఉంది.

టెక్నో పెయింట్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు

హైదరాబాద్: వచ్చే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రో నగరాల్లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన టెక్నో పెయింట్స్ వెల్లడించింది. హైదరాబాద్‌లో తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా సంస్థ సీఎండీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సెంటర్లలో కంపెనీ అనుబంధ సంస్థ రిచ్‌వేవ్స్ బ్రాండ్‌కు చెందిన ఇటాలియన్ ఫినిషెస్, లగ్జరీ పెయింట్స్ అందుబాటులో ఉంటాయన్నారు. భారత్‌లో ఈ పెయింట్స్‌ను తయారు చేస్తున్న కంపెనీ టెక్నో ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా అందుబాటు ధరల్లో ఈ ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు తెలిపారు.

నిఫ్టీ అదే దూకుడు

ముంబై: నిఫ్టీ వరుసగా పదో రోజు కూడా అదే దూకుడు ప్రదర్శించింది. ఈక్విటీ మార్కెట్లోకి తరలివస్తున్న విదేశీ పెట్టుబడులు.. ఇన్వెస్టర్ సెంటిమెంట్ సానుకూలంగా ఉండేందుకు దోహదపడ్డాయి. దీంతో బుధవారం నిఫ్టీ 34.60 పాయింట్ల లాభంతో 25,052.35 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 111.85 పాయింట్లు లాభపడి 25,129.60 పాయింట్లను తాకింది. ఈ రెండూ జీవితకాల గరిష్ఠ స్థాయిలే. కాగా సెన్సెక్స్ 73.80 పాయింట్ల లాభంతో 81,785.56 వద్ద ముగిసింది.

ఓరియెంట్ టెక్నాలజీస్ లిస్టింగ్ జోరు: బుధవారం లిస్టింగ్ అయిన ఓరియెంట్ టెక్నాలజీస్ షేరు ఇష్యూ ధర రూ.206తో పోల్చితే 48 శాతం ప్రీమియంతో ముగిసింది. బీఎస్ఈలో 40.77 శాతం లాభంతో రూ.290 వద్ద లిస్ట్ అయిన ఈ షేరు చివరికి 47.99 శాతం లాభంతో రూ.304.45 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్ఈలో కూడా ఈ షేరు 46.79 శాతం లాభంతో రూ.302.40 వద్ద క్లోజైంది.



మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 2023-24 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మకమైన ఇండియా గోల్డ్ కాన్ఫరెన్స్ (ఐజీసీ) రెస్పాన్సిబుల్ జువెలరీ హౌస్ అవార్డును గెలుచుకుంది. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ చైర్‌పర్సన్ సుందరవల్లి నారాయణ స్వామి చేతుల మీదుగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఎండీ ఓ. అషర్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ ఎల్ఎల్‌సీ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ సీతారామన్ వరదరాజన్, సంస్థ బులియన్ హెడ్ దిలీప్ నారాయణన్, మలబార్ గోల్డ్ కర్ణాటక రీజియన్ హెడ్ ఫిల్సర్ బాబు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఉత్సాహం

ఘనంగా పారాలింపిక్స్ ప్రారంభోత్సవం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భారత బృందం

పారిస్ : సంప్రదాయానికి భిన్నంగా సెన్ నదిలో పడవలపై అథ్లెట్ల పరేడ్‌తో ఒలింపిక్స్ ప్రారంభోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించగా.. ఇప్పుడు పారా విశ్వ క్రీడల ఆరంభాన్నీ అంతే ప్రత్యేకంగా అంటే.. స్టేడియం బయట జరిపారు. నాలుగు వేలమందికిపైగా అథ్లెట్లు, 22 క్రీడాంశాలలో తలపడే ఈ 11 రోజుల ఆటల పండుగకు బుధవారం రాత్రి ఉత్సాహంగా తెరలేచింది. నగరం మధ్యలో ఓపెన్ ఎయిర్‌లో చారిత్రాత్మక డి ల కాంకార్డ్, చాంప్స్‌ఎలీస్‌వద్ద ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఫ్రెంచ్ పారా స్విమ్మర్ థియో క్యూరిన్ పూలతో అందంగా అలంకరించిన కారులో ప్రారంభోత్సవ వేదిక డి ల కాంకార్డ్‌కు వస్తూ తన అథ్లెట్లకు స్వాగతం పలికాడు. భారీగా హాజరైన ప్రేక్షకుల చప్పట్ల నడుమ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్..ఇంటర్నేషనల్ పారాలింపిక్ కమిటీ (ఐపీసీ) చీఫ్ ఆండ్రూ పార్సన్స్‌తో కరచాలనం చేశారు. అనంతరం కెనడాకు చెందిన ప్రఖ్యాత పియానిస్ట్ చిల్లీ గొంజాలెస్..పియానో వాయిస్తుండగా 140 మంది డ్యాన్సర్లతో సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ తరుణంలో పారాలింపిక్స్ మస్కట్ 'పిర్జే' స్టేజ్‌పైకి వచ్చి అతిథులు, ప్రతినిధులు, అథ్లెట్లకు స్వాగతం పలికింది. ఆపై..పలువురు ఫ్రెంచ్ కళాకారులు.. తమ దేశ దివంగత దిగ్గజ గాయని ఎడిత్ పియాఫ్‌కు నివాళిగా ఆమె పాడిన పాటను ఆలపించారు. అనంతరం అథ్లెట్ల మార్చ్ పాస్ట్ ప్రారంభమైంది. తొలుత అఫ్గానిస్థాన్ రాగా, అనంతరం సౌతాఫ్రికా జట్టు విచ్చేసింది. అఫ్గాన్ తరఫున ఒకే ఒక అథ్లెట్ బరిలో దిగుతోంది. తదుపరి జర్మనీ, అర్జెంటీనా అథ్లెట్లురాగా..జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, షాట్‌పుటర్ భాగ్యశ్రీ జాదవ్ త్రివర్ణ పతాకంతో ముందు నడవగా బృందం సభ్యులు వారిని అనుసరించారు. తెల్ల కుర్తా, పైజమాతోపాటు పైన ఓవర్ కోట్, మెడలో కండువాను ధరించి భారత అథ్లెట్లు పరేడ్‌లో పాల్గొన్నారు. గురువారం పోటీలు ఉండడంతో షూటింగ్ జట్టు మార్చ్‌పాస్ట్‌లో పాల్గొనలేదు. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత, జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా భారత పారా బృందానికి బెస్టాఫ్ లక్ చెప్పాడు. అథ్లెట్ల పరేడ్ జరుగుతుండగానే విమానాలు ఫ్రెంచ్ జాతీయ పతాకంలోని రంగులను వదులుతూ కనువిందు చేశాయి. కుంగ్ ఫు మొనగాడు, హాలీవుడ్ స్టార్ 70 ఏళ్ల జాకీ చాన్ క్రీడా జ్యోతిని చేబూని పారిస్ వీధుల్లో సందడి చేశాడు.





జాకీ చాన్

స్పోర్ట్స్

లఖ్‌నవూ మెంటార్‌గా జహీర్ ఖాన్



కోల్‌కతా : ఐపీఎల్ జట్టు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తమ మెంటార్‌గా జహీర్ ఖాన్‌ను నియమించుకుంది. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ బుధవారం వెల్లడించింది. జహీర్ 2018 నుంచి 2022 వరకు ముంబై ఇండియన్స్‌కు పనిచేసిన విషయం తెలిసిందే. గతంలో లఖ్‌నవూ మెంటార్‌గా ఉన్న గౌతమ్ గంభీర్ నిరుడు కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మారాడు. దాంతో అప్పటినుంచి లఖ్‌నవూ జట్టు మెంటార్ పదవి ఖాళీగా ఉంది.

గుండె సర్జరీ తర్వాత ధుల్ రీఎంట్రీ

న్యూఢిల్లీ: గుండెకు చిన్నపాటి శస్త్రచికిత్స చేయించుకొన్న 2022 అండర్-19 వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ యశ్ ధుల్ పోటీ క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. ఎన్‌సీఏలో నిర్వహించిన స్కానింగ్‌లో అతడి గుండెకు రంధ్రం ఉన్నట్టు బయటపడింది. దీంతో గత నెలలో అతడికి మైనర్ సర్జరీ చేశారు. క్రమంగా కోలుకొన్న ధుల్ ప్రస్తుతం ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు.

కోహ్లీని వెనక్కునెట్టిన జైస్వాల్

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్



దుబాయ్: టెస్ట్ ర్యాంకింగ్స్‌లో యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్.. విరాట్‌ను వెనక్కునెట్టి మెరుగైన ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టెస్ట్ ర్యాంకుల జాబితాలో ముగ్గురు భారత బ్యాటర్లు టాప్-10లో నిలిచారు. జైస్వాల్ ఒక స్థానం మెరుగు పర్చుకొని ఏడో స్థానం దక్కించుకోగా.. కోహ్లీ రెండు మెట్లెక్కి ఎనిమిదో ర్యాంక్ సొంతం చేసుకొన్నాడు. కాగా, రోహిత్ ఒక స్థానం దిగజారి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ టాప్‌లో ఉండగా.. పాక్ ఆటగాడు బాబర్ ఆజమ్ ఏకంగా ఆరు స్థానాలు దిగజారి 9వ ర్యాంక్‌కు పడిపోయాడు. బౌలర్లలో స్పిన్నర్ అశ్విన్ అగ్రస్థానంలో ఉండగా.. బుమ్రా మూడో ర్యాంక్‌లో, జడేజా ఏడో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. ఆల్‌రౌండర్లలో జడేజా, అశ్విన్‌లు టాప్-2లో ఉండగా.. అక్షర్ పటేల్ ఆరో ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు.

కొరియా ఓపెన్‌లో భారత్‌కు నిరాశ

సియోల్: కొరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. అస్మిత, మాళవిక, ఆకర్షి తొలి రౌండ్‌లోనే ఓటమి పాలై, ఇంటి ముఖం పట్టారు. అస్మిత 8-21, 13-21తో పోర్న్‌పావీ (థాయ్‌లాండ్) చేతిలో ఓడగా, ఆకర్షి 15-21, 15-21తో లైన్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)తో పోరులో పరాజయం పాలైంది. మాళవిక 21-18, 15-21, 17-21తో లైన్ హోజ్‌మార్క్ (డెన్మార్క్) చేతిలో ఓడింది.

క్రికెట్‌కు మలాన్ గుడ్ బై



లండన్ : టీ20లలో మాజీ నెంబర్ వన్ బ్యాటర్ డేవిడ్ మలాన్ క్రికెట్ అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పాడు. 36 ఏళ్ల ఈ ఇంగ్లండ్ ఆటగాడు ఈ మేరకు తన నిర్ణయాన్ని బుధవారం ప్రకటించాడు. టాపార్డర్ బ్యాటర్ మలాన్ 22 టెస్టులు, 30 వన్డేలు, 62 టీ20లలో ఇంగ్లండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. టీ20లలో తిరుగులేని ఆటగాడైన డేవిడ్ 2020లో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. 2022లో ఇంగ్లండ్ జట్టు పొట్టి వరల్డ్ కప్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. గతేడాది భారత్‌లో జరిగిన 50 ఓవర్ల ప్రపంచ కప్ తర్వాత మలాన్ ఇంగ్లండ్ జట్టుకు ఆడలేదు. కాగా..వచ్చేనెలలో ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు అతడిని ఎంపిక చేయలేదు. తెల్లబంతుల ఫార్మాట్‌లో తాను అంచనాలకు మించి రాణించినా..టెస్ట్ క్రికెట్‌లో నిరాశ పరిచినట్టు మలాన్ అంగీకరించాడు. 'మూడు ఫార్మాట్లను సీరియస్‌గా తీసుకున్నా. ఎందుకనో ఐదు రోజుల మ్యాచ్‌ల్లో నా బ్యాటింగ్ ఆశించిన స్థాయిలో లేకపోయింది' అని తెలిపాడు. లీగ్ క్రికెట్‌కు తాను అందుబాటులో ఉంటానని చెప్పాడు. జాస్ బట్లర్‌తోపాటు మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు చేసిన ఇంగ్లండ్ క్రికెటర్లలో మలాన్ ఒకడు కావడం విశేషం.

శ్రీజేష్ స్థానంలో పాఠక్

న్యూఢిల్లీ : ఊహించినట్టుగానే పురుషుల హాకీ జట్టు ప్రధాన గోల్ కీపర్‌గా క్రిషన్ బహదూర్ పాఠక్ నియమితుడయ్యాడు. ఈమేరకు రాబోయే ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి 18 మంది సభ్యుల జట్టును హాకీ ఇండియా (హెచ్ఐ) బుధవారం ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత శ్రీజేష్ రిటైర్ కావడంతో అతడి స్థానాన్ని పాఠక్ భర్తీ చేస్తాడని భావించిన సంగతి తెలిసిందే. ఇక..వచ్చేనెల ఎనిమిది నుంచి 17 వరకు చైనాలోని హులున్‌బూయిర్‌లో ఈ చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. డిఫెండింగ్ చాంపియన్ భారత్‌తోపాటు కొరియా, మలేసియా, పాకిస్థాన్, జపాన్, చైనా బరిలో దిగనున్నాయి.

సవాళ్ల ముంగిట షా

క్రికెట్ విస్తరణతోపాటు ఆదాయ పెంపే ప్రధానం



జై షా

ఐసీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షా డిసెంబరు ఒకటిన బాధ్యతలు స్వీకరించనున్నాడు. ప్రస్తుతం షా పదవీ కాలం మూడేళ్లు కాగా.. మరో పర్యాయం కూడా కొనసాగే అవకాశం ఉంది. అంటే దాదాపు ఆరేళ్లపాటు అతడు ఐసీసీ హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తించే చాన్సులున్నాయి. కేవలం 35 ఏళ్ల చిన్నవయసులో కీలక బాధ్యతల్ని భుజానికెత్తుకోనున్న జైతో ఐసీసీలో సరికొత్త అధ్యాయం ఆరంభం కానుంది. 2028లో జరిగే లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడంతో.. ఈ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా మరింత ప్రాచుర్యం లభించే కీలక సమయంలో షా పగ్గాలు అందుకొంటున్నాడు. ఈ నేపథ్యంలో తనకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ క్రికెట్‌ను షా ఎలా ముందుకు తీసుకెళ్తాడనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఒక రకంగా జై సమర్థత, పరిపాలనా దక్షతకు పరీక్షా సమయంగానే భావించాలి.

టెస్ట్ క్రికెట్‌ను ఎలా కాపాడాలి?

జై షా ముందున్న ప్రధాన సవాల్ ఇది. ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో సుదీర్ఘ ఫార్మాట్ మనుగడ రోజురోజుకూ కష్టమవుతోంది. పైగా ఆటలో కొత్తగా అడుగుపెట్టిన దేశాలు కూడా టెస్ట్ క్రికెట్‌పై పెద్దగా ఆసక్తి ప్రదర్శించడం లేదు. ఈ నేపథ్యంలో గ్లోబల్ బాడీ హెడ్‌గా షా తీసుకోబోయే నిర్ణయాలకు ఎంతో ప్రాధాన్యం సంతరించుకోనుంది. భారత టెస్ట్ క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులో 300 శాతం బోనస్‌గా ప్రకటించి యువతను టెస్టుల వైపు ఆకర్షించేలా బీసీసీఐ నిర్ణయం తీసుకోవడంలో షా కీలక పాత్ర పోషించాడు.

ఐసీసీ ఈవెంట్ల క్రేజ్‌ను పెంచాలి: 2024 టీ20 వరల్డ్‌కప్‌లో 20 దేశాలు పాల్గొన్నా.. కొన్ని కారణాల వల్ల ఆశించినంత ప్రాచుర్యంతోపాటు ఆదాయం కూడా లభించలేదు. అయితే, ఒలింపిక్స్‌తో రానున్న క్రేజ్‌ను మరింత విస్తరిస్తే.. ఆట మూలాలు మరింతగా బలపడతాయి. ఈ అవకాశం చేజారకుండా చూసుకోవాల్సిన బాధ్యత షాపై ఎంతో ఉంది. ఇక, ఐసీసీ ఈవెంట్ల స్థాయిని మరింతగా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. టోర్నీల నిర్వహణతోపాటు వాటిపై వచ్చే ఆదాయం కూడా అదే స్థాయిలో ఉండాలి. ఇటీవలి కాలంలో వన్డే వరల్డ్‌కప్, ఐపీఎల్ ఈవెంట్లను భారత బోర్డు సమర్థంగా నిర్వహించి భారీగా ఆదాయాన్ని కూడా సమకూర్చుకొంది. బ్రాడ్‌కాస్టింగ్ ఒప్పందాలు, పెద్ద ఈవెంట్ల నిర్వహణలో షా ఎంతో సమర్థంగా వ్యవహరించాడు. ఆ అనుభవం ఐసీసీకి లాభించే అవకాశం ఉంది.

క్రెజికోవాకు షాక్

● దిమిత్రోవ్ ముందంజ ● యూఎస్ ఓపెన్

న్యూయార్క్: వింబుల్డన్ చాంపియన్ బార్బరా క్రెజికోవాకు రెండో రౌండ్‌లోనే చుక్కెదురైంది. యూఎస్ ఓపెన్‌లో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో 8వ సీడ్ క్రెజికోవా (చెక్) 4-6, 5-7తో ఎలెనా గాబ్రియెలా రూజ్ (రుమేనియా) చేతిలో పరాజయం పాలైంది. కాగా, 26వ సీడ్ పౌలా బడోసా (స్పెయిన్) 6-3, 7-5తో టౌన్‌సెండ్ (అమెరికా)పై, ఎలీస్ మెర్టెన్స్ 6-3, 6-2తో టామ్లజోవిచ్ (రుమేనియా)పై, నీమర్ (జర్మనీ) 6-4, 6-0తో యోయుకా (జపాన్)పై, మాడిసన్ కీస్ 6-4, 6-0తో మాయా జాయింట్‌పై నెగ్గి మూడో రౌండ్‌కు చేరుకొన్నారు. మాజీ చాంపియన్ ఒసాక 6-3, 6-2తో ఓస్టపెంకోను చిత్తు చేసింది. రిబకినా 6-1, 7-6(1)తో అలావాను, పౌలినీ 6-7(5), 6-2, 6-4తో ఆండ్రెస్క్యూను, పెగుల 6-4, 6-3తో రోజర్స్‌ను ఓడించారు.



గాబ్రియెలా రూజ్

మూడో రౌండ్‌కు దిమిత్రోవ్..: పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో దిమిత్రోవ్ (బల్గేరియా) 6-1, 6-1, 7-6(4)తో హిజికటా (ఆస్ట్రేలియా)పై నెగ్గాడు. తొలి రౌండ్‌లో వరల్డ్ నెం:1 సిన్నర్ (ఇటలీ) 2-6, 6-2, 6-1, 6-2తో మెక్‌డొనాల్డ్ (అమెరికా)పై, అల్కారజ్ (స్పెయిన్) 6-2, 4-6, 6-3, 6-1తో లి టు (ఆస్ట్రేలియా)పై, 5వ సీడ్ మెద్వెదెవ్ 6-3, 3-6, 6-3, 6-1తో లజోవిచ్‌పై, హర్కాజ్ 6-3, 7-6(4), 7-6(3)తో టిమోఫీ స్కటోవ్‌పై గెలిచారు. కాగా, 5 గంటల 35 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో డాన్ ఇవాన్స్ (బ్రిటన్) 6-7(6), 7-6(2), 7-6(4), 4-6, 6-4తో కచనోవ్‌పై పోరాడి గెలిచాడు. 1970లో టైబ్రేక్ ప్రవేశపెట్టిన తర్వాత యూఎస్ ఓపెన్‌లో సుదీర్ఘంగా జరిగిన మ్యాచ్‌గా ఇది రికార్డులకెక్కింది. కాగా, సిట్సిపాస్ (గ్రీస్) 6-7(5), 6-4, 3-6, 5-7తో తనాసి (ఆస్ట్రేలియా) చేతిలో పరాజయం పాలయ్యాడు.

యుకీ, బాలాజీ జోడీలకు గెలుపు: డబుల్స్‌లో యుకీ భాంబ్రి, శ్రీరామ్ బాలాజీ జంటలు ముందంజ వేశాయి. తొలి రౌండ్‌లో ఇండో-ఫ్రాన్స్ జంట యుకీ-ఒలివెట్టి 6-3, 6-4తో రెయాన్ సెగర్‌మెన్-ప్యాట్రిక్ ట్రహాక్‌పై గెలిచింది. ఇండో-అర్జెంటీనా జోడీ శ్రీరామ్ బాలాజీ-గుడియో ఆండ్రియోజి 5-7, 6-1, 7-6(10)తో మార్కస్ డేనియల్- మిగ్వేల్ ఏంజెల్ రీస్‌పై నెగ్గి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు.



బ్యాంకాక్‌లో ట్రావెల్ మార్ట్‌లో తెలంగాణ పర్యాటక పెవిలియన్‌ను ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణ

» బ్యాంకాక్ ట్రావెల్ మార్ట్‌లో మంత్రి జూపల్లి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పర్యాటక రంగ ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసి దర్శనీయ గమ్యస్థానంగా మారుస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని క్వీన్ సిరికిట్ నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటైన పసిఫిక్ ఆసియా ట్రావెల్ అసోసియేషన్ (పాటా) ట్రావెల్ మార్ట్‌లో తెలంగాణ పర్యాటక పెవిలియన్‌ను మంత్రి ప్రారంభించారు. ఇందులో 45 దేశాలకు చెందిన సుమారు 900 మంది ప్రతినిధులు, భారత్ నుంచి తెలంగాణతో పాటు అయిదు రాష్ట్రాల పర్యాటక శాఖ అధికారులు పాల్గొంటున్నారు. తెలంగాణలోని చారిత్రక, వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రదేశాల ప్రాశస్త్యాన్ని అంతర్జాతీయంగా పరిచయం చేయాలన్న ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర పర్యాటక సంస్థ ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసింది. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా నాగార్జున సాగర్‌లోని బుద్ధవనం, హైదరాబాద్‌లోని చార్మినార్, కుతుబ్ షాహీ టూంబ్స్, ములుగు జిల్లాలోని లక్నవరం తీగల వంతెన చాయాచిత్రాల్ని ప్రదర్శిస్తున్నారు. థాయిలాండ్‌లో భారత రాయబారి నగేష్ సింగ్, 'పాటా' ఇండియా చాప్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రణీఫ్ సన్నా, థాయిలాండ్, వివిధ దేశాల ప్రతినిధులతో మంత్రి జూపల్లి భేటీ అయ్యారు. తెలంగాణలోని పర్యాటక ప్రదేశాలను చూసేందుకు రావాలని జూపల్లి వారిని ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ఘనమైన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వ కేంద్రంగా పర్యాటకాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనతో ముందుకెళుతున్నట్లు తెలిపారు.

కేరళలో సామూహిక వివాహాలు భేష్: భట్టి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సామూహిక వివాహాలు... సామాజిక న్యాయానికి, సమానత్వానికి తార్కాణాలుగా నిలుస్తున్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేరళ రాష్ట్రం అలప్పుజ నియోజకవర్గంలోని 'ఓచిర పరబ్రహ్మ' దేవాలయంలో బుధవారం జరిగిన సామూహిక వివాహ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆహ్వానం మేరకు ఆయన కార్యక్రమానికి హాజరయ్యారు. కేరళలోని ఆలయాలు విభిన్న లక్షణాలతో కూడుకుని ఉంటాయని, ఓచిర పరబ్రహ్మ ఆలయం కూడా ఆ జాబితాలోకే వస్తుందన్నారు. గత కొన్నేళ్లుగా ఇక్కడ సామూహిక వివాహాలు నిర్వహిస్తుండడం సామాజిక ఉద్యమాలను ప్రతిబింబిస్తుందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలవారికి వివాహాలు చేయడం ప్రశంసనీయమని శ్లాఘించారు.

తెలంగాణలో రైతు సంక్షేమ చర్యలు భేష్

» యూపీ వ్యవసాయ మంత్రి షాహీ.. తుమ్మలతో భేటీ



షాహీకి జ్ఞాపికను ఇస్తున్న తుమ్మల

రైతుల సంక్షేమం కోసం తెలంగాణ చర్యలు బాగున్నాయని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మంత్రి సూర్యప్రతాప్ షాహీ కొనియాడారు. యూపీలో తమ రైతులు వాడే వరి విత్తనాలు ఎక్కువ శాతం తెలంగాణ నుంచే వస్తాయని తెలిపారు. అందుకే తమ పర్యటనలో భాగంగా విత్తన కంపెనీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్‌కు వచ్చారు. రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో పరిస్థితులపై చర్చించారు. షాహీ మాట్లాడుతూ చెరకు సాగులో యాంత్రీకరణ, చక్కెర కర్మాగారాల ఆధునికీకరణ ద్వారా రైతుల నికర ఆదాయం పెంచామని తెలిపారు. తుమ్మల మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, రైతులకు ప్రాధాన్యం ఇచ్చామని, రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు కేటాయించామన్నారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో నిలబెడతామని తెలిపారు.

తాగునీటికి నీళ్లెన్ని కావాలో చెప్పండి: కృష్ణాబోర్డు

తాగునీటి అవసరాలకు నీళ్లెన్ని కావాలో చెప్పాలంటూ తెలుగు రాష్ట్రాలను కృష్ణాబోర్డు కోరింది. కృష్ణా బేసిన్‌లోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ కింద నివాసం ఉంటున్న జనాభా..? వారి తాగునీటి అవసరాలకు నీళ్లెన్ని కావాలో లెక్కలను సెప్టెంబరు 15లోగా ఇండెంట్ సమర్పించాలని నిర్దేశించింది. అలాగే 2024-25 నీటి ఏడాదికి సంబంధించిన లెక్కలను సత్వరం అందించాలని కోరింది. ఈ మేరకు బోర్డు సభ్యుడు డాక్టర్ ఆర్.ఎన్.శంఖువ ఇరు రాష్ట్రాలకు లేఖ రాశారు.

15 మందితో సలహా కమిటీ: టీజీఈఆర్సీ

వివిధ రంగాలకు చెందిన 15 మందితో రాష్ట్ర సలహా కమిటీ (ఎస్ఏసీ)ని ఏర్పాటు చేస్తూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ) నిర్ణయం తీసుకుంది. విద్యుత్ సంస్థలు తీసుకునే విధాన నిర్ణయాలు, సేవలు, వినియోగదారుల ప్రయోజనాలపై కమిషన్‌కు ఈ కమిటీ సూచనలు, సలహాలు ఇవ్వనుంది. ఈ కమిటీ పదవీ కాలం మూడేళ్లపాటు ఉండనుంది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

టీటీడీకి ఆర్ఎస్ బ్రదర్స్ రూ.3.70 కోట్ల విరాళం

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): టీటీడీకి బుధవారం రూ.3.70 కోట్ల భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ ఎండీలు పొట్టి వెంకటేశ్వర్లు, రాజమౌళి, ప్రసాదరావు, మాలతి లక్ష్మీకుమారి ఈ చెక్కులను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

నిబంధనలు సవరించే అధికారం సర్కార్‌కు ఉంది

» మెడికల్ కోర్సుల స్థానికత జీవోపై ఏజీ వాదన

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య కోర్సులైన ఎంబీబీఎస్, బీడీఎస్‌లో కాంపిటెంట్ కోటా కింద ప్రవేశాలకు ఎవరు స్థానికులో నిర్ధారించడంతో పాటు నిబంధనలు జారీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. నీట్ పరీక్షకు ముందు వరసగా నాలుగేళ్లు (తొమ్మిది, పది, ఇంటర్) తెలంగాణలోనే చదివి ఉండడంతోపాటు పరీక్షలు సైతం ఇక్కడే రాసి ఉండాలంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 33 చట్టబద్ధతపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం బుధవారం విచారణ కొనసాగించింది. ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు వినిపిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం పదేళ్లపాటు ఏపీ విద్యార్థులకు నష్టం లేకుండా ఉమ్మడి కోటా కొనసాగిందన్నారు. ఆ గడువు ముగిసిపోవడంతో స్థానికతపై నిబంధనలు రూపొందించుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలిపారు. స్థానిక విద్యార్థులకు న్యాయం జరిగేలా నిబంధనలను సవరించినట్టు చెప్పారు. ప్రభుత్వ చర్యలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తు చేశారు. తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది.

దసరా, దీపావళి పండగలకు

48 ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న దసరా, దీపావళి, ఛాత్ పండగల సందర్భంగా ఆయా ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి 48 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం తెలియజేశారు. అక్టోబర్ 9 నుంచి నవంబర్ 25 మధ్య ప్రతి ఆదివారం తిరుపతి- మచిలీపట్నం (07121), ప్రతి సోమవారం మచిలీపట్నం- తిరుపతి (07122), కాకినాడ టౌన్- సికింద్రాబాద్ (07187), ప్రతి మంగళవారం సికింద్రాబాద్- కాకినాడ టౌన్ (07188), ప్రతి బుధవారం సికింద్రాబాద్- నాగర్‌సోల్ (07517), ప్రతి గురువారం నాగర్‌సోల్- సికింద్రాబాద్ (07518), కాచిగూడ- తిరుపతి (07653), ప్రతి శుక్రవారం తిరుపతి- కాచిగూడ (07654) ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు అధికారులు తెలియజేశారు.

కూల్చివేతలపై తగ్గేదేలే!

(మొదటిపేజీ తరువాయి)

కూడా కూల్చివేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి హైదరాబాద్‌కే హైడ్రా పరిమితమని, దీనికి పోలీస్‌స్టేషన్ హోదా కూడా కల్పిస్తున్నామని ప్రకటించారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట ఉన్న కొన్ని గ్రామపంచాయతీలు కూడా హైడ్రా పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకే హైడ్రాను తెరపైకి తెచ్చారన్న ఆరోపణల్ని సీఎం ఖండించారు. హైడ్రా తొలుత కూల్చిన భవనాలు కాంగ్రెస్ నేత పల్లంరాజుకు చెందినవేనని గుర్తుచేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు, పార్టీలోకి చేరికలకు ఎలాంటి సంబంధంలేదన్నారు. ఎవరినో భయపెట్టి పార్టీలోకి తీసుకోవాల్సిన అవసరం తమకు లేదని, తమ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉందని అన్నారు. అయితే ఎవరికైనా ప్రభుత్వ విధానాలు నచ్చి పార్టీలోకి వస్తే చేర్చుకుంటామన్నారు. చెరువులను కబ్జా చేసి నిర్మాణాలను చేపట్టినవారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, ఈ విషయంలో మల్లారెడ్డి, పల్లా రాజేశ్వరరెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి.. ఇలా ఎవరైనా ఉపేక్షించకూడదని బీఆర్ఎస్‌కు సూచించారు.

విద్యాసంస్థలైనా మినహాయింపు లేదు..

చెరువులను ఆక్రమించి నిర్మించిన విద్యాసంస్థలకు ఎలాంటి మినహాయింపు లేదని సీఎం రేవంత్ అన్నారు. అయితే ఇప్పుడు విద్యాసంవత్సరం నడుస్తున్నందున విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదనే ఆలోచనలో ఉన్నామని, ఆ తరువాతైనా ఆ నిర్మాణాలు కూల్చివేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా మాదాపూర్, అయ్యప్ప సొసైటీలోని గురుకుల ట్రస్టు భూముల్లోని ఆక్రమ నిర్మాణాలను, ఇతర ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారని గుర్తు చేశారు. అయితే కొద్దిరోజులకు ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ఇప్పుడు హైడ్రా ఎలా ఉండబోతుందని విలేకరులు ప్రశ్నించగా, "నేను రేవంత్ రెడ్డిని. నాకు కేసీఆర్‌తో పోలికా? గతంలో కూల్చివేతలు స్వార్థం కోసం జరిగాయి. హైడ్రా అనేది తాత్కాలిక అవసరాల కోసమో, నామమాత్రపు హడావిడి కోసమో వచ్చింది కాదు. దీని ఏర్పాటులో చాలా దూరదృష్టి ఉంది. కూల్చివేతలు ఆపాలంటూ నాకు చాలా ఒత్తిళ్లు, విజ్ఞప్తులు వస్తున్నాయి. అయినా ఆపబోం. ప్రజల ప్రయోజనాల కోసమే దీనిని తీసుకువచ్చాం" అని ముఖ్యమంత్రి వివరించారు. చెరువులు, బఫర్ జోన్లలో ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టడం వల్లనే చిన్న వర్షానికి కూడా ట్రాఫిక్ జామ్ అవుతోందని తెలిపారు. చెరువుల్లోనూ నిర్మాణాలు



సీఎం రేవంత్‌తో ఎమ్మెల్యే కూనంనేని

చేసుకుంటూ పోతే ఎలా? అంటూ కోర్టులు కూడా ప్రశ్నిస్తున్నాయని గుర్తు చేశారు. అదేవిధంగా హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ రెండింటినీ కాపాడడమే తమ లక్ష్యమని, ఇవి హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. చెరువు శిఖం భూముల్లో నిర్మాణాలు చేపట్టొద్దని, ఏవైనా అపరాల పంటలు సాగు చేసుకుంటే మంచిదని సూచించారు.

ఆక్రమణలోనే జన్వాడ ఫామ్‌హౌస్..

జన్వాడలోని కేటీఆర్ ఫామ్‌హౌస్ కూడా ఆక్రమణలోనే ఉందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ విషయాన్ని తాను 2020లోనే ఆధారాలతో సహా బయటపెట్టానని గుర్తుచేశారు. అప్పుడే కూలగొడతామన్నవారు.. 2024 వచ్చినా ఎందుకు కూలగొట్టలేదని ప్రశ్నించారు. సినిమా వాళ్లు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులను సమాజం ఆదర్శంగా భావిస్తుందని, అలాంటి వారే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు చేపడితే ఎలా! అంటూ వ్యాఖ్యానించారు. జన్వాడ ఫామ్‌హౌస్ తనది కాదంటున్న కేటీఆర్.. ఈ విషయాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచారా? అని ప్రశ్నించారు. నిర్మాణానికి అనుమతినిచ్చే అధికారం సర్పంచ్‌కు ఉండదని, గ్రామపంచాయతీ అధికారి (పంచాయతీ సెక్రటరీ)కి మాత్రమే ఉంటుందన్న విషయం కేటీఆర్‌కు తెలియదా? అని ఎద్దేవా చేశారు. అక్రమ నిర్మాణాలు చెరువుల్లో ఉన్నాయా? లేదా? అనే దానిపైనే చర్యలుంటాయని, వ్యక్తులను దృష్టిలో ఉంచుకుని తాము ఈ పనిచేయడంలేదని స్పష్టం చేశారు. హైడ్రా విధానాన్ని జిల్లాలకు కూడా విస్తరిస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా, 'ఇప్పటికైతే హైదరాబాద్‌లో ఏర్పాటుచేశాం' అని సీఎం సమాధానమిచ్చారు. హైడ్రాపై చాలామంది కోర్టుకు వెళ్లారని, డాక్యుమెంట్లు పరిశీలించిన తరువాతే చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించిందని తెలిపారు. చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు కూడా ఎప్పటికప్పుడు జిల్లాల కలెక్టర్లకు సూచిస్తోందన్నారు. హైడ్రాకు జ్యుడీషియల్ పరిధి ఉందని, దాని పరిధిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని అన్నారు. ప్రభుత్వ భూముల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

నిజనిర్ధారణ కమిటీకి హరీశ్‌రావునే నియమిద్దాం..

చెరువుల ఆక్రమణలపై ప్రజాకోర్టు, నిజనిర్ధారణ కమిటీలు వేద్దామని, అన్ని వివరాలను బయటకు తీద్దామని సీఎం రేవంత్ ప్రతిపాదించారు. వాటి బాధ్యతలు నిర్వహించేందుకు హరీశ్‌రావు ముందుకొచ్చినా ఫర్వాలేదన్నారు. ఇక 58, 59 జీవో కింద క్రమబద్ధీకరించుకున్న ప్రభుత్వ భూములను నిషేధిత జాబితాలో పెట్టామన్నారు. ఇక 111 జీవోను గత ప్రభుత్వం కేవలం వ్యాపారం చేసుకునేందుకే ఎత్తివేసేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. సుంకిశాల ఘటనపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆగస్టు 31న ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం పూర్తవుతుందని, ఆ తరువాత కొత్త కమిషన్ వస్తుందని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ సొసైటీకి స్థలాలను అందించడంలో గత ప్రభుత్వం జాప్యం చేసిందని, తాము త్వరగా ఆ సొసైటీకి స్థలాలను అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాగా, టీజీఆర్టీసీ, సింగరేణి, అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నేతలు సీఎం రేవంత్‌ను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహా పలువురు నేతలు సీఎంను ఆయన నివాసంలో రాత్రి కలిశారు.

రుణమాఫీలో రికార్డు సృష్టించాం..

రుణమాఫీలో తమ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని సీఎం రేవంత్ అన్నారు. గత ప్రభుత్వం 2018 నుంచి 2023 దాకా రూ.13,329 కోట్ల రుణమాఫీ చేస్తే.. తమ ప్రభుత్వం ఐదు నెలల్లోనే రూ.17,934 కోట్ల రుణమాఫీ చేసిందని చెప్పారు. రుణమాఫీ అనేది తాను వ్యక్తిగతంగా రైతులకు ఇచ్చిన కమిట్‌మెంట్ అన్నారు. మాఫీ అందుకున్నవారిలో బీఆర్ఎస్ నేతలు కూడా ఉన్నారని, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కూడా రూ.లక్షన్నర రుణమాఫీ అందుకున్నారని వెల్లడించారు. వాస్తవానికి మాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేసి, ఆ మొత్తానికే పాలనాపరమైన అనుమతులు ఇచ్చామన్నారు. ఇంకా ఎవరెవరికి మాఫీ కాలేదన్న వివరాలను బీఆర్ఎస్ నేతలు సేకరించి, కలెక్టర్లకు సమర్పిస్తే గతంలో చేసిన పాపాలను కొంతమేరకైనా కడుక్కునే అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించారు. కొడంగల్‌లోనూ వివరాలు సేకరిస్తామని కేటీఆర్ చెప్పిన విషయాన్ని విలేకరులు గుర్తుచేయగా, 'నేను కొడంగల్‌కు సీఎంను కాదు. రాష్ట్రం మొత్తానికి సీఎంను. ఎక్కడికి వెళ్లి వివరాలు తీసుకుని ఇచ్చినా.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని రేవంత్ స్పష్టంచేశారు. ఇటీవల తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,500 కోట్ల చెల్లింపులు జరిగాయంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పొత్తు లాభం' కథనాన్ని ప్రస్తావించగా.. అవి ఉమ్మడి ఏపీ హయాంలో పలు నిర్మాణాల కోసం తీసుకున్న రుణాలకు చెల్లించాల్సినవన్నారు. అప్పటినుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అసలు, వడ్డీని చెల్లిస్తోందని, ఆ మొత్తం ఇవ్వాల్సిందిగా ఏపీ కోరుతున్నా.. జనాభా ప్రాతిపదికన చెల్లిస్తామంటూ గత ప్రభుత్వం కాలం వెళ్లదీసిందని చెప్పారు. గత పదేళ్లగా ఉన్న సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నామని తెలిపారు.

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వ్యతిరేకించాం

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని తాము వ్యతిరేకించామని, అది తమ పార్టీ నిర్ణయమని సీఎం చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు విషయంపైనా నివేదికలు సిద్ధమవుతున్నాయన్నారు. ఇక కర్ణాటకలోని 'వాల్మీకి' కేసులో తెలంగాణలోని కొంతమందికి నిధులు అందాయంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేయగా, 'తెలంగాణలో ఖాతా లున్నంత మాత్రాన సంబంధాలున్నట్టేనా?' అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. వాల్మీకి కేసులో బీఆర్ఎస్ నేతలకే లింకులు ఉండి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు ఉంటుందన్న ప్రశ్నకు.. త్వరలోనే ఉంటుందని జవాబిచ్చారు. బీజేపీ-బీఆర్ఎస్ ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందని అన్నారు. ఆమె బెయిల్ కోసం బీఆర్ఎస్ పార్లమెంటు స్థానాలను త్యాగం చేసిందని ఆరోపించారు. కవితకు బెయిల్ రావడాన్ని తాను తప్పుబట్టడంలేదన్నారు. అయితే.. ఆ కేసులో ఉన్న సిసోడియాకు ఒక సమయంలో బెయిల్ రాగా, కవితకు ఇప్పుడొచ్చిందని, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఇంకా బెయిల్ రాలేదని ప్రస్తావించారు. కేసీఆర్ కన్నకొడుకునే నమ్మడంలేదని, అసెంబ్లీలో సమాధానం చెప్పేందుకు తాము చాలంటూ కేటీఆర్ మాట్లాడిన మరుసటిరోజే.. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారని తెలిపారు.



హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

దవాఖానాలకు తరలిన వైద్యశాఖ హెచ్‌వోడీలు

» క్షేత్రస్థాయిలో జ్వర, డెంగీ కేసుల తీవ్రతపై ఆరా

» రోగులతో మాట్లాడి వివరాల సేకరణ

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను సస్పెండ్ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరికలతో వైద్య ఆరోగ్యశాఖలో ఒక్కసారిగా కదలిక వచ్చింది. విభాగాధిపతులంతా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం బుధవారం ఆశాఖ ఉన్నతాధికారులు హైదరాబాద్‌లోని పెద్దాస్పత్రుల పరిశీలనకు వెళ్లారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల కట్టడికి సరైన కార్యాచరణ రూపొందించి, అమలు చేయడంలో ప్రజారోగ్య సంచాలకులు పూర్తిగా విఫలమయ్యారని, రాష్ట్రంలో రోజురోజుకు డెంగీ కేసులు పెరుగుతున్న ప్రజారోగ్య విభాగం కనీస చర్యలకు కూడా ఉపక్రమించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ పరిణామాలను సర్కారు తీవ్రంగా పరిగణించింది. మంగళవారం మంత్రి దామోదర ఉన్నతాధికారులతో సమీక్షలో... వైద్యశాఖ ఉన్నతాధికారులు బుధవారం వివిధ దవాఖానలను పరిశీలించాలని ఆదేశించారు. ఈ మేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఫీవర్ ఆస్పత్రిని సందర్శించారు. వైద్య, విద్య సంచాలకులు డాక్టర్ ఎన్.వాణి కోఠీ జిల్లా దవాఖానను, గాంధీ ఆస్పత్రిని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవీందర్ నాయక్ ఉస్మానియాను సందర్శించారు. జ్వర, డెంగీ కేసుల నమోదుపై ఆరా తీశారు. ఆయా దవాఖానల్లో వసతులు, పరికరాలు, మందుల నిల్వ వంటివి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో డెంగీ అంత తీవ్రంగా లేదని వారు సర్కారుకు నివేదిక ఇచ్చారు. గురువారం సైతం వారు హైదరాబాద్ శివారులోని దవాఖానల్లో పర్యటించనున్నారు.

రెడ్కో వైస్ చైర్‌పర్సన్‌గా

అనిలా వావిల్ల



హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు రంగంలో మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే తెలంగాణ రెడ్కో సంస్థ వైస్ చైర్‌పర్సన్, ఎండీగా శ్రీమతి అనిలా వావిల్లను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం ఈ స్థానంలో కొనసాగుతున్న ఎస్.జానయ్యను తక్షణమే ఆమెకు బాధ్యతలు అప్పగించాలని ఆదేశించింది. అనిలా వావిల్ల ప్రస్తుతం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో డివిజనల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్

ఫోర్త్ సిటీకి అనువుగానే!

నెలకొల్పనున్న పరిశ్రమల్లో పనిచేసేవారికి విద్యావైద్యం, ఇతర వసతులు అందుబాటులో ఉండేలా రూపకల్పన

» ఆ మేరకు అలైన్‌మెంట్‌లో మార్పులు

» సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పరి రక్షించే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పడనున్న ఫోర్త్ సిటీలో నెలకొల్పనున్న పరిశ్రమలకు, వాటిలో పనిచేసే అధికారులు, సిబ్బందికి.. వారి కుటుంబాలకు విద్యా, వైద్య, ఇతర వసతులు అందుబాటులో ఉండేలా అలైన్‌మెంట్ ఉండాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం, రేడియల్ రోడ్ల నిర్మాణం, డ్రైపోర్టును సీ పోర్టుకు అనుసంధానించే గ్రీన్ ఫీల్డ్ రహదారిపై ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు సీఎం కార్యాలయం మీడియాకు ప్రకటన విడుదల చేసింది. గత వారం జరిగిన సమీక్షలో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో ముఖ్యమంత్రి పలు మార్పులు సూచించడంతో అధికారులు దానికి అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. అయితే ఆ అలైన్‌మెంట్‌లో కొన్ని తేడాలు ఉండటంతో మరి కొన్ని మార్పులను సూచించారు. ఆ మార్పులకు అనుగుణంగా అలైన్‌మెంట్ మార్చాలని... అది ఫైనల్ అయ్యాక వెంటనే కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు నిర్మించాలనే ప్రతిపాదిత రేడియల్ రోడ్ల ప్రాంతంలో ముందుగానే భూసేకరణ చేయాలని సూచించారు. రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు భూ సేకరణ చేస్తున్నపుడు మానవీయ కోణంతో ఆలోచించాలని, భూ నిర్వాసితులతో సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. నిబంధనల మేరకు సాధ్యమైనంత ఎక్కువ పరిహారం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పరంగా అదనంగా ఏవిధమైన సాయం చేయగలమన్న అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు.

అన్ని అంశాలను పరిశీలించాలి

డ్రైపోర్ట్ నిర్మాణం విషయంలో మచిలీపట్నం, కాకినాడ రేవులను పరిగణనలోకి తీసుకోవాలని, తెలంగాణ ప్రయోజనాలకు ఏరకంగా మేలు జరుగుతుందనే విషయం ప్రాధాన్యంలోకి తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ అంశాలను అధ్యయనం చేశాకే గ్రీన్ ఫీల్డ్ హైవేకు రూపకల్పన చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. రైలు, జల మార్గంతో కూడిన ఇన్‌ల్యాండ్ వాటర్ వే లకు కేంద్రం ప్రాధాన్యమిస్తోందని అధికారులు తెలపగా.. ఇప్పటి వరకు దేశంలో ఎక్కడైనా అలాంటిది ఉందా? సక్సెస్ రేట్ ఎలా ఉంది? ప్రతిపాదనలేనా.. వాస్తవ రూపం దాల్చే అవకాశం ఉందా? అనే దానిపై అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఓఆర్ఆర్ -ఆర్ఆర్ఆర్ మధ్య రావిర్యాల నుంచి అమన్‌గల్ వరకు నిర్మించనున్న రహదారిలో మూడు చోట్ల ఉన్న అటవీ ప్రాంతాలను నైట్ సఫారీలుగా మార్చే అంశంపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం, నగరం.. అటవీ ప్రాంతం సమీపంలోనే ఉండటం అరుదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. బెంగళూరులో జిందాల్ నేచర్ కేర్‌ను ఏర్పాటు చేశారని, అదే విధంగా మనదగ్గర ఉన్న అటవీ ప్రాంతం, అనుకూలతలను తెలియజేస్తే అటువంటివి ఎన్నో వస్తాయని అన్నారు. ఫోర్త్ సిటీలోని పరిశ్రమలకు అటవీ ప్రాంతాలను అనుసంధానిస్తే అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అమెరికాలో యాపిల్ పరిశ్రమ.. యాపిల్ తోటలోనే ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. ఇక రాచకొండ పరిధిలోని లోయలు... ప్రకృతి సౌందర్యం సినీ పరిశ్రమను ఆకర్షించడానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, ఫోర్త్ సిటీలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ సమీకరణ విషయంలో అన్ని శాఖల అధికారులు కలిసి పని చేయాలని, ఫలితాలే లక్ష్యంగా పనితీరు ఉండాలని సీఎం అన్నారు. ప్రతి సమీక్షకు ప్రగతి కనపడాలని లేదంటే కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోనని అధికారులను హెచ్చరించారు.

అంగరంగ వైభవంగా..

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

డిసెంబరు 9న లక్షలాది మంది సమక్షంలో మిలియన్ మార్చ్ తరహాలో కార్యక్రమం

» దసరా వరకు మంచి రోజుల్లేనందునే.. హడావుడిగా భూమిపూజ

» పదేళ్లు పాలించినా బీఆర్ఎస్‌కు తెలంగాణ తల్లి గుర్తుకురాలేదు: రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన మిలియన్ మార్చ్ తరహాలో లక్షలాది మంది జనం సాక్షిగా సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది డిసెంబరు 9న ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైనట్లుగా 2009 డిసెంబర్ 9న మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ప్రకటించిందని, అదే రోజు తెలంగాణ రాష్ట్రాన్నిచ్చిన సోనియాగాంధీ జన్మదినమని తెలిపారు. అందుకే తెలంగాణ ప్రజలకు ఆ రోజు పండగ దినంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనకు సచివాలయం గుండెకాయ లాంటిదని, అందుకే ఆ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. పరిపాలనకు సంబంధించిన నిర్ణయాలు జరిగే చోటనే ప్రజలు తమ సమస్యలను తెలుపుకొనే అవకాశం ఉంటుందని, కానీ.. అలాంటి చోటికి గత పాలకులు ప్రవేశం కల్పించలేదని మండిపడ్డారు. పదేళ్లలో రూ.22.50 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టిన వారికి



సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహానికి భూమిపూజ చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి తదితరులు

కోటి రూపాయలతో సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు మనసు రాలేదని విమర్శించారు. తానే తెలంగాణ, తెలంగాణే తాను అనే రీతిలో గత పాలకులు వ్యవహరించారని, అందుకే తెలంగాణ తల్లిని తెరమరుగు చేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇలాంటి విధానాలకు విరుద్ధమన్నారు. ప్రగతి భవన్ పేరిట గడీ నిర్మించుకొని ప్రజలు ఆ పరిసరాల్లోకి రాకుండా చేశారని సీఎం ధ్వజమెత్తారు.

రాజీవ్ విగ్రహం లేని లోటు కనిపించింది..

సచివాలయం పరిసరాల్లోని నెక్లెస్ రోడ్, ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో అంబేద్కర్, ఇందిరాగాంధీ, అంజయ్య, పీవీ నర్సింహారావు, కాకా వెంకటస్వామి, జైపాల్‌రెడ్డిల విగ్రహాలో, స్మృతివనాలో ఉన్నాయని సీఎం గుర్తు చేశారు. దేశంలో విప్లవాత్మక మార్పులకు కారణమైన రాజీవ్‌గాంధీ విగ్రహం లేకపోవడం లోటుగా కనిపించిందన్నారు. సచివాలయం ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశాన్ని కొందరు తమ స్వార్థ ప్రయోజనం కోసం వాడుకోవాలని చూశారని, మేధావుల సూచన మేరకు తాము అక్కడ రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ విగ్రహాన్ని పెట్టడం జీర్ణించుకోలేని కొందరు.. తెలంగాణ తల్లి విగ్రహంతో ముడిపెట్టి వివాదం చేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని తాను జూన్ 2నే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. దొరల గడీల ఆనవాళ్లతో విగ్రహం ఉండకూడదని, అందుకే ప్రజల మనోభావాలను ప్రతిబింబించే రీతిలో తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించే బాధ్యతను జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి అప్పగించామని తెలిపారు. భూమిపూజను ఘనంగా నిర్వహించాలనుకున్నామని, కానీ.. ఈరోజు మినహా దసరా వరకు మంచి రోజులు లేవనే వేద పండితుల సూచన మేరకు హడావుడిగా నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొన్నారు.



దిగువకు కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

సాగర్ 18 గేట్లు ఎత్తివేత

- ఎగువ నుంచి 1,81,008 క్యూసెక్కుల వరద
- శ్రీశైలం ప్రాజెక్టుకు 3,11,953 క్యూసెక్కులు
- జూరాలకు భారీగా పెరిగిన వరద ప్రవాహం

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 28: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 18 క్రస్ట్ గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు రోజులుగా 2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల చేసిన ప్రాజెక్టు అధికారులు బుధవారం మధ్యాహ్నం నుంచి మరిన్ని గేట్లు తెరుస్తూ వచ్చారు. ఒంటిగంటకు 4, 3 గంటలకు 12, సాయంత్రం 4 గంటలకు 14, 7 గంటల సమయంలో 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి వరద రాక గంటగంటకు పెరగడంతో క్రమంగా ఒక్కో గేటూ తెరిచారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1,81,008 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా.. దిగువకు 1,94,758 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,11,953 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో 6 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ఎగువ కృష్ణా, భీమా నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలతో జూరాల జలాశయానికి వరద ప్రవాహం పోటెత్తుతోంది. దీంతో 3 లక్షల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

రాష్ట్రంలో రేపు అతి భారీ వర్షాలు!

హైదరాబాద్: తెలంగాణలో శుక్రవారం అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సెప్టెంబరు 1, 2 తేదీల్లో కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

రాష్ట్రానికి మరో 31 ఎఫ్ఎం రేడియో స్టేషన్లు

- జాబితాలో 10 నగరాలు, పట్టణాలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై కేంద్రం ఫోకస్!
- ప్రాంతీయ భాషలకు ప్రోత్సాహం.. ఉపాధి అవకాశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: తెలంగాణకు మరో 31 ఎఫ్ఎం రేడియో స్టేషన్లు రానున్నాయి. రాష్ట్రంలో నగరాలుగా అభివృద్ధి చెందిన పలు పట్టణాలు.. వ్యాపారాలు, వాణిజ్య కేంద్రాలుగా ఉన్న ప్రాంతాలకు ఇప్పటి వరకు ఈ సదుపాయం లేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 10 నగరాల్లో 31 ఎఫ్ఎం స్టేషన్లకు అనుమతినివ్వాలని నిర్ణయించింది. బుధవారం కేంద్ర క్యాబినెట్ భేటీలో దేశవ్యాప్తంగా 234 నగరాల్లో 730 ఎఫ్ఎం స్టేషన్లకు ఆమోదం తెలపగా.. ఆ జాబితాలో తెలంగాణకు చెందిన 10 నగరాలున్నాయి. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎఫ్ఎం స్టేషన్లకు అవకాశం కల్పించింది. అయితే.. తెలంగాణలో మాత్రం అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఎఫ్ఎంకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో ప్రాంతీయ భాషలకు ప్రోత్సాహం అందించడంతో పాటు.. ఉపాధి కల్పనకు ముందడుగు పడుతుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం వ్యాఖ్యానించారు.

ఈ నగరాలకు ఎఫ్ఎం

ఆదిలాబాద్, కొత్తగూడెం వంటి వెనకబడిన నగరాలు/పట్టణాలకు కూడా ఎఫ్ఎం సేవలు అందనున్నాయి. ఈ ప్రాంతాలకు యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ కేటగిరీలో మూడేసి చొప్పున ఎఫ్ఎం చానళ్లు మంజూరయ్యాయి. కరీంనగర్, ఖమ్మం నగరాలతోపాటు.. మహబూబ్‌నగర్, మంచిర్యాల, నల్లగొండ, రామగుండం, సూర్యాపేట ప్రాంతాలకూ మూడేసి ఎఫ్ఎం స్టేషన్లు రానున్నాయి. నిజామాబాద్ నగరానికి మాత్రం నాలుగు చానల్స్‌ను కేటాయించారు.

కంచే చేను మేస్తే..

(మొదటి పేజీ తరువాయి)

మేనేజర్ గాలి మధుబాబు డొంక కదిలింది. అతనితోపాటు.. మరో నిందితుడు సందీప్‌శర్మను సైబర్ సెక్యూరిటీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వీరిద్దరూ సైబర్ నేరగాళ్ల కోసం కరెంట్ అకౌంట్లను తెరవడం.. నేరాలకు సంబంధించిన రూ.కోట్లను విత్‌డ్రా చేసే అవకాశం కల్పించడం, ఇతర ఖాతాలకు నగదు బదిలీ చేయడంలో కీలకంగా సహకరించినట్లు ఆధారాలను సేకరించినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికాగోయల్ తెలిపారు. ఇందుకు ప్రతిఫలంగా సైబర్ కేటుగాళ్ల నుంచి వీరికి పెద్దమొత్తంలో కమీషన్ అందినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

ఎన్‌సీఆర్‌బీకి అందిన ఫిర్యాదుతో..

హైదరాబాద్ షంషీర్‌గంజ్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచ్‌లో అనుమానాస్పద ఖాతాలున్నాయంటూ జాతీయ నేరాల నమోదు విభాగం(ఎన్‌సీఆర్‌బీ) పోర్టల్‌కు తొలుత ఫిర్యాదులు వచ్చాయి. ప్రధానంగా 6 కరెంట్ అకౌంట్ల ద్వారా దేశవిదేశాలకు నగదు మార్పిడీ జరుగుతోందన్నది అందులోని సారాంశం. ఎన్‌సీఆర్‌బీ నుంచి సమాచారం అందుకున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో రంగంలోకి దిగి.. ఆ ఆరు ఖాతాల దుమ్ము దులిపింది. దాంతో.. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో ఆ ఖాతాల ద్వారా రూ.175 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు తేలింది. ఈ మొత్తంతో.. దుబాయ్ కేంద్రంగా జరిగిన 600 సైబర్ నేరాలకు లింకు ఉన్నట్లు గుర్తించారు.

ఇండస్ట్రియల్ ఇస్మార్ట్‌గా జహీరాబాద్

3,245 ఎకరాల్లో పారిశ్రామిక స్మార్ట్ సిటీ.. రూ.2,361 కోట్ల అంచనా వ్యయం

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 1.74 లక్షల మందికి ఉపాధి
- రూ.10 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- నిమ్జ్ ప్రతిపాదిత గ్రామాల్లోనే స్మార్ట్‌సిటీ
- కేంద్రం ప్రకటనపై స్థానికుల హర్షం
- ఏపీలో ఓర్వకల్లు, కొప్పర్తి స్మార్ట్ సిటీలు

హైదరాబాద్/జహీరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక వరాన్ని ప్రకటించింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 'ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ'ని ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. బుధవారం కేంద్ర క్యాబినెట్ 10 రాష్ట్రాల్లో ఆమోదించిన 12 స్మార్ట్ సిటీలలో ఇది ఒకటి. 'స్వర్ణ చతుర్భుజి'లో భాగంగా 'వికసిత్ భారత్' లక్ష్యంగా ఏర్పాటు కానున్న ఈ స్మార్ట్ సిటీతో.. 1.74 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రూ.10వేల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయని అంచనా. కొత్త పారిశ్రామిక స్మార్ట్ సిటీలను మూడేళ్లలో పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. జహీరాబాద్ స్మార్ట్ సిటీ.. గతంలో యూపీఏ-2 సర్కారు ప్రకటించిన జాతీయ పెట్టుబడుల, ఉత్పాదక జోన్(నిమ్జ్) ప్రతిపాదిత గ్రామాల్లోనే ఏర్పాటు కానుంది. అంటే.. జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లోని 17 గ్రామాల్లో.. 7,045 మంది రైతుల నుంచి ఇది వరకే సేకరించాలని నిర్ణయించిన 12,635 ఎకరాల్లోనే స్మార్ట్ సిటీ అభివృద్ధి చెందనుంది. ఇప్పటి వరకు ఝరాసంగం మండలంలోని బర్దీపూర్, చీలపల్లి, రుక్మాపూర్, ముంగి, ఎల్గోయి గ్రామాల్లో 3,500 ఎకరాల భూసేకరణ పూర్తయింది. రెండో విడతలో భాగంగా 12 గ్రామాల్లో భూసేకరణ ప్రారంభమైంది. ఇక్కడ రూ.100కోట్ల వ్యయంతో ఇప్పటికే 100 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ రోడ్డు నిర్మాణానికి జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లోని 229మంది రైతుల నుంచి 65 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. హుగ్గెల్లి నుంచి నిమ్జ్ వరకు ఓ వైపు బీటీరోడ్డు పూర్తయింది. 100 అడుగుల రోడ్డు కూడా త్వరలో పూర్తికానుంది. పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. అయితే.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్‌సిటీ 3,245ఎకరాల్లో రానుంది. దీనికి



రూ.2,361కోట్లను కేటాయించాలని కేంద్ర క్యాబినెట్ బుధవారం నిర్ణయించింది.

మూడేళ్లలో పూర్తి!

ఈ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ స్మార్ట్ సిటీ అందుబాటులోకి వస్తే.. ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ ఉపకరణాలు, ఆహార శుద్ధి యంత్రాలు, ఖనిజ/ఖనిజేతర లోహాల ఉత్పత్తులు ఇక్కడ తయారవుతాయి. 1.74 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగడమే కాకుండా.. రూ.10 వేల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయని అంచనా. ఇప్పటికే నిమ్జ్ ప్రతిపాదిత స్థలంలో హ్యుందాయ్, వెమ్‌టెక్నాలజీ సంస్థలు కర్మాగారాలను ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమయ్యాయి. మాజీ మంత్రి గీతారెడ్డి కృషితో ఈ ప్రాంతానికి నిమ్జ్ రాగా.. సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ చొరవతో జహీరాబాద్ ఓ గొప్ప పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతోందని స్థానిక కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. జహీరాబాద్ స్మార్ట్ సిటీ తెలంగాణకు మణిహారంగా మారనుంది. హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్‌లో ఈ స్మార్ట్‌సిటీ అత్యంత కీలకం కానుంది. తెలంగాణ-కర్ణాటక సరిహద్దుల్లో ఉండడం.. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 125కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఈ ప్రాంతం ఉత్పాదకతతో పాటు.. సరకు రవాణాలో కీలకంగా మారనుంది. జహీరాబాద్, మెటల్‌కుంట రైల్వేస్టేషన్లు కూడా స్మార్ట్‌సిటీకి కలిసి వచ్చే అంశం. రీజినల్ రింగ్ రోడ్డుకూడా వస్తే.. ఇక్కడి నుంచి రవాణా మరింత సులభమవుతుంది.

జహీరాబాద్ స్మార్ట్ సిటీ.. 2 దశల్లో 12,500 ఎకరాల్లో ఏర్పాటు

- రాష్ట్ర ప్రభుత్వం వద్దే 80% భూమి.. వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి దిశగా కేంద్రం మరో మెగా ప్రాజెక్టును కేటాయించిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. జహీరాబాద్‌లో పారిశ్రామిక స్మార్ట్ నగరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంపై ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్‌కు బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం(ఎన్‌ఐసీడీపీ)లో భాగంగా తెలంగాణలోని జహీరాబాద్‌లో పారిశ్రామిక స్మార్ట్ నగరాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల్లో పారిశ్రామికాభివృద్ధికి మరింత వేగంగా ముందడుగు పడుతుందన్నారు. "తొలి దశలో 3,245 ఎకరాల్లో ఈ స్మార్ట్‌సిటీని నిర్మిస్తున్నాం. రెండో దశతో కలిపితే.. మొత్తం 12,500 ఎకరాల్లో స్మార్ట్‌సిటీ వస్తుంది" అని కిషన్‌రెడ్డి వివరించారు. తొలిదశ ప్రాజెక్టుకు అవసరమైన 3,245 ఎకరాల్లో.. 3,100 ఎకరాలు(దాదాపు 80%) రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉందని ఆయన వెల్లడించారు. "రాష్ట్రానికి సంబంధించి షేర్ హోల్డర్స్ అగ్రిమెంట్, స్టేట్ సపోర్ట్ అగ్రిమెంట్ ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే పలు ఉత్పాదక రంగాలకు ఊతం అందుతుంది"అని వివరించారు.

పోలవరం ముంపుపై తక్షణమే సంయుక్త సర్వే

ముంపు ప్రాంతాలను వెంటనే గుర్తించాలి

ఏపీ, తెలంగాణకు సీడబ్ల్యూసీ చైర్మన్ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ఠ నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్) మేరకు నీళ్లను నిల్వ చేస్తే తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో తక్షణమే సంయుక్త సర్వే నిర్వహించాలని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్విందర్ సింగ్ వోహ్రా ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టుతో కిన్నెరసాని, ముర్రేడువాగుకు ఏర్పడనున్న ముంపుపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు ఇప్పటికే సంయుక్త సర్వే జరిగినా ముంపు ప్రాంతాలను గుర్తించలేదు. దీనిపై రెండు రాష్ట్రాలతో తక్షణమే సంయుక్త సర్వే చేపట్టి, డీ మార్కింగ్ చేసే ప్రక్రియను సైతం పూర్తి చేయాలని నిర్దేశించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముంపు ప్రభావంపై తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాల అభ్యంతరాలపై బుధవారం ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయంలో వోహ్రా అధ్యక్షతన సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. కమిటీలో సభ్యులైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు సంయుక్త సర్వేకు ఏపీ ప్రభుత్వం రావడం లేదని తెలంగాణ అధికారులు తెలియజేశారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల్లో ఎలాంటి పురోగతి లేదని, అవి కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. 150 అడుగుల ఎఫ్ఆర్ఎల్‌తో తెలంగాణలో 950 ఎకరాలకు ముంపు ఉంటుందని, దీనిపై జాయింట్ సర్వే చేయాల్సిందేనని కోరారు. దీనికి తెలంగాణ సహకరించడం లేదని, రెండు వాగులకే సర్వే పరిమితం చేయాల్సి ఉండగా, ఏడు వాగుల ముంపుపై సర్వే చేయాలని కోరుతోందని ఏపీ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ శ్రీనివాసరావు బదులిచ్చారు. సీడబ్ల్యూసీ చైర్మన్ వోహ్రా స్పందిస్తూ తెలంగాణ విజ్ఞప్తి మేరకు సంయుక్త సర్వే చేయాల్సిందేనని సూచించారు. దీన్ని సమన్వయం చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)ను ఆదేశించారు. 150 అడుగుల ఎఫ్ఆర్ఎల్ మేరకు పోలవరం ప్రాజెక్టులో నీళ్లు నిల్వ చేసినప్పుడు ఉండే ముంపుతో పాటు ప్రాజెక్టు వల్ల ముర్రేడువాగు, కిన్నెరసాని వాగులకు ముంపును గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. తెలంగాణ కోరిన మేరకు మిగిలిన 5 వాగులకు పోలవరం ప్రాజెక్టు వల్ల ఉన్న ముంపుపై సంయుక్త సర్వే విషయంలో మళ్లీ సమావేశమై నిర్ణయం తీసుకుందామన్నారు. సీడబ్ల్యూసీ సర్వేలో తేలిన దానికి మించి తమ రాష్ట్రంలో ముంపు ప్రభావం ఉందని ఒడిశా అధికారి అశుతోష్ దాస్ పేర్కొనగా.. తదుపరి సమావేశంలో చర్చిస్తామని సీడబ్ల్యూసీ చైర్మన్ హామీ ఇచ్చారు.

రుణమాఫీపై తలో మాట

రైతులతో చెలగాటమాడుతున్న సర్కారు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

సోనియా కూడా బీజేపీతో కుమ్మక్కయ్యారా?

అందుకే హెరాల్డ్ కేసులో బెయిలొచ్చిందా? అని ప్రశ్న



హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీపై సీఎం, మంత్రులు తలో మాట చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతు రుణమాఫీకి రూ.7,500 కోట్లు విడుదలయ్యాయని ఆర్థిక మంత్రి చెబుతుంటే.. రూ.17 వేల కోట్లు చేసినట్లు ఇతర మంత్రులు చెబుతున్నారన్నారు. సీఎం అయితే ఏకంగా రూ.31 వేల కోట్లతో అందరికీ మాఫీ చేసేసినట్లు ప్రకటించారని.. వ్యవసాయ మంత్రేమో ఇంకా మాఫీ చేయాల్సి ఉందని అంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇలా ఎవరికి తోచింది వారు చెబుతున్నారని, ఇందులో ఏది నిజమని నిలదీశారు. కాంగ్రెస్ సర్కారు రైతులతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని, కవిత బెయిలు అంశంతోనూ రాజకీయ ప్రయోజనం పొందేందుకు కుటిల యత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కూడా ఎన్డీయేతో కుమ్మక్కైతేనే 2015లో నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కి బెయిల్ వచ్చిందా? అని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి 2015 నుంచి బెయిల్‌పై ఉన్నారన్న సంగతిని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఇవన్నీ ఎన్డీయే హయాంలో జరిగినవేనని, అంటే వీరంతా ఎన్డీయే భాగస్వాములేనా? అని నిలదీశారు. 'మళ్లీ చెబుతున్నా.. మేం అధికారంలోకి వచ్చాక తెలంగాణకు అక్కరకు రాని బొమ్మలను తొలగిస్తాం. రాసిపెట్టుకో' అంటూ రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ఎక్స్‌లో హెచ్చరించారు. రేవంత్ చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అవమానమేనన్నారు. గాంధీ విగ్రహం గాడ్సే పెట్టినట్లుగా ఉంటుందని విమర్శించారు. కాగా, రష్యాకు చెందిన స్కోల్‌కోవో స్టార్టప్ మాస్కోలో సెప్టెంబరు 5 నుంచి 7 వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కేటీఆర్‌ను ఆహ్వానించింది.

అమ్మ కాళ్లకు మొక్కి.. అన్నకు రాఖీ కట్టి

బంజారాహిల్స్ నివాసంలో కవిత భావోద్వేగం.. హారతి ఇచ్చి స్వాగతం పలికిన కేటీఆర్ సతీమణి

- నేడు ఎర్రవెల్లిలో కేసీఆర్‌తో కవిత భేటీ
- ఐదు నెలలు అన్యాయంగా జైల్లో పెట్టారు
- కడిగిన ముత్యంలా బయటపడతా
- ఎప్పటికైనా న్యాయం గెలుస్తుంది: కవిత

హైదరాబాద్, న్యూఢిల్లీ, శంషాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఐదున్నర నెలలు తనను అన్యాయంగా జైల్లో నిర్బంధించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వాపోయారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తుందని.. అపవాదుల నుంచి తాను కడిగిన ముత్యంలా బయటపడతానని చెప్పారు. ప్రజాక్షేత్రంలో తన పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయి, ఐదున్నర నెలలు తిహాడ్ జైల్లో ఉన్న కవిత.. బెయిల్ లభించడంతో బుధవారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. బంజారాహిల్స్‌లోని తన నివాసానికి వచ్చిన ఆమెకు కేటీఆర్ సతీమణి శైలిమ హారతిచ్చి లోపలికి ఆహ్వానించారు. అక్కడ సమీప బంధువులు, పార్టీ ముఖ్యులను ఆమె పలకరించారు. ఇంట్లోకి వెళ్లాక తల్లి శోభ ఆశీర్వాదం తీసుకున్నారు. పూజామందిరంలోకి వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం భర్త అనిల్‌కుమార్‌కు పాదనమస్కారం చేసి.. అన్న కేటీఆర్‌కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్లు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. అంతకుముందు.. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం రాత్రి 9:10 గంటలకు తిహాడ్ జైల్లోంచి కవిత బయటకొచ్చారు. 9:40 గంటలకు ఢిల్లీ వసంత్ విహార్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్నారు.రాత్రి అక్కడే బస చేశారు. రాత్రి ఒంటి గంట దాకా కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కవిత మాట్లాడుతూనే ఉన్నారని ఆ పార్టీకి చెందిన ఓ కీలక నేత చెప్పారు.



తల్లి శోభను ఆలింగనం చేసుకుంటున్న కవిత

బుధవారం మధ్యాహ్నం రౌస్ అవెన్యూ కోర్టు విచారణ నేపథ్యంలో బీఆర్ఎస్ భవన్ నుంచే కవిత వర్చువల్‌గా హాజరయ్యారు. మధ్యాహ్నం 2.40కి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరారు. సాయంత్రం 5:45 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ పార్టీ శ్రేణులు కవితకు ఘనంగా స్వాగతం పలికాయి. వేల సంఖ్యలో చేరుకున్న పార్టీ అభిమానులు, కార్యకర్తలు.. 'వాడెవ్వడు వీడెవ్వడు.. కవితక్కకు అడ్డెవ్వడు'.. 'కవితక్క కడిగిన ముత్యం'.. 'కవితక్క నివ్వు.. కవితక్క సీఎం' అంటూ నినాదాలు చేశారు. మాజీ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కవితకు స్వాగతం పలికారు. అనంతరం భారీ కాన్వాయితో కవిత బంజారాహిల్స్ నివాసానికి బయలుదేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి పక్కన పార్టీ కార్యకర్తలు టపాసులు పేల్చేందుకు ప్రయత్నించగా పోలీసులు వారించారు. కవితకు గజమాల వేసేందుకు కిషన్‌గూడ సమీపంలో కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. కవిత కారు అక్కడ ఆగినా.. ఆమె కారు దిగకపోవడంతో వాహనానికి గుమ్మడికాయతో దిష్టితీసి పంపించి వేశారు. గురువారం ఉదయం తండ్రి కేసీఆర్‌ను కలిసేందుకు కవిత ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లనున్నారు.

తదుపరి విచారణ 11న

సీబీఐ చార్జిషీట్‌పై బుధవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో రెగ్యులర్ విచారణ జరిగింది. కవితకు మంగళవారమే బెయిల్ రావడంతో కోర్టు అనుమతితో విచారణకు ఆమె వర్చువల్‌గా హాజరయ్యారు. సీబీఐ చార్జిషీట్ ఫైలింగ్ సరిగాలేదని గతంలోనే కోర్టు దృష్టికి న్యాయవాదులు తీసుకెళ్లగా, అదే విషయాన్ని మరోసారి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసిందని, అయితే ఆ కాగితాల్లో నాణ్యత లేదని, దీనివల్ల కోర్టు విచారణలో వాదనలు వినిపించడానికి ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. చార్జిషీట్, ఫైలింగ్ ప్రక్రియను సరిచేసి నిందితుల తరఫున న్యాయవాదులకు సెప్టెంబరు 4వ తేదీలోపు ఆ కాపీలను అందజేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణను 11వ తేదీకి వాయిదా వేశారు.

కించపర్చే వారిపై చర్యలు తీసుకోండి!

కవాడిగూడ: ఎమ్మెల్సీ కవితను కించపర్చేలా.. కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్నారని.. వారిపై చట్టప్రకారం చర్యలకు ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు మహిళా కమిషన్‌ను కోరారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారదను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

సాగులో సౌర పంపుసెట్లను పెంచాలి

- రైతుల సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలి
- సమస్యలపై ప్రజలు నన్ను కలవచ్చు
- వరంగల్ పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్



హనుమకొండలో గవర్నర్‌ను సన్మానిస్తున్న మంత్రులు పొంగులేటి, సీతక్క

ములుగు/హనుమకొండ/కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో సౌర పంపుసెట్ల వాడకాన్ని ప్రోత్సహించాలని, రైతుల సుస్థిరాభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తోందని, కానీ.. ఆ వ్యయాన్ని తగ్గించేందుకు రైతులు కూడా పీఎం కుసుమ్ యోజన కింద తమ సౌర విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం, జలవనరులను కాపాడుకోవడం, వ్యర్థాల నుంచి పునరుద్పాదకత, ఇంధన వనరుల పొదుపు వంటి చర్యల ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రధానంగా దృష్టి సారించాలని, లేదంటే మితిమీరి వాడుతున్న ఎరువుల వల్ల భూమి నిస్సారమమయ్యే ప్రమాదం ఉందన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా వరంగల్ వచ్చిన ఆయన బుధవారం ఉదయం హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కవులు, రచయితలు, కళాకారులు, వివిధ రంగాల ప్రముఖులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి నిరంతర ప్రక్రియ, అది సుస్థిరమైనప్పుడే ఆశించిన ఫలితాలు దక్కుతాయని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేయాలని, ఇది ఒక ఉద్యమంలా సాగాలని పేర్కొన్నారు. కాకతీయులు ఏలిన ఓరుగల్లులో పర్యటించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. చారిత్రక దేవాలయాలు, పురాతన కట్టడాలను చూసి దివ్యానుభూతికి లోనయ్యానన్నారు. రాజ్‌భవన్ తలుపులు తెరిచే ఉంటాయని, ఎలాంటి సమస్యలున్నా ప్రజలు తనను స్వేచ్ఛగా కలవవచ్చని పేర్కొన్నారు. ఎన్ఐటీ గెస్ట్‌హౌస్ చేరుకున్న గవర్నర్ వర్మకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్వాగతం పలికారు.

తలసేమియా వార్డు ప్రారంభం

రెడ్ క్రాస్ సొసైటీ సేవలు బాగున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీకి వచ్చిన ఆయన.. నూతనంగా నిర్మించిన తలసేమియా వార్డును ప్రారంభించారు. తలసేమియా బాధితులతో మాట్లాడి బాగోగులు తెలుసుకున్నారు. రెడ్‌క్రాస్ సంస్థ సేవలు, కార్యక్రమాల గురించి చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి గవర్నర్‌కు వివరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. రక్తదానంతో పాటు సేవా కార్యక్రమాలు చేస్తున్న రెడ్‌క్రాస్ అభ్యున్నతికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. తలసేమియా బాధితులకు అండగా రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటా

ములుగు జిల్లాలోని ఓ గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని గవర్నర్ వర్మ తెలిపారు. మంగళవారం రాత్రి లక్నవరంలో బస చేసిన గవర్నర్.. బుధవారం ఉదయం మంత్రి సీతక్క, అధికారులతో కలిసి బోటింగ్ చేస్తూ ప్రకృతిని తిలకించారు. గవర్నర్‌ను జ్ఞాపికతో సత్కరించిన మంత్రి.. జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 29 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com



కురుక్షేత్ర వర్సిటీలో పీజీ డిప్లొమా

కురుక్షేత్ర యూనివర్సిటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ- 'పీజీ డిప్లొమా ఇన్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఈవెనింగ్ ప్రోగ్రామ్. దీనిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద నిర్వహిస్తున్నారు. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఇన్ హిస్టరీ ఉత్తీర్ణులై ఉండాలి. మోడరన్ ఇండియన్ హిస్టరీ ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల:** సెప్టెంబరు 2న
- **ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల:** సెప్టెంబరు 5
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 9 నుంచి
- **వెబ్‌సైట్:** www.kuk.ac.in

అడ్మిషన్స్

ఏసీఎస్ఐఆర్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్ఐఆర్)- ఇంటిగ్రేటెడ్ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(ఐడీడీపీ-ఎంటెక్&పీహెచ్‌డీ); పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

పరిశోధన విభాగాలు

సైన్స్ విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్
● మెడికల్ రీసెర్చ్ ● ఇంజనీరింగ్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.acsir.res.in/admissions



ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్ఆర్ఐ సెకండ్ ఫేజ్

గుంటూరులోని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- ఎన్ఆర్ఐ కోటా కింద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత


గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. అభ్యర్థులు తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in



రిలయన్స్ ఫౌండేషన్ పీజీ స్కాలర్‌షిప్

రిలయన్స్ ఫౌండేషన్- ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఎనర్జీ అండ్ లైఫ్ సైన్సెస్ విభాగాల్లో పీజీ చేస్తున్న అభ్యర్థుల కోసం ఉద్దేశించిన 'పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్స్ 2024-25' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అకడమిక్ మెరిట్, వర్చువల్ ఇంటర్వ్యూ ఆధారంగా మొత్తం 100 మందిని ఎంపిక చేస్తారు. స్కాలర్‌షిప్ కింద ప్రోగ్రామ్ మొత్తానికి ఆరు లక్షలు ఇస్తారు. ఏటా నిర్దేశించిన మొత్తంలో 80 శాతాన్ని సంవత్సర ప్రారంభంలోనే చెల్లిస్తారు. మిగిలిన 20 శాతం మొత్తాన్ని ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ చార్జీలు, కాన్ఫరెన్స్‌లు, ఇతర అకడమిక్ ఖర్చుల నిమిత్తం అందిస్తారు. ఇంటర్న్‌షిప్, వర్క్‌షాప్‌లలో పాల్గొనే అవకాశాలు కల్పిస్తారు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/కంప్యూటర్ సైన్సెస్/మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్/కెమికల్ ఇంజనీరింగ్/రెన్యూవబుల్ అండ్ న్యూ ఎనర్జీ/మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/లైఫ్ సైన్సెస్ విభాగాల్లో ఫుల్ టైమ్ పీజీ(ఎంఈ/ఎమ్మెస్సీ రీసెర్చ్/ఎమ్మెస్సీ/ఎంటెక్ రీసెర్చ్/ఎంటెక్/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్) మొదటి సంవత్సర ప్రవేశం పొంది ఉండాలి. గేట్ 2023 ఎగ్జామ్‌లో 550-1000 మధ్య స్కోర్ సాధించి ఉండాలి. డిగ్రీలో కనీసం 7.5 సీజీపీఏ సాధించి గేట్ రాయనివారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ ఎగ్జామ్‌లో 550 కన్నా తక్కువ స్కోర్ ఉంటే డిగ్రీలో 7.5కి పైగా సీజీపీఏ ఉన్నప్పటికీ దరఖాస్తుకు అనర్హులు. పీజీ రెండో సంవత్సరం చదువుతున్నవారు; ఆన్‌లైన్, డిస్టెన్స్, నాన్ రెగ్యులర్ మోడ్‌లో చదువుతున్నవారు; విదేశాల్లో పీజీ చేస్తున్నవారు కూడా అప్లయ్ చేయడానికి వీలు లేదు.

ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఇందులో వెర్బల్ ఎబిలిటీ, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం గంట. అభ్యర్థి సాధించిన స్కోర్‌ను వెంటనే సంస్థకు పంపుతారు. అభ్యర్థులకు తెలపరు. ఈ టెస్ట్ రాస్తేనే దరఖాస్తును పరిగణనలోకి తీసుకుంటారు. ప్రాక్టీస్ టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 6
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సినవి:** అభ్యర్థి ఫొటో, అడ్రస్ ప్రూఫ్, రెజ్యూమె, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ సర్టిఫికెట్, పీజీ కాలేజీ బోనఫైడ్ సర్టిఫికెట్, రెండు రిఫరెన్స్ లెటర్స్, అనుభవం లేదా ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు, వైకల్యానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం, గేట్ స్కోర్ కార్డ్, పర్సనల్ స్టేట్‌మెంట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్.
- **వెబ్‌సైట్:** www.scholarships.reliancefoundation.org/



జాబ్ కార్నర్

సీఎస్‌బీలో సైంటిస్టులు

బెంగళూరులోని భారత ప్రభుత్వ జౌళీ మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ సిల్క్ బోర్డ్(సీఎస్‌బీ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది

ఖాళీలు: 122

1. క్రాప్ సైన్స్-1, 2, 3
2. వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్
3. నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్-1, 2
4. అగ్రికల్చర్ ఎకనామిక్స్ అండ్ అగ్రి- బిజినెస్ మేనేజ్‌మెంట్ 5. అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్
6. అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్
7. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ

విభాగాలు: ఫారెస్ట్రీ, అగ్రికల్చరల్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, ఫాం మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, యానిమల్ న్యూట్రిషన్, ప్లాంట్ పాథాలజీ, సెరీకల్చర్, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. ఐసీఏఆర్ ఏఐసీఎఫ్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ (పీహెచ్‌డీ)-2024 స్కోరు తప్పనిసరి
జీతం: నెలకు రూ.56,000- రూ.1,77,500
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబర్ 9
వెబ్‌సైట్: https://csb.gov.in/

ఆర్‌వీఎన్ఎల్‌లో మేనేజర్లు

ఢిల్లీలోని రైల్వే వికాస్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్)... రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల సంఖ్య: 24

1. డిప్యూటీ జనరల్ మేనేజర్
2. సీనియర్ మేనేజర్ 3. అసిస్టెంట్ మేనేజర్
4. సీనియర్ ఎగ్జిక్యూటివ్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, బీకామ్, ఎంబీఏ(ఫైనాన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: డీజీఎం పోస్టుకు 45 ఏళ్లు, సీనియర్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు
ఎంపిక: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, పని అనుభవం, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డిస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్ట్ క్రాంతి భవన్, భికాజీ కామా, ఆర్కేపురం, న్యూ ఢిల్లీ చిరునామాకు పంపించాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 5
వెబ్‌సైట్: https://rvnl.org/job

ఐసర్‌లో ఫ్యాకల్టీ

బరంపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల సంఖ్య: 5

1. **ప్రొఫెసర్(కెమికల్ సైన్సెస్): 1** పోస్టు
2. **అసిస్టెంట్ ప్రొఫెసర్ జి-1(ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కంప్యూటర్ సైన్సెస్/బయోలాజికల్ సైన్సెస్):** 4 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
విభాగాలు: సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బయో ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ, స్ట్రక్చరల్ బయాలజీ, న్యూరో బయాలజీ తదితరాలు
జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11
వెబ్‌సైట్:https://iiserbpr.ac.in/

ఈఐఎల్‌లో పోస్టులు

ఢిల్లీలోని ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 77

పోస్టుల వివరాలు

1. ఇంజనీర్
2. ఆఫీసర్
3. సైంటిఫిక్ ఆఫీసర్
4. ఆర్కిటెక్ట్ 3. సైంటిఫిక్ ఆఫీసర్
5. డిప్యూటీ మేనేజర్
6. మేనేజర్
7. సీనియర్ మేనేజర్
8. డిప్యూటీ జనరల్ మేనేజర్

విభాగాలు: కెమికల్, మెకానికల్, సివిల్, లైబ్రరీ, ఫైనాన్స్, ఆర్కిటెక్చర్, ఎలక్ట్రికల్, మెటలర్జీ తదితరాలు
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, బీఈ/బీటెక్ (మెటలర్జికల్/ మెకానికల్/ఎలక్ట్రికల్/సివిల్), పీజీ(బీఎస్సీ), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: ఆఫీసర్ పోస్టుకు 28 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు 47 ఏళ్లు, మిగతా పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
జీతం: నెలకు మేనేజీరియల్ పోస్టులకు రూ.70,000 - రూ.2,80,000; మిగతా పోస్టులకు రూ.60,000- రూ.1,80,000.
పని ప్రదేశాలు: ఢిల్లీ, గురుగ్రామ్, ముంబయి, చెన్నై, వడోదర, కోల్‌కతా
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ట్రేడ్ టెస్ట్ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 4
వెబ్‌సైట్:https://www.bemlindia.in/

ఎయిమ్స్ నాగపూర్‌లో సీనియర్ రెసిడెంట్‌లు

మహారాష్ట్ర, నాగపూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఖాళీలు: 60

విభాగాలు: అనస్థీషియాలజీ, కార్డియాలజీ, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మెడికల్ హెమటాలజీ, న్యూరాలజీ, పీడియాట్రిక్స్ సర్జరీ, న్యూరాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ మొదలైనవి.
అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం కూడా ఉండాలి.
జీతం: నెలకు రూ.67,700
వయసు: 45 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు రూ.250; దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.
ఎంపిక: విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: సెప్టెంబరు 9
ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 11
వేదిక: అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎయిమ్స్ క్యాంపస్, మిహాన్, నాగపూర్
వెబ్‌సైట్: https://aiimsnagpur.edu.in/



లిటిల్స్



చెడుపనులకు సాయపడితే...

రామాపురంలో ఉండే ఒక వ్యాపారికి తనది కాకున్నా ఉచితంగా వచ్చే ఏ సొమ్ము లేదా వస్తువుఅన్నా చాలా ప్రీతి.


ఒక రోజు రాత్రి అతను తన కొట్టు మూసే సమయానికి ఒక వ్యక్తి పరిగెడుతూవచ్చి, కొట్టులోకి దూరి వ్యాపారితో ఇలా అన్నాడు.' శెట్టి గారూ నేను ఈ ఊరి జమీందారు ఇంటిలో దొంగతనం చేసి, చాలా బంగారం, డబ్బు దోచుకుని వస్తున్నాను. నన్ను రాజ భటులు వెంబడిస్తున్నారు. నా అదృష్టం బాగుండి ఎలాగో మీరు కనబడ్డారు. నేను మీ కొట్టులో దాక్కున్న విషయం వారికి చెప్పకుండాఉంటే,నేను దోచుకున్న సొమ్ములో సగం మీకు ఇస్తాను దయచేసి నాకు ఈ సాయం చేయండి'అన్నాడు.

ఉచితంగా డబ్బుబంగారం దొరుకుతున్నాయి కదా అనే ఆశతో దానికి అంగీకరించాడు వ్యాపారి. అటుగా రాజభటులు వచ్చి, దొంగను గురించి అడిగితే,నేను కొట్టు కట్టేసి చాలా సేపయింది.ఈ వైపు అసలు ఎవరూ రాలేదు' అని చెప్పి, వారిని పంపివేశాడు వ్యాపారి. వారంతా దూరంగా వెళ్లిపోయారు అని తెలియగానే వ్యాపారి కొట్టులోపలికి వచ్చి,అక్కడ దాక్కున్న దొంగను'ఏదీనాకు నువ్వు ఇస్తానుఅన్న వాటా ఇవ్వు. నేను ఇచ్చిన మాట ప్రకారం నిన్ను భటులనుంచి కాపాడాను కదా' అన్నాడు. ఆ మాటలు విన్న దొంగ ఇక్కడే ఆగండిమీ వాటా సంచిలోనుండి బయటకు తీయాలి అని చెప్పి, సంచీలో నుంచి ఒక కత్తి, తాడు బయటకు తీసి, కత్తిని వ్యాపారి మెడకు పెట్టి బెదిరించి, అతన్ని ఒక ఆ తాడుతో కట్టేశాడు, అపుడు నెమ్మదిగా వ్యాపారి కొట్టులో ఉన్న డబ్బు ఇంకా ఇతర విలువైన వస్తువులన్నీ మూటకట్టి,తన సంచీలో వేసుకుని అక్కడినుండి వెళ్లిపోయాడు ఆ మర్నాడు వ్యాపారి తన కొట్టుచూసుకుని బాధతో బావురుమన్నాడు,. అత్యాశకుపోయి, దొంగచేసిన చెడుపనికి సాయం చేసినందుకు అనవసరంగా తన సొమ్ము కూడా పోయిందేఅని బాధపడ్డాడు. అందుకే ఇతరులుచెడుపనులుచేస్తున్నారని తెలిసినపుడు సాయపడటం సంగతి అటుంచి, వారికి దూరంగా ఉండటం మంచిది.


7 తేడాలు కనుక్కోండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



సరైన నీడను గుర్తించండి



డైలీ సుడోకు - 396

					5		4	6
	1				8			
		5		1				7
	7					9		4
1			5		2			8
4		2					5	
7				5		8		
			3				7	
9	8		6					

సుడోకు - 395 సమాధానం

1	9	4	2	8	5	7	3	6
8	6	2	1	3	7	4	9	5
7	3	5	9	4	6	1	2	8
6	2	9	7	5	8	3	4	1
3	5	8	4	2	1	9	6	7
4	7	1	6	9	3	5	8	2
5	8	6	3	7	9	2	1	4
9	4	7	8	1	2	6	5	3
2	1	3	5	6	4	8	7	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.